
జిల్లాలో ఎక్కడచూసినా గంజాయి గుప్పుగుప్పుమంటోంది. యువత ఆ మత్తులో మునిగితేలుతోంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యపు తీరు, వైసీపీ నేతల కక్కుర్తి గంజాయి ముఠాలకు లైసెన్స్ ఇచ్చినట్లైంది. డబ్బు సంపాదనే ధ్యేయంగా అక్రమార్కులు రెచ్చిపోయారు. జిల్లాకు దొంగ మార్గాలలో భారీగా సరుకును రవాణా చేసి ఏజెంట్లను పెట్టుకుని మరీ విక్రయిస్తున్నారు. కాలేజీ విద్యార్థులు, ఖాళీగా తిరిగే యువకులే లక్ష్యంగా వారిని మత్తుకు బానిసలను చేశారు. కొందరు స్వార్థపరులు కూడా తమ రాజకీయ అవసరాలకు గంజాయి ముఠాలను తయారుచేశారు. ఆ మత్తులో యువకులు దాడులు, అరాచకాలకు పాల్పడుతున్నారు. వీరి కారణంగా నిత్యం ఏదో ఒకచోట గొడవలు, వివాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. జనం ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కాగా ఆ మహమ్మారిని అరికట్టేందుకు ప్రస్తుత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



గుప్పుగుప్పు..!

ఒంగోలు(క్రైం), జూన్ 24 : గంజాయి మత్తుకు యువత చిత్తవుతున్నారు. కొందరు అక్రమార్కులు సంపాదనే ధ్యేయంగా ఆ విషసంస్కృతిని గ్రామీణ ప్రాంతాలకు పాకించారు. అనేక కుటుంబాలలో విషాదం మిగిల్చారు. కోట్ల రూపాయలు కొల్లగొట్టడమే ధ్యేయం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. పోలీసులు, ఎస్ఈబీ అధికారులు జిల్లాలో గత ఐదేళ్లలో వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ కోట్లలో ఉంటుంది. సరుకు విచ్చలవిడిగా దొరుకుతుండటంతో యువత, విద్యార్థులు, నిరుద్యోగులు మత్తుకు బానిసలుగా మారారు. జిల్లాలోని గంజాయి సిగిరెట్లు, చాక్‌లెట్లు అనేక ప్రాంతాలలో పట్టుబడ్డాయి. కొందరు ముఠాలుగా ఏర్పడి యువకులను మత్తుకు బానిసలుగా చేస్తున్నారు. అలాగే చదువుకుంటున్న వారిని కుటుంబాలకు దూరం చేస్తున్నారు. బిడ్డల బంగారు భవిష్యత్‌ను ఆశించిన తల్లిదండ్రులకు చివరకు నిరాశే మిగులుతోంది. మెడికోలు సైతం గంజాయికి అలవాటు పడి కళాశాలలో విధ్వంసం సృష్టించిన ఘటనలు ఉన్నాయి. మొన్నటికి మొన్న ఒంగోలు శర్మాకాలేజీ వద్ద గంజాయి బ్యాచ్ ఓ వ్యక్తిపై దాడిచేసిన ఘటన నగరవాసులను భయకంపితులను చేసింది. గంజాయికి బానిసలుగా మారిన యువకులు అనారోగ్యం పాలై ఆసుపత్రులు పాలవుతున్నారు. ఒంగోలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీఅడిక్షన్ సెంటర్‌లో నెలకు పదులసంఖ్యలో యువకులు చికిత్స పొందటం ఆందోళన కలిగించే అంశం. ఇలా భారీగా జిల్లాకు కిలోల కొద్దీ గంజాయి నిత్యం వస్తుండగా, పనిలో పనిగా ఇక్కడ కూడా సాగుచేయడం ఆందోళన కలిగించే అంశం. పశ్చిమప్రాంతంలో పెద్దఎత్తున గంజాయి సాగు చేయగా ఎస్ఈబీ అధికారుల ధ్వంసం చేసిన ఘటనలు ఉన్నాయి.

భారీగా సరఫరా ముఠాలు

యర్రగొండపాలెంలో ఓ రైతు కంది పంట సాగు మధ్యలో 282 గంజాయి మొక్కలను పెంచాడు. ఈ మొక్కలను ఎస్ఈబీ అధికారులు ధ్వంసం చేశారు. మార్కాపురంలోని బాపూజీ కాలనీలో తన ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచాడు. దోర్నాలలో ఓ రైతు మిర్చి పంటలో గంజాయి మొక్కలు సాగుచేశారు. అంతేకాకుండా ఇతర ప్రాంతాల నుంచి భారీగా గంజాయి తరలించి పొట్లాల రూపంలో విక్రయాలు చేశారు. మరి కొంతమంది మొబైల్ విక్రయాలు చేశారు. ఆటోలలో గంజాయి పొట్లాలు పెట్టుకొని ఫోన్ కాల్స్‌తో అవసరమైన వారికి సరఫరా చేశారు. ఇలా గంజాయి సరఫరా చేసే ముఠాలు అనేకం ఉన్నాయి.

చీమకుర్తిలో గంజాయి చాక్‌లెట్ల విక్రయాలు

గ్రానైట్ కార్మికులే లక్ష్యంగా గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్, చీమకుర్తిలోని గ్రానైట్ క్వారీల వద్ద గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. చీమకుర్తి మండలం బూదవాడలో ఓ బడ్డీకొట్టులో గంజాయి చాక్‌లెట్లు విక్రయిస్తూ ఉత్తరాది వ్యక్తి ఎస్ఈబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఒంగోలులోని 60 అడుగుల రోడ్డులో ఓ లాడ్జిలో మకాం వేసిన ఓ గంజాయి విక్రయ ముఠాను ఇటీవల ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నారు. ఇలా జిల్లాలో గంజాయి విక్రయించే అనేక మందిని పట్టుకొని కేసులు నమోదు చేసినప్పటికీ దందా మాత్రం ఆగడంలేదు. అంతేకాకుండా గంజాయి సరఫరా చేసే ముఠాలలో విద్యార్థులు ఉండటం బాధాకరమైన అంశంగా చెప్పవచ్చు.

★ ఉక్కుపాదానికి రంగం సిద్ధం

నూతనంగా ఏర్పడిన టీడీపీ కూటమి ప్రభుత్వం గంజాయి రవాణా, వినియోగాన్ని సమూలంగా అరికట్టి, యువతను సన్మార్గంలో పెడతామని ప్రకటన చేసింది. సాక్షాత్తు హోంమంత్రి గంజాయి అక్రమ రవాణా మీద దృష్టిసారించాలని పోలీసు శాఖకు ఆదేశాలు జారీచేశారు. అలాగే సోమవారం జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా గంజాయి దందాపై ఉక్కుపాదం మోపాలని సీఎం నిర్ణయించారు. అందుకోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారు. అదేక్రమంలో జిల్లా పోలీసు గంజాయిని అరికట్టేందుకు పోస్టర్‌ను విడుదల చేశారు.

జిల్లాలో 4,539 కిలోల గంజాయి పట్టివేత



జిల్లాలో గత ఐదేళ్లలో పోలీసులు, ఎస్ఈబీ అధికారులు 4,539 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న సరుకు విలువ సుమారుగా రూ.4.50 కోట్లు ఉండవచ్చని అంచనా. బహిరంగ మార్కెట్లో ఇంకా ఎక్కువే ఉండవచ్చు. కిలో గంజాయి నాణ్యతను బట్టి రూ.10వేలు ఉంటుంది. 2019లో 1,200 కిలోలు, 2020లో 1,050 కిలోలు, 2021లో 813 కిలోలు, 2022లో 950 కిలోలు, 2023లో 526 కిలోలు గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా పోలీసులకు, ఎస్ఈబీ అధికారులకు దొరకకుండా ఎక్కువ మొత్తంలో విక్రయాలు జరిగాయి. 2021లో అప్పటివరకు పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి సుమారు రూ.49లక్షల విలువ చేస్తుంది. దానిని ఎస్పీ ఆధ్వర్యంలో దహనం చేశారు. అయినప్పటికీ గంజాయి విక్రేతలు పోలీసులు కఠినచర్యలు తీసుకున్నప్పటికీ ఈ ముఠాలు కార్యకలాపాలు కొనసాగుతూనే ఉన్నాయి.

గంజాయి ఘటనలు మరికొన్ని...

- ఒంగోలులో ఇటీవల శర్మా కాలేజీ వద్ద ఓ ఆటోడ్రైవర్‌పై గంజాయి ముఠా దాడిచేసి కర్రలతో విచక్షణారహితంగా కొట్టింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో రాష్ట్రవ్యాప్తంగా వైరలైంది.
- గతంలో రిమ్స్‌లోని మెడికోలు గంజాయి మత్తుకు అలవాటు పడి తరగతి గదులలోనే విధ్వంసం సృష్టించారు. అలవాటు ఉన్న విద్యార్థులు ఇదేమిటని ప్రశ్నించిన తోటి విద్యార్థులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.
- ఒంగోలు రామ్‌నగర్‌కు చెందిన ఓ విద్యార్థి తన స్నేహితుల ద్వారా మత్తుకు అలవాటు పడి తల్లిపైనే దాడి చేశాడు.
- ఒంగోలు కమ్మపాలెం సమీప అప్పాయికుంటలో తెప్పోత్సవం అనంతరం నుంచి సీతారామ ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను తిరిగి కొప్పోలు తీసుకెళుతుండగా గంజాయి మత్తులో ఉన్న యువకులు పూజారులపైన దాడిచేసి విగ్రహాలపై మద్యం పోశారు.
- ఒంగోలు కొత్త బైపాస్ రోడ్డులో గంజాయి మత్తులో యువకులు ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.





వాగు పోరంబోకులో ఏర్పాటుచేసిన పార్కు

వాగు పోరంబోకులో కట్టడాలను

కూల్చివేయండి

మూడు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తిచేయాలి

ఉత్తర్వులు జారీచేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

అక్రమాలను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 24 : మండలకేంద్రమైన సంతనూతలపాడులో వాగు పోరంబోకు స్థలంలో అక్రమంగా నిర్మాణంలో ఉన్న పార్కును కూల్చివేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. అధికారం తమ చేతిలో ఉందన్న కారణంతో కోర్టు స్టే ఉన్నా స్థానిక మండల నాయకుడు ఇష్టారీతిన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతిలో ఏప్రిల్ 1న 'నీ దుంపా తెగ' శీర్షికన కథనం ప్రచురితమైంది. మరోవైపు ఆ స్థలం వాగుపోరంబోకు అని అందులో ఎలాంటి కట్టడాలు చేపట్టవద్దని గతంలోనే స్థానికులు కోర్టును కూడా ఆశ్రయించారు. దీంతో అక్కడ నిర్మిస్తున్న రైతుభరోసా కేంద్రం మధ్యలోనే నిలిచిపోయింది. సార్వత్రిక ఎన్నికల ముందు వైసీపీ మండల కీలక నేత ఎలాంటి అనుమతులు లేకుండానే పార్కు నిర్మాణ పనులు చేపట్టారు. ఆ పనులు చేపట్టేందుకు పంచాయతీ తీర్మానంతోపాటు పంచాయతీరాజ్ నుంచి కూడా నిధుల మంజూరుకు ఎలాంటి ప్రతిపాదనలు రూపొందించలేదు. ఇటీవల సదరు వైసీపీ నాయకుడు ఆ నిర్మాణాలను కొనసాగించాలని కోరుతూ కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసేందుకు ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ఆ అక్రమ నిర్మాణాలపై హైకోర్టులో కేసు ఉండటంతో దీనిపై పెద్దగా పట్టించుకున్న పరిస్థితి లేదు. వచ్చేనెల 7వతేదీన అక్రమ కట్టడాలపై హైకోర్టులో విచారణ కూడా జరగనున్న నేపథ్యంలో కలెక్టర్ దినేష్‌కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అక్కడి జగనన్న లేఅవుట్ సమీపంలో 220/1 సర్వే నెంబరులో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేయాలని తహసీల్దార్‌తోపాటు పంచాయతీ అధికారులను కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

రోడ్డునపడ్డ కాంట్రాక్టర్

ఈ అక్రమ కట్టడాలను మూడు రోజుల్లో కూల్చివేయాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో నిర్మాణాలను చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్డున పడ్డారు. పార్కు నిర్మాణంతోపాటు కల్వర్టులు, లెవలింగ్ కోసం సుమారు రూ.30లక్షలకు పైగా ఖర్చు చేసినట్లు సమాచారం. ఆ మండలంలో కీలకంగా వ్యవహరించే నాయకుడి మాటలు కాదనలేక పనులు చేసిన కాంట్రాక్టర్ ఇప్పుడు లబోదిబోమంటున్నారు. తిరిగి వైసీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, అన్ని తాను చూసుకుంటానని భరోసా ఇవ్వడంతో ఆ పనులు చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఆ పనులు వాగుపోరంబోకు స్థలంలో నిర్మించడం, హైకోర్టులో కేసు ఉండటం తదితర కారణాలు ఆ కాంట్రాక్టర్ తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అధికారులకు తెలియకుండానే నిర్మాణాలు

ఏదైనా నిర్మాణాలు చేపట్టాలంటే అందుకు సంబంధించి ప్రతిపాదనలను సంబంధిత అధికారుల ద్వారా చేయాల్సి ఉంది. కానీ అవేమి పట్టించుకోకుండా అధికారం తన చేతిలో ఉందన్న కారణంతో ఇష్టారీతిన నిర్మాణాలు చేపట్టడం విశేషం. కనీసం ఆ పార్కు నిర్మాణాన్ని పీఆర్ ద్వారా చేపట్టడంతోపాటు పంచాయతీలో కూడా తీర్మానం చేయాల్సి ఉంది. కానీ అవేమీ పట్టించుకోకపోవడంతో ఇప్పుడు ఆ నిర్మాణాలను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రజా ఫిర్యాదుల

పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

మీకోసంలో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 24: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(మీకోసం) కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. అన్నిశాఖల ఉన్నతాధికారులు తమ లాగిన్‌కు వచ్చిన అర్జీలను రెగ్యులర్‌గా పరిశీలిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. చాలావరకు సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలని చెప్పారు. ఆర్థికపరమైన, న్యాయపరమైన అంశాలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే రాష్ట్రప్రభుత్వానికి లేఖ రాస్తామని కలెక్టర్ తెలిపారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో 214 మంది తమ సమస్యలను విన్నవించుకున్నారు. అనంతరం ఎన్నికల విధుల నిర్వహణలో ఉత్తమ పనితీరు చూపిన అధికారులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో ఆర్.శ్రీలత, ఎస్డీసీ లోకేశ్వరరావు, మాధురి తదితరులు పాల్గొన్నారు

» జిల్లాలో గత నాలుగు నెలలుగా తనిఖీల పేరుతో కొందరు అనేక ఇబ్బందులు పెడుతున్నారని అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, కోశాధికారి కేవీ సుబ్బమ్మ, సహాయ కార్యదర్శి ఎన్. ధనలక్ష్మిలు ఫిర్యాదుచేశారు. సురేష్‌బాబు బృందం జిల్లాలో ఆర్టీఐ కింద పిడి ఆర్డర్ ఇచ్చారని చెబుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు తనిఖీలకు వస్తున్నారని ఫిర్యాదుచేశారు. జిల్లాలోని అనేక మండలాల్లో అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురిచేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఇటువంటి తనిఖీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

» ఇంటి స్థలాలను ఇప్పించాలని కొండపి మండలం పెట్లూరుకు చెందిన దళితులు కోరారు. 1983లో అప్పటి ప్రభుత్వం 450 సర్వేనెంబరులో 2.20 ఎకరాల భూమిలో ఇంటిపట్టాలు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి ఇంటిస్థలాలు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం కుటుంబ జనాభా పెరిగినందున ఇంటిస్థలాలు ఇచ్చి ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

వైద్యకళాశాల ఏర్పాటు

పనుల పరిశీలన

ఎన్ఎంసీ త్రిసభ్య కమిటీ నివేదిక సిద్ధం

మార్కాపురం, జూన్ 24: మార్కాపురంలో ప్రారంభించనున్న వైద్యకళాశాల నిర్మాణ పనులను, దానికి అనుబంధంగా ఏర్పాటు చేసిన వైద్యశాలలో రోగులకు, సిబ్బందికి చేసిన ఏర్పాట్లను నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు సోమవారం పరిశీలించారు. కమిటీ చైర్మన్ డాక్టర్ బీవ బొరుహ, సభ్యులు డాక్టర్ సంజయ్‌కుమార్ భట్, డాక్టర్ సతీష్ చావన్‌లు తొలుత కొనకనమిట్లలో ఏర్పాటు చేసిన రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌ను, మార్కాపురంలో నూతనంగా ప్రారంభించిన అర్బన్‌హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం మార్కాపురంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ వైద్య కళాశాల కోసం నిర్మించిన అదనపు బెడ్ల నిర్మాణాలను, వైద్యుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదులను పరిశీలించారు. మార్కాపురం మండలం రాయవరం వద్ద నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల భవనం 2024 జూన్ 31 నాటికి ఎన్ఎంసీకి అందజేయాలి. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలిస్తే భవన నిర్మాణ పనులు పూర్తయ్యేట్టు కనిపించడం లేదని నిర్ధారించుకున్నట్లు సమాచారం. అంతే కాక మార్కాపురంలో నిర్మించిన అదనపు బెడ్ల సౌకర్యాల కోసం చేపట్టిన నిర్మాణాలలో సైతం స్వల్ప విభేదాలున్నట్లు సమాచారం. కమిటీ సభ్యులు తమ నివేదికను ఎన్ఎంసీకి అందజేసేందుకు సిద్ధం చేశారు. నివేదిక ఆధారంగా జాతీయ స్థాయిలో వైద్యకళాశాల ఏర్పాట్లపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. కార్యక్రమంలో వైద్యకళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డీఎంఏ డాక్టర్ ఎస్.వి.వి.నాగ రాజమన్నార్, సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రి, ప్రొఫెసర్ డాక్టర్ పి.రవికుమార్ పాల్గొన్నారు.



వైద్యశాలను పరిశీలిస్తున్న ఎన్ఎంసీ కమిటీ సభ్యులు

27న జిల్లాకు కొత్త కలెక్టర్

నేడు దినేష్‌కుమార్‌కు వీడ్కోలు సభ



కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లాకు తాజాగా నియమితులైన కలెక్టర్ తమీమ్ అన్సారియా ఈనెల 27న రానున్నారు. ఆరోజు ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆ మేరకు కలెక్టర్ కార్యాలయ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాగా ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసి అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అయిన ఏఎస్ దినేష్‌కుమార్ 26వతేదీన రిలీవ్ కానున్నారు. ఆ మేరకు సంబంధిత ఉద్యోగులకు ఆయన స్పష్టత ఇచ్చారు. దాదాపు రెండేళ్లకుపైగా దినేష్‌కుమార్ కలెక్టర్‌గా పనిచేశారు. పెద్దగా వివాదాలు, ఆరోపణలు లేకుండానే పనిచేశారు. వైసీపీ ప్రజాప్రతినిధులకు అనుకూలంగా పనిచేశారన్న అభిప్రాయం ఆయావర్గాల్లో ఉన్నప్పటికీ అధికారవర్గాలతో మాత్రం సమన్వయంతో స్నేహపూర్వక వాతావరణంలో పనిచేశారన్న గుర్తింపు ఉంది. కాగా దినేష్‌కుమార్ ఈనెల 26న రిలీవ్ కానున్న నేపథ్యంలో మంగళవారం ఆయనకు జిల్లా అధికారులు వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు.


ఎంపీగా ప్రమాణస్వీకారం చేసిన మాగుంటను అభినందిస్తున్న మాగుంట అనుచరులు, టీడీపీ శ్రేణులు

ఎంపీగా మాగుంట ప్రమాణస్వీకారం

- అభినందించిన నేతలు, అనుచరులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 24 : ఒంగోలు పార్లమెంట్ సభ్యునిగా మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి ఐదో పర్యాయం ఎంపీగా ప్రమాణస్వీకారం చేశారు. మాగుంట ప్రమాణస్వీకారానికి ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి భారీగా ఆయన అనుచరులు, తెలుగుదేశం పార్టీ నాయకులు తరలివెళ్లారు. అనంతరం టీడీపీ నాయకులు, అనుచరులు పార్లమెంట్ భవన్‌లో కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాతా ప్రసాద్, పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డి, కుప్పా రంగసాయి, బెల్లం సత్యనారాయణ, కండే శ్రీనివాసులు, మిరియాల కృష్ణతో పాటు పలువురు టీడీపీ నాయకులు, మాగుంట అనుచరులు ఉన్నారు.

పంచాయతీ నిధులు మింగిన వారిపై చర్యలు తీసుకోవాలి

టంగుటూరు, జూన్ 24 : మండలంలోని మర్లపాడు పంచాయతీ అభివృద్ధి నిధులు దారి మళ్లాయి. ఆ నిధులను తిరిగి రాబట్టి, అందుకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మర్లపాడు గ్రామస్థులు కోరారు. ఆ మేరకు వారు వినతిపత్రం సమర్పించారు. పైలెట్ ప్రాజెక్టుగా మర్లపాడు రక్షిత మంచినీటి పథకం కొన్నేళ్లుగా కొనసాగుతోంది. దీనికి చైర్మన్‌గా ఉన్న స్థానిక వైసీపీ నాయకుడు బొల్లినేని వెంకటేశ్వర్లు నిర్వహణ చేస్తున్నారు. ఆ పథకానికి సంబంధించిన నిధులను వెంకటేశ్వర్లు తన సొంతానికి ఖర్చు చేసుకున్నాడు. ఈవిధంగా పైలెట్ ప్రాజెక్టు విద్యుత్ బిల్లుల కోసం సైతం రూ.22 లక్షల పంచాయతీ నిధులు చెల్లించారు. దారి మళ్లిన పంచాయతీ నిధులను తిరిగి రాబట్టాలని, పైలెట్ ప్రాజెక్టు నిర్వహణ నిధుల లెక్కలు బహిరంగపరచాలని, పైలెట్ ప్రాజెక్టు నిర్వహణ మెరుగుపరచాలని కలెక్టర్‌ను కోరారు.


పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

కొండపి, జూలై 24 : మండలంలోని పెట్లూరు ఆర్‌బీకేలో సోమవారం రైతులకు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను ఏవో డి.విజయకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంటలకు పచ్చిరొట్ట ఎరువులు ఎంతో మేలు చేస్తాయని రైతులకు వివరించారు. ప్రధాన పంటలు వేసే ముందుగా పచ్చిరొట్ట విత్తనాలు పొలాల్లో చల్లి పైరు 30 నుంచి 40 రోజుల వ్యవధిలో పూత దశలో ఉన్నప్పుడు కలియదున్నడం వలన నేల సారవంతమవుతుందన్నారు. అన్ని ఆర్‌బీకేల పరిధిలో జనుములు 100 క్వింటాళ్లు, పిల్లిపెసరలు 5క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని, రైతులకు అవసరమైన మేరకు పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పెట్లూరు వీఏఏ ఐ. పద్మ పాల్గొన్నారు.


విద్యాదాతలు చిడిపోతు, కోటపాటిలను సన్మానిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

బడిఈడు పిల్లలంతా ప్రభుత్వ బడుల్లో ఉండాలి

టంగుటూరు, జూన్ 24 : బడి ఈడు పిల్లలంతా ప్రభుత్వ బడుల్లో ఉండాలని మండల విద్యాశాఖాధికారి-2 తన్నీరు బాలాజీ సూచించారు. మండలంలోని వెలగపూడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం తల్లిదండ్రుల సమావేశం జరిగింది. సమావేశానికి మండల విద్యాధికారి-1 చెంచుపున్నయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ చేశారు. సరోజా సేవా ట్రస్ట్ ఆధ్వర్యాన చిడిపోతు వెంకటేశ్వర్లు, కోటపాటి వెంకటేశ్వర్లు విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు మొత్తం 40 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మస్తాన్, వెల్ఫేర్ అసిస్టెంట్ శమీమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యాదాతలైన చిడిపోతు వెంకటేశ్వర్లు, కోటపాటి వెంకటేశ్వర్లును సన్మానించారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ లబ్ధిదారులు

వైసీపీ నేత చెర నుంచి భూమిని కాపాడాలి

కొండపి, జూన్ 24 : మండలంలోని పెట్లూరు గ్రామంలో గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కల్లూరి హరిబాబు చెర నుంచి తమకు కేటాయించిన భూమిని కాపాడాలని ఎస్సీ కాలనీవాసులు దాదాపు 100 మందికి పైగా సోమవారం జిల్లా కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తిచేశారు. తమకు ఇచ్చిన స్థలంలో గడిచిన ఐదేళ్లుగా హరిబాబు పొగాకు సాగు చేసుకుంటూ తమను ఆ స్థలంలోకి రాకుండా బెదిరించాడని, ఇటీవల నెలరోజుల క్రితం తాము తమ స్థలాలను స్వాధీనం చేసుకుని తాత్కాలికంగా గుడిసెలు వేసుకున్నామని వారు వివరించారు. తిరిగి తమ గుడిసెలను పీకేస్తానని అతను బెదిరిస్తున్నాడని వాపోయారు. ఆ స్థలానికి ఇంటిపట్టాలు ఇవ్వాలని ఎస్సీకాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొండపి, జూన్ 24 : కొండపిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 6, 7 తరగతుల ప్రవేశానికి విద్యార్థులు ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. 26వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందని, వివరాలకు కొండపి గురుకుల పాఠశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

శిథిల భవనాల్లో విధులు..!

సొంత ఆస్తులు లీజుకు..

కూలిపోయే గోడల మధ్య ఉద్యోగాలు

నిధులు లేక మధ్యలోనే నిలిచిన నూతన భవనాల నిర్మాణం

అధ్వానంగా ఎన్సెస్పీ కార్యాలయం


పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన భవన నిర్మాణం

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 24 : ఎన్సెస్పీ శాఖకు సొంత ఆస్తులకు కొదువ లేదు. కళ్లముందు కోట్ల విలువ చేసే భూములు ఉన్నా, వాటిని ఉపయోగించుకుని వినియోగంలోకి తెచ్చుకునే పరిస్థితి లేదు. దీంతో యాభై ఏళ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడిపోతోంది. అయినా ఆ భవనంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది రోజూ భయం గుప్పిట్లోనే ఉద్యోగాలు చేస్తున్నారు. వివరాల్లోకెళితే.. స్థానిక మినీ స్టేడియం వెనుక వైపున ఉన్న ఎన్సెస్పీ కార్యాలయానికి సమీపంలో కోట్లు విలువ చేసే భూమి ఉన్నా, దానిని గత వైసీపీ పాలనలో ఆ పార్టీ కార్యాలయానికి కట్టబెట్టారు. సుమారు 1.64 ఎకరాల భూమిని తాము ఉపయోగించుకోలేకపోవడంతో అప్పటి వైసీపీ అధికారంలో ఉండగా పార్టీ కార్యాలయం కోసం కేటాయించారు. దీంతో కళ్లముందు కోట్ల విలువ చేసే వైసీపీ కార్యాలయం ఉండగా, కార్యాలయ ఉద్యోగులు మాత్రం శిథిలమైన భవనంలోనే ఏళ్ళతరబడి ఉద్యోగాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంచి ఉత్తరం వైపున పది సంవత్సరాల క్రితం అర ఎకరా స్థలంలో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదించగా, అందు కోసం సుమారు రూ. 1.5 కోట్లు ఖర్చు చేశారు. ఆ తర్వాత ప్రపంచ బ్యాంకు నుంచి మంజూరు అయ్యే నిధులు నిలిచిపోవడంతో ఒకటిన్నర కోటి నిధులు వృథా అయ్యాయి. దీంతో యాభైఏళ్ళ క్రితం నిర్మించిన భవనంలోనే ఉద్యోగాలు చేస్తుండగా, కనీసం ర్యాంకులు లేవు. ఐరన్ బీరువాలు లేవు. మరోవైపు కూర్చునేందుకు కనీసం కుర్చీలు కూడా లేకపోవడంతో ఫైళ్ళు భద్రత కరువైపోయింది. వర్షం వస్తే కార్యాలయం లోపలకి ఏడు అడుగుల ఎత్తులో నీరు నిలవడం, పాములు సంచరించడంతో ఉద్యోగులు భయం గుప్పిట్లో జీవిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఎన్సెస్పీ ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలని కోరుతున్నారు. నూతన భవన నిర్మాణం లేదా, అన్నీ మౌలిక వసతులు కలిగిన భవనంలోకి కార్యాలయం మార్పు చేయాలని కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న ఎన్సెస్పీ కార్యాలయం


పెచ్చులూడిన పిల్లర్


శ్లాబు పెచ్చులూడి బయటపడిన ఇనుపచువ్వలు

హర్షిణీలో 165 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

ఒంగోలు(విద్య), జూన్ 24 : ఒంగోలులోని శ్రీ హర్షిణీ పీజీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 165 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. హైదరాబాద్‌కు చెందిన టెక్ మహేంద్ర కంపెనీలో 15 మంది ఎంపిక కాగా వీరికి సంవత్సర వేతనం రూ 2.5 లక్షలు, బెంగళూరుకు చెందిన ఆల్‌సెక్ కంపెనీకి 36 మంది విద్యార్థులు ఎంపిక కాగా వీరికి ఏడాదికి వేతనం రూ. 2.13 లక్షలు. హైదరాబాద్‌కు చెందిన సుతర్ ల్యాండ్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీకి 15 మంది ఎంపిక కాగా వీరికి ఏడాదికి వేతనం రూ. 3 లక్షలు, హైదరాబాద్‌కు చెందిన జెన్‌ప్యాక్ట్ కంపెనీకి 60 మంది ఎంపిక కాగా వీరికి ఏడాదికి వేతనం రూ. 2.4 లక్షలు, హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మసీ కంపెనీకి 16 మంది విద్యార్థులు ఎంపిక కాగా వీరికి ఏడాదికి వేతనం రూ. 2 లక్షలు, ఒంగోలుకు చెందిన ఏసీఈ స్పోకెన్ ఇంగ్లీషు అండ్ కమ్యూనికేషన్స్ స్కిల్స్ అకాడమికి 23 మంది విద్యార్థులకు ఎంపిక కాగా వీరికి ఏడాదికి వేతనం రూ. 1.8 లక్షలు అందనుంది. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో జరిగిన అభినందన సభలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ఏటా డిగ్రీ మాత్రమే కాకుండా డిగ్రీతో పాటు క్యాంపస్ ఎంపికల ద్వారా 775 మంది విద్యార్థులను వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరం నుంచి కాంపిటేటివ్ ఎగ్జామ్స్ దృష్టిలో ఉంచుకొని క్యాంపస్ ఇంటర్వ్యూలకు అవసరమైన అర్థమెటిక్, రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌ను విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ఏవో ర్యాంకర్స్ శ్రీనివాసరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఉన్నారు.


ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు


దాతలను సన్మానిస్తున్న గ్రంథాలయ అధికారులు

దాతల సహకారంతో అందుబాటులోకి కంప్యూటర్లు

ఒంగోలు(కల్చరల్), జూన్ 24: జిల్లా గ్రంథాలయంలో గత కొన్ని సంవత్సరాలుగా పనిచేయకుండా మూలనపడి ఉన్న కంప్యూటర్లు దాతల సహకారంతో విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉపయోగించుకోవటానికి వీలుగా జిల్లా గ్రంథాలయంలో గతంలో కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యం కలుగజేశారు. అయితే కరోనా సమయంలో వాటిలో మూడు కంప్యూటర్లు చెడిపోయి విద్యార్థులకు అందుబాటులో లేకుండా పోయాయి. పరిస్థితిని గమనించిన కొంతమంది దాతలు వాటిని తమ ఖర్చుతో రిపేర్ చేయించగా సోమవారం వాటిని గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి దాతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో నేటి నుంచి అన్ని కంప్యూటర్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయని, వాటిని రిపేర్ చేయించి ఇచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దాతలు సున్నా ఆంజనేయులు, షేక్ మహబూబ్ బాషా, ముప్పాళ్ల రాంబాబు, కూరపాటి శ్రీనివాస రావు, మారెళ్ల సుబ్బారావు, గోపాలకృష్ణ, ఆర్.గోపాల రావు, సుబ్బారావు, ఐ.నరసింహారావులను గ్రంథాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

వైద్యరంగంలో వంశీకృష్ణ సేవలు అమూల్యం


డాక్టర్ వంశీకృష్ణను సన్మానిస్తున్న ప్రముఖులు

ఒంగోలు(కల్చరల్), జూన్ 24: జిల్లా వైద్యరంగంలో శ్రీరాం సూపర్ స్పెషాలిటీ డాక్టర్ చాపల వంశీకృష్ణ అందజేస్తున్న సేవలు అమూల్యమని పలువురు కొనియాడారు. సోమవారం ఆయనను ఆస్పత్రిలో వారు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. జిల్లాలో అనేక మంది పేదలకు అందుబాటులో వైద్యాన్ని ఇవ్వటం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించటం, ప్రతి నెలా మొదటి గురువారం వేల రూపాయల విలువైన పరీక్షలను ఉచితంగా నిర్వహించటం వంటివి డాక్టర్ వంశీకృష్ణ చేస్తున్నారని ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు అన్నారు. పేద కుటుంబంలో జన్మించినప్పటికీ పట్టుదలతో ఉన్నత స్థానానికి ఎదిగి ఎంతోమంది పేదలకు అండగా డాక్టర్ వంశీకృష్ణ నిలుస్తున్నారని సమాజసేవకులు షేక్ మహబూబ్ బాషా అన్నారు. కార్యక్రమంలో షేక్ సర్దార్ బాషా, నూకతోటి శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పేస్‌కు ఎన్‌పీటీసీఎల్ ఏఏ గుర్తింపు

ఒంగోలు(విద్య), జూన్ 24 : స్థానికపేస్ ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్‌పీటీసీఎల్ ఏఏ ర్యాంకు గుర్తింపును ఐఐటీ చెన్నై బహూకరించింది. కళాశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో నిర్వహించిన సర్టిఫికేషన్ పరీక్షల్లో గోల్డ్ ఎలైట్ సర్టిఫికెట్లు సాధించడంతో కళాశాలకు ఈగుర్తింపు లభించింది. కళాశాల విద్యార్థులు 1200 మందికి పైగా సర్టిఫికేషన్ పరీక్షకు హాజరు కాగా 802 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 74 మంది ఉత్తమ గోల్డ్ ఎలైట్ సాధించారు. మిగిలిన వారు సాధారణ ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ బీవీకే మూర్తి, ఎన్‌పీటీసీఎల్ లోకల్ చాప్టర్ కో ఆర్డినేటర్ టీఆర్ చైతన్య, కళాశాల కో ఆర్డినేటర్ షేక్ హసీనా కేసరలు విద్యార్థులను అభినందించారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ఒంగోలు(కల్చరల్), జూన్ 24:స్థానిక సంతపేట శివం శరణాలయంలో అనాథ వృద్ధులకు నూతన వస్త్రాలు, పండ్లు, బ్రెడ్ వంటివి పంపిణీ జరిగింది. దొంతు శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ మహిళా కార్యదర్శి మండవ లావణ్య చేతులమీదుగా వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా నిరంతరాయంగా నిత్యం 300 మంది అనాథలకు అన్నదానం నిర్వహిస్తూ, వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్న శివం సేవలు అమూల్యమైనవని వ్యవస్థాపక అధ్యక్షులు గొల్లపూడి శ్రీహరిని అభినందించారు. కార్యక్రమంలో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, చిక్కాల కిరణ్‌కుమార్, తన్నీరు సురేష్, మారెళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం' కార్యక్రమంలో రెండు అర్జీలు

కొండపి, జూన్ 24 : ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమాన్ని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి కొలతల కోసం, మ్యూటేషన్ కోసం రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ బి. కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగమణి పాల్గొన్నారు.

నేడు కాశీవిశ్వేశ్వర స్వామికి ఏకాంత సేవ

మద్దిపాడు, జూన్ 24: నందిపాడు గ్రామంలోని శ్రీ గంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి ఏకాంత సేవ మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు రాజు పంతులు సోమవారం తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం దగ్గర కారు, మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. విజయవాడ వైపు నుంచి నెల్లూరు వెళ్తున్న కారు మరో కారును అధిగమించబోయి అదుపుతప్పి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. సంఘటనలో గ్రానైట్ కార్మికుడు రంజిత్ సింగ్‌కు గాయాలయ్యాయి. కాగా అతడిని ఆదేకారులో ఒంగోలులోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు.

ఆపద ప్రభంధన్ పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 24 : నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారాలకు వచ్చేనెల 1నుంచి ఆగస్టు 31వతేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఈ పురస్కారాన్ని అర్హత కలిగిన వ్యక్తులకు, సంస్థలకు అందజేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి రోజైన జనవరి 23వతేదీన ఈ పురస్కారాన్ని అందజేస్తుందన్నారు. అర్హత కలిగిన వారందరూ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

ఎయిడెడ్ సమస్యలపై దృష్టి సారించాలి

ఒంగోలు(విద్య), జూన్ 24 : ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. చిట్టిబాబు, ఎల్‌కే చిన్నప్ప, ప్రతినిధి సీహెచ్ ప్రభాకర్‌రెడ్డిలు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో 150 పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో ఆ పాఠశాలల్లోని టీచర్లు డిప్యుటేషన్లపై ఇతర పాఠశాలల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వీరందరికి కౌన్సెలింగ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో శాశ్వత ప్రాతిపదికన వీరిని నియమించాలని వారు కోరారు.


నోటి కేన్సర్‌కు సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

ప్రారంభ దశలోనే నోటి కేన్సర్‌ను గుర్తించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 24 : నోటి కేన్సర్‌ను ముందుగానే గుర్తించకపోతే అనేక అనార్థాలు వచ్చే ప్రమాదం ఉందని జిల్లా ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ భగీరథి అన్నారు. జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని సెమినార్ హాలులో సోమవారం కేన్సర్ స్క్రీనింగ్ మూడో బ్యాచ్ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నోటి కేన్సర్‌ను ముందుగానే గుర్తించకపోతే శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించి ప్రాణాంతకం అవుతుందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమలరావు మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార కేన్సర్ హ్యూమన్ పాపిల్లోమా వైరస్ కారణంగా వస్తుందన్నారు. వైరస్ సోకిన 10నుంచి 15 ఏళ్ల తర్వాత కేన్సర్‌గా మారుతుందన్నారు. 9నుంచి 14 ఏళ్ల వయస్సులో హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇస్తే ఈ కేన్సర్‌ను నివారించవచ్చన్నారు. 30 ఏళ్లు దాటిన మహిళలకు లక్షణాలు లేకపోయినా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెడ్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం డాక్టర్ బి. శ్రీదేవి మాట్లాడుతూ కేన్సర్ ప్రాథమికంగా గుర్తించగలిగితే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేసుకోవచ్చన్నారు. కౌమారదశ బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయడం ద్వారా 70నుంచి 80శాతం వరకు గర్భాశయ ముఖద్వార కేన్సర్ రాకుండా అడ్డుకోవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మాధవీలత, డాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు

బ్యాంక్ సేవలపై అవగాహన పెంచుకోవాలి

మద్దిపాడు, జూన్ 24: బ్యాంక్ ఖాతాల లావాదేవీలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని నాబార్డ్ డీడీఎం జె.రవికుమార్ అన్నారు. సోమవారం మద్దిపాడు సచివాలయంలో రిజర్వ్ బ్యాంకు అవేర్నెస్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. కార్యక్రమానికి కెనరా బ్యాంకు మేనేజర్ వి.శ్రీధర్‌బాబు అధ్యక్షత వహించగా రవికుమార్ మాట్లాడుతూ మహిళలు పొదుపు పట్ల ఎంతో జాగ్రత్తగా ఉంటారని తద్వారా ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ కెనరా బ్యాంకులో వయోవృద్ధులకు అధిక ఆదాయాన్ని ఇచ్చే పథకాల గురించి వివరించారు. అదేవిధంగా కెనరా బ్యాంకు ద్వారా అందించే వివిధ రుణాల గురించి ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, మేనేజర్ అశోక్ కుమార్, ఎంపీడీవో సీహెచ్ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి ఆదిలక్ష్మి, ఏ.చిన్నరాజా, అమృతరాజు, బ్యాంకు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

75 మందికి వైద్య పరీక్షలు

కొండపి, జూన్ 24 : మండలంలోని చోడవరం గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మండపంలో విజయవాడ హెల్ప్ వైద్యశాల తరఫున సోమవారం రోగులకు ఉచితంగా గుండె జబ్బులు, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ జ్వాలాసాయి ఆధ్వర్యంలో 75మంది రోగులను పరీక్షించగా పదిమందిని వైద్య పరీక్షల కోసం ఎంపికచేశారు. వీరికి విజయవాడలోని తమ వైద్యశాలలో గుండెకు సంబంధించిన అదనపు పరీక్షలు చేసి, అవసరమైతే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని డాక్టర్ సాయి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వర్ణ నవీన్‌కుమార్, మాజీ సర్పంచ్ గుంటుపల్లి హరిప్రసాద్, టీడీపీ గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు గోగినేని వెంకటరావు, గ్రామ నాయకుడు రావిపాటి బాలకృష్ణ, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.


మంత్రి రాంప్రసాద్‌ను అభినందిస్తున్న ఆర్టీసీ పీటీడీ అసోసియేషన్ ప్రతినిధులు

రవాణా మంత్రిని కలిసి ఆర్టీసీ ఉద్యోగులు

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 24 : రాష్ట్ర రవాణా శాఖమంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డిని ఏపీఎస్ ఆర్టీసీ పీటీడీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆర్టీసీలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే మంత్రి రాంప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ తగిన చర్యలు తీసుకుంటుందని, అందరి సమష్టి కృషితో ఆదాయాన్ని పెంచడంతోపాటు, అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత కార్మికులు, ఉద్యోగులు, ఇతర సిబ్బందిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఏ. రాధాకృష్ణ, బాలకోటయ్యతోపాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై వరాహ లక్ష్మీనరసింహుడు

సింగరాయకొండ, జూన్ 24 : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువులా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదో రోజైన సోమవారం దేవస్థానంలోని మూల విరాట్ వరాహ లక్ష్మీనరసింహస్వామి, ఉభయ దేవేరులు రాజ్యలక్ష్మీ, గోదాదేవి, యోగానంద లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి చప్పరవాహనంపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. రాత్రికి గుర్రపు వాహనంపై భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో గుర్రపు వాహనంపై విహరించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పాములర్తి మాధవరావు, ఈవో పి. కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యుడు, వెంకట నరసింహాచార్యులు, యాజ్ఞికం సుదర్శనాచార్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయాలి


మంత్రి లోకేష్‌కు బొకే ఇస్తున్న జేఏసీ ప్రతినిధి సురేష్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 24 : రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసును రెగ్యులర్ చేయాలని ఏపీ కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ నాయకులు కోరారు. సోమవారం అమరావతిలో రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ను ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు ఈసందర్భంగా లోకేష్‌కు బొకే ఇచ్చి అభినందించారు. అనంతరం పలు అంశాలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ కుమ్మరకుంట సురేష్, కో చైర్మన్ సాయిరాజ్, మహిళా కార్యదర్శులు స్వాతి, దుర్గా, మల్లీశ్వరి తదితరులు ఉన్నారు

ఎరువులు, విత్తనాలు అందివ్వాలి

టంగుటూరు, జూన్ 24 : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలని రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు ప్రభుత్వాన్ని సోమవారం డిమాండ్ చేశారు. రైతులు, కూలీల సమస్యల పరిష్కారానికి సంఘం రాష్ట్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపుమేరకు టంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్‌ను కలసి రైతులు, కూలీల సమస్యలపై వీరు చర్చించారు. అనంతరం వినతిపత్రం కూడా సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి మంజుల, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు వెంకట్రావు, రంగారావు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు చక్రవర్తి, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సిసింద్రీబాబు పాల్గొన్నారు.


డిప్యూటీ తహసీల్దార్‌కు అర్జీ సమర్పిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

ప్రభుత్వ స్థలాల జోలికొస్తే ఊరుకోం

- ఎమ్మెల్యే దామచర్ల
- చెవిరెడ్డికి లీజుకిచ్చిన ఆర్టీసీ స్థలం పనులు ఆపేయాలని ఆదేశం
- అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించిన జనార్దన్


ఆర్టీసీ స్థలంలో పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, జనసేన నేత రియాజ్

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 24 : ప్రభుత్వ స్థలాల జోలికొస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి లీజుకు కేటాయించిన స్థలాలను రద్దు చేయాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్టీసీ డిపో వద్ద ఖాళీ స్థలంలో జరుగుతున్న పనులను పరిశీలించిన దామచర్ల ఏ నిబంధనల మేరకు ప్రభుత్వ స్థలాలను లీజుకు కేటాయించారని అన్నారు. పనులు వెంటనే ఆపివేయాలని ఆర్ఎం సుధాకర్ బాబుకు ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చిత్తూరుకు చెందిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా వైసీపీ తరుపున పోటీ చేశారని, అదేవిధంగా ఆర్టీసీ స్థలాలను లీజుతో స్వాధీనం చేసుకునేందుకు చేపట్టిన పనులు ఆపివేయాలని అధికారులకు ఆదేశించామన్నారు. ఇదే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళతామన్నారు. వైసీపీ అవినీతి సొమ్ముతో ఇష్టారాజ్యంగా వ్యవహరించిందన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు బియ్యం, డబ్బు పంపిణీ చేసినా ప్రజలు నమ్మలేదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ ఆస్తుల జోలికొస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, ప్రభుత్వ ఆస్తులను కాపాడుకుంటామని దామచర్ల స్పష్టం చేశారు.


స్థలాన్ని పరిశీలించి ఆర్ఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్

జనసేన అధ్యక్షులు రియాజ్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేసిన అవినీతి, ఆక్రమాలు, ఆక్రమణలను కూటమి వెలికి తీస్తుందన్నారు. చిత్తూరుకు చెందిన చెవిరెడ్డి కుటుంబం ఒంగోలులో ఆర్టీసీ ఆస్తులపై కన్నేయడాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామన్నారు.

నగర శివారులో దారుణం

- యువకుడి గొంతు కోసి హత్య
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఒంగోలు డీఎస్పీ

ఒంగోలు(క్రైం), జూన్24: నగర శివారు ప్రాతంలో దారుణం చోటు చేసుకుంది. గుర్తు తెలియని యువకుడిని గొంతు కోసి ఎన్నెస్పీ కాలువలో పడవేశారు. ఈ సంఘటన ఒంగోలు నగర శివారు ప్రాతమైన లింగారెడ్డి అపార్ట్మెంట్‌కు దగ్గరలో గల అమరావతి ప్లాట్స్ వద్ద సోమవారం వెలుగు చూసింది. సుమారు 30 ఏళ్ళ యువకుడిని గొంతు కోసి కాలువలో వేశారు. ఆప్రాంతంలో తిరుగుతున్న వారు సోమవారం సాయత్రం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు, టూటౌన్ సీఐ జగదీష్ తమ సిబ్బందితో వెళ్ళి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన యువకుడుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే కాలువ గట్టుపై యువకుడిని అత్యంత దారుణంగా గొంతుకోసి హత్య చేసి కాలువలోకి విసిరేసినట్లు సంఘటనా స్థలంలో ఉన్న రక్తపు మరకలను బట్టి పోలీసులు భావిస్తున్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగి ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. గొంతు కోసి పడవేయడంతో త్రీవర రక్తస్రావమై రక్తపు మడుగులో మృతదేహం పడి ఉంది. మృతుని వివరాలు తెలయాల్సి ఉందని ఒంగోలు డీఎస్పీ చెప్పారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.


బోల్తా పడిన వాహనం


ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రయాణికులు

ప్రయాణికుల వాహనం బోల్తా

- పది మందికి స్వల్పగాయాలు

ఒంగోలు(క్రైం), జూన్24: ప్రయాణికుల వాహనం బోల్తా పడి పది మందికి స్వల్పగాయాలు అయ్యాయి. ఈ సంఘటన సోమవారం ఉదయం 5.30 గంటలకు జాతీయ రహదారిపై స్థానిక కొప్పోలు ఫ్లై ఓవర్ వద్ద జరిగింది. వివరాలలోకి వెళితే ఏపీ 39టియఫ్ 4657 నంబరుగల వాహనంలో పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం కాసానిపాలెంనకు చెందిన 16 మంది తిరుపతి వెళి తిరిగి వస్తున్నారు. వాహనం నడుపుతున్న డ్రైవర్ నిద్ర మత్తులో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి లెఫ్ట్‌సైడ్ మార్జిన్‌లో దింపడంతో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. వాహనంలో 8 మంది మహిళలు 8 మంది పురుషులు ఉన్నారు. వీరిలో పెదకూరపాడు హుసేన్‌నగర్ కు చెందిన మంచాల వెంకటేశ్వర్లుతో పాటు కాసానిపాలెం నకు చెందిన వీరాస్వామి, ఆది, సుజాత, పద్మ, రామాంజనేయులు, సుబ్బారెడ్డి, రాంబాబు ,ఆంజనేయులు, గోపిలకు స్వల్పగాయాలు ఆయాయి. వెంటనే వారిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని తాలుకా పోలీసులు పరిశీలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాని పైకి లేపి క్రమబద్ధీక రించారు.


పోలేరమ్మతల్లి


విద్యుత్ ప్రభ

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

బల్లికురవ, జూన్ 24 : మండలంలోని గుంటుపల్లిలో సోమవారం పోలేరమ్మ తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మాదాల వీరమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రికి విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్య క్రమాలను నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.


లోకేష్‌కు బొకే ఇచ్చి అభినందిస్తున్న గరటయ్య

లోకేష్‌కు గరటయ్య శుభాకాంక్షలు

అద్దంకి, జూన్ 24 : రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, విద్య, ఆర్‌టీజీ, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన లోకేష్‌ను మాజీ ఎమ్మెల్యే, బాపట్ల పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్ బాచిన చెంచు గరటయ్య కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు


శేషవాహనంపై ఊరేగుతున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి

మేదరమెట్ల, జూన్ 24 : మేదరమెట్లలో వేంచేసి ఉన్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఆదివారం రాత్రి అంకురార్పణతో మొదల య్యాయి. సోమవారం వేకువ జామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అష్టదళపద్మారాధన నిర్వహించారు. అనంతరం హోమం, శ్రీ చక్రపూజ, పండితులు నారాయణం బాలసుబ్రహ్మణ్యం, హైగ్రీవచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం శేషవాహనంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వహకులు పాదర్తి కాజారావు, మద్దాళి సంజీవరావు, ఆదూరి ప్రసాద్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

బండ్లమాంబ తిరునాళ్ల ప్రారంభం

నాగండ్ల(ఇంకొల్లు), జూన్ 24 : ఇంకొల్లు మండలంలోని నాగండ్ల గ్రామంలోని బండ్లమాంబ 27వ వార్షికోత్సవ తిరునాళ్ల సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పొంగళ్ల నైవేద్యాలు చెల్లించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ తిరునాళ్ల బుధవారం అత్యంత వైభవంగా జరపనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అపరాధ రుసుము రద్దుకు సానుకూల స్పందన

- కేంద్రమంత్రిని కలిసిన పొగాకు బోర్డు చైర్మన్, వైస్ చైర్మన్


కేంద్రమంత్రి పియూష్ గోయల్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ పురందేశ్వరి, పొగాకుబోర్డు చైర్మన్ యశ్వంత్, వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు తదితరులు

కందుకూరు, జూన్ 24: పరిమితికి మించి పండించిన పొగాకు అమ్మకాలకు అపరాధ రుసుము లేకుండా బోర్డులో కొనుగోలు చేసేలా అనుమతించాలని కేంద్ర వాణిజ్యశాఖా మంత్రి పియూష్ గోయల్‌కు బోర్డు ప్రతినిధులు విన్నవించారు. రాజమండ్రి ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్, వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు, ఇతర పొగాకు బోర్డు ప్రతినిధులు సోమవారం ఢిల్లీలో గోయల్‌కు కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని దక్షిణాది తేలికనేలల పరిధిలోని వేలం కేంద్రాల్లో ఇప్పటికే అనుమతించిన పొగాకు విక్రయాలు చివరిదశకు చేరుకున్నాయి. కందుకూరు 2 వేలం కేంద్రంలో అధికారిక అమ్మకాలు మూడురోజుల క్రితమే పూర్తవటంతో వేలం నిలిచిపోయింది. అలాగే మిగిలిన వేలం కేంద్రాలలో కూడా వారం పదిరోజుల్లో అధికారిక పొగాకు విక్రయాలు పూర్తికానుండగా దక్షిణాది నల్లనేలల పరిధిలోని వేలంకేంద్రాలలో కూడా జూలై మొదటివారంలో అధికారిక పొగాకు వేలం ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని బోర్డు వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు తెలిపారు. ఈ ఏడాది అధికారిక పొగాకుకు దాదాపు సమానంగా పరిమితికి మించి పండించిన పొగాకు రైతుల వద్ద నిల్వ ఉందని ఈ పొగాకుకు అపరాధ రుసుము చెల్లించి అమ్ముకోవాలంటే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉన్నందున ఆ పొగాకును కూడా అపరాధ రుసుము లేకుండా బోర్డులో అమ్ముకునేందుకు అనుమతించాలని విన్నవించామని ఆయన వివరించారు. గత సంవత్సరం ఇలాగే అపరాధ రుసుము లేకుండా అమ్మకాలకు అనుమతించిన విషయాన్ని ఈ సీజన్‌లో కూడా కర్నాటకలో ఇలాగే అనుమతులు ఇచ్చిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే ఉత్తర్వులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని వాసుబాబు తెలిపారు. వారం రోజుల్లో ఈ ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని, ఆ వెంటనే అధికారిక పొగాకు వేలం పూర్తయిన వేలం కేంద్రాలలో అనధికారిక పొగాకు కొనుగోళ్లను ప్రారంభిస్తామని తెలిపారు.


సమావేశంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి

మంత్రి మండలి సమావేశంలో గొట్టిపాటి

అద్దంకి, జూన్ 24 : టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన తొలిమంత్రి మండలి సమావేశానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన గొట్టిపాటి రవికుమార్ చంద్రబాబు మంత్రి మండలి స్థానం పొందారు. ఇటీవల విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్ సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో పాల్గొన్నారు.

వరాహ లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు

- బ్రహ్మోత్సవాల్లో రూ. 4,16,347 ఆదాయం

సింగరాయకొండ, జూన్ 24 : పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం హుండీని లెక్కించారు. బ్రహ్మోత్సవాల ఎనిమిది రోజుల్లో రూ. 4,16,347 హుండీ ఆదాయం సమకూరింది. గత ఏడాది బ్రహ్మోత్సవాల్లో రూ.3,87,298 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పామర్తి మాదవరావు, ఈవో పి. కృష్ణవేణి పాల్గొన్నారు.

7న మాదిగ జనజాతర సభ

అద్దంకిటౌన్, మే 24 : ఈదుమూడి గ్రామంలో జూలై 7వ తేదీన జరిగే మాదిగ జనజాతర కార్యక్రమానికి మాదిగలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆలూరి చిరంజీవి మాదిగ కోరారు. సోమవారం అంబేడ్కర్ సామాజిక భవనం వద్ద జనజాతరకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ గంగాధర్, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఎలీషా పాల్గొన్నారు.


మొక్కు తీర్చుకుంటున్న దగ్గుబాడు టీడీపీ శ్రేణులు

అజ్మీర్ దర్గాలో టీడీపీ శ్రేణులు

దగ్గుబాడు(పర్చూరు), జూన్ 24: రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్ దర్గాలో కారంచేడు మండలం దగ్గుబాడు గ్రామానికి చెందిన టీడీపీ ముస్లింలు సోమవారం మొక్కులు తీర్చుకున్నారు. పర్చూరు ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయం సాధించడం, టీడీపీ అధికారంలోకి రావడంతో కోఆప్షన్ మాజీ సభ్యుడు షేక్. ఖాశీం ఆధర్వంలో ముస్లింలు అజ్మీర్ దర్గాకు వెళ్లి మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు.

స్వర్ణ గ్రామంలో గడ్డివాములు దగ్ధం

రూ.6 లక్షలకు పైగా ఆస్తి నష్టం

స్వర్ణ (పర్చూరు), జూన్ 24 : కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో అగ్ని ప్రమాదంలో గడ్డి వాములు దగ్ధమైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామంలోని జి.సురేంద్రబాబు అనే రైతుకు చెందిన 60 ఎకరాల్లోని రూ.6లక్షల విలువ చేసే గడ్డివాములు మంటలకు దగ్ధమయ్యాయి. అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగి వాములు దగ్ధం కావడంతో గ్రామస్థులు చీరాల అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి కారణాలు తెలియలేదు.


దగ్ధమవుతున్న వాములు

ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే కొండయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 24 : ప్రాధాన్యత క్రమంలో అన్ని స మస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు ఎల్‌బీఎస్‌నగర్‌లోని జెండా చెట్టు వద్ద ఆయన అభిమానులు మొక్కుతీర్చుకునే కార్యక్రమంలో కొండయ్య పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కొండయ్య మాట్లాడుతూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికలు ఎమ్మెల్యే కొండయ్యకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపేందుకు పోటీ పడ్డారు.

అనంతరం డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని, మసీదుకు ప్రహరీ నిర్మించాలని, దోమల బెడదను నివారించాలని కోరారు. దీనిపై కొండయ్య సానుకూలంగా స్పందించారు. అందరినీ పేరు, పేరు పలకరిస్తూ ఎన్నికల ప్రచారంలో పనిచేసినవారిని ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు షేక్ అబ్దుల్ రహమాన్, షేక్ ఇలియాజ్, సయ్యద్‌బాబు, షేక్ జమీర్, షేక్ ఖలీమ్, సయ్యద్‌రియాజ్, షేక్ మస్తానమ్మ, సజ్జా వెంకటేశ్వరరావు, డేటా నాగేశ్వరరావు, ఉసురుపాటి సురేష్, స్థానికులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతకు ముందు పార్టీ కార్యాలయంలో పలువురు విభిన్న ప్రతిభావంతులు తమ సమస్యలు పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇచ్చారు. వడ్డెర సంఘం రాష్ట్ర ప్రతినిధు లు, జిల్లా బాధ్యులు ఎమ్మెల్యే కొండయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. అభినందనలు తెలిపారు.

వాటర్ ఫిల్టర్ అందజేత

నాగులుప్పలపాడు, జూన్ 24 : ఉప్పుగుండూరు శాఖ గ్రంథాలయానికి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కూలింగ్ వాటర్ ఫిల్టర్ అందజేశారు.సోమవారం వాసవి క్లబ్ డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయానికి వచ్చే పాఠకుల కోసం కూలింగ్ వాటర్ ఫిల్టర్‌ను క్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ కోశాధికారి మిరియాల చంద్రశేఖర్ గుప్తా అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, క్లబ్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ ఉపాధ్యక్షులు కొంజేటి సురేష్‌బాబు,మార్పూరి రాఘవేంద్ర, పులకణం రాజేష్, సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శామ్యూల్, గ్రంథపాలకులు ఏ.ప్రసాద్ పాల్గొన్నారు.

కిరాతకులను కఠినంగా శిక్షించాలి

చీరాలటౌన్, జూన్ 24 : కంచర్ల సంతోష్‌ను హత్య చేసిన కిరాతకులను కఠినంగా శిక్షించాలని పలువురు ఆర్య వైశ్య ప్రముఖులు డిమాండ్ చేశారు. ఆదివారం సతీష్‌ను హత మార్చిన ఘటనను నిరసిస్తు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అంతేకాకుండా సాయంత్రం నుంచి మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్‌ను స్వచ్ఛందంగా మూసివేశారు. వన్‌టౌన్ సీఐకి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ చిన్నపాటి వివాదాన్ని సర్దుకోకుండా కసిగా దాడి చేసి హత్య చేసినట్లు చెప్పారు. ఇటువంటి ఘటనలకు పాల్పడే వారిని బయటకు రానియ్యకుండా శిక్షించాలని డిమాండ్ చేశారు. తులాబంధు సురేష్, చిన్ని లీలాధరరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖరరావు, వేణు, సుబ్బయ్య, చీమకుర్తి బాలకృష్ణ, గుంటూరు ప్రభాకరరావు, వెంకటేశ్వర్లు, గజవల్లి శ్రీను, రఘు, మధు, అనీల్, రమణ, బ్రహ్మం, వేణు గోపాల్, బాలు, అమరా శివ పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో రాళ్లవాగు

- రోజు రోజుకు పెరుగుతున్న కబ్జా
- రెవెన్యూ అధికారుల హెచ్చరిక బోర్డులు పీకివేస్తున్న వైనం



టీటీడీ కల్యాణ మండపం సమీపంలో అక్రమంగా వేసిన బేస్‌మట్టాలు

ఎర్రగొండపాలెం, జూన్ 23 : ఎర్రగొండపాలెం గ్రామానికి ఉత్తరం వైపున ఉన్న రాళ్లవాగుకు ఇరువైపుల ఉన్న వాగుపోరం బోకు ఆక్రమణకు గురవుతోంది. ఆ భూమిని కొంతమంది ఆక్రమించి యధేచ్ఛగా విక్రయాలు సైతం చేస్తున్నారు. మరి కొంత మంది ఆక్రమించి పక్కా భవనాలు నిర్మించేందుకు బేస్‌మట్టాలు వేశారు.

మండలంలో ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపించినా.., వీరు ఆక్రమించి పట్టాలు పొందడం, అనంతరం రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపట్టడం రివాజుగా మారింది. ఆక్రమణలు జరిగిన ప్రాంతంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా, అవి అలంకారప్రాయంగా మిగులుతున్నాయి. కొన్ని రోజులకు ఆ బోర్డులను ఆక్రమణదారులు తొలగించి వేస్తున్నారు. ఇక కొంత మందైతే వీటిని మారు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు సైతం చేస్తున్నారు. ఎర్రగొండపాలెంలోని రాళ్లవాగు వెంబడి ఉన్న పట్టాభూముల సర్వేనంబర్లతో వాగు భూమిని రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.ఆ భూమిని అనువంశీకంగా చూపడం గమనార్హం.

ఎర్రగొండపాలెం-గంజివారిపల్లె రోడ్డులోని చప్టా వద్ద నుంచి మురారి పల్లె పెద్దచెరువు వరకు నాలుగు సర్వే నెంబరులలో 77.31 ఎకరాల వాగుపోరంబోకు భూమి ఉంది. సర్వే నెంబరు 28/1లో 44.09 ఎకరాలు, సర్వేనెంబరు 587/2లో 22.04 ఎకరాలు, సర్వే నెంబరు 588/1లో 5.62, సర్వే నెంబరు 588/4లో 5.56 ఎకరాలు భూమి వాగు పోరంబోకుగా ఉంది. ప్రస్తుతం ఆక్రమణదారులు రాళ్ళవాగుకు ఇరువైపుల ఆక్రమించారు. దీంతో వాగు కుచించుకుపోయింది. మొత్తం 77.31 ఎకరాలకు కేవలం 30 ఎకరాలు మాత్రమే మిగిలి చిన్న కాలువగా వాగు కనిపిస్తోంది. ఇది చాలదన్నట్లు ఈ వాగు భూముల్లో గ్రావెల్ తవ్వకాలు యధేచ్ఛగా కొనసాగుతున్నాయి. కొత్తగా భవన నిర్మాణాలు చేపట్టే యజమానులు ప్రభుత్వం అనుమతి లేకుండా ఎక్సకవేటర్లతో త్రవ్వి టాక్టర్లు ద్వారాగ్రావెల్ తరలిస్తున్నారు. వాగులో పెద్ద, పెద్ద గోతులు తవ్వారు. దీంతో వర్షంపడిన సమయంలో నీరు చేరడంతో ఆగోతుల్లో పశువులు పడి పోయి బయటికి రాలేక మృతిచెందుతున్నాయి. రాళ్లవాగు హద్దుభూములు క్రయ, విక్రయాలు జరిగి కొనుగోలు చేసిన వ్యక్తులు నష్టపోతున్నారు. పుల్లలచెరువు రోడ్డులో టీటీడీ కళ్యాణ మండపం సమీపంలో రాళ్లవాగు సరిహద్దు భూమిలో ఆక్రమణదారులు బేస్ మట్టాలు నిర్మించారు. రెవెన్యూ అధికారులు అక్కడ నిషేధం హెచ్చరిక బోర్డులు 2022 మార్చిలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆబోర్డులు సైతం అదృశ్యం కావడం గమనార్హం.

స్థానికుల ఫిర్యాదుతో..

స్థానికులు ఫిర్యాదు చేయడంతో 2022 ఏప్రిల్ నెలలో అప్పటిలో మార్కాపురం ఆర్డీవో ఆదేశాల మేరకు స్థానిక రెవిన్యూ అధికారులు సర్వే చేసి ఆక్రమణలు ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఆక్రమణలు తొలగించమని ఆర్డీవో ఆదేశాలు ఇచ్చిన అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేదు. దీంతో ఆక్రమణ తొలగింపులో అధికారులు మీనమీషాలు లెక్కిస్తున్నారు. రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ రెండు సంవత్సరాలుగా కాలం వెల్లదీస్తున్నారు. కొత్త ప్రభుత్వంలో రాళ్ల వాగుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను అధికారులు తొలగిస్తారని అని ఎర్రగొండపాలెం ప్రజలు ఎదురుచూస్తున్నారు.



వాగుభూమి, ఆ భూముల్లో ఏర్పాటు చేసిన హెచ్చరికబోర్డు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో ఘటన

కొమరోలు, జూన్ 24: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని నల్లగుంట్ల గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.., బేస్తవారపేట బీసీ కాలనీకి చెందిన దూదేకుల చిన్న కాశయ్య, భార్య పీరమ్మలు మోటర్ సైకిల్‌లో కడప జిల్లా బ్రహ్మంగారి మఠం వెళ్లి దేవుని దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో బేస్తవారిపేటకు వెళుతున్నారు. ఈ క్రమంలో కొమరోలు మండలంలోని నల్లగుంట్ల గ్రామ సమీపంలో రాష్ట్రీయ రహదారిలో మోటర్ సైకిల్ అదుపుతప్పి రోడ్డుపై పడింది. దీంతో అక్కడిక్కడే చిన్న కాశయ్య మృతి చెందాడు. భార్య పీరమ్మకు బలమైన గాయాలయ్యాయి. గాయపడిన పీరమ్మను స్థానికులు 108 వాహనం ద్వార గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై మధుసుధన్‌రావు సంఘటనా స్థలానికి వెళ్లి పూర్తి వివరాలను సేకరించి కేసు నమోదుచేకుని మృతదేహాన్ని గిద్దలూరుకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కాశయ్య

తహసీల్దార్ కార్యాలయ అటెండర్ మృతికి సంతాపం

గిద్దలూరు, జూన్ 24 : గిద్దలూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేస్తూ, అనారోగ్యంతో పిక్కిలి వెంకటేశ్వర్లు మృతిచెందాడు. ఆయన మృతదేహానికి పలువురు రెవెన్యూ అధికారులు, వీఆర్ఏలు నివాళ్లు అర్పించారు. ఆయన మృతదేహాన్ని వీఆర్ఏల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఓ.ఆంజనేయులు, వీఆర్ఏల సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబీకులకు సానుభూతి తెలిపారు.

పగడాలకు ఘనంగా నివాళులు



పగడాల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అభిమానులు

గిద్దలూరు, జూన్ 24 : మాజీ ఎమ్మెల్యే పగడాల రామయ్య 77వ జయంతి కార్యక్రమాన్ని ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. పగడాల నివాస గృహంలో ఆయన చిత్రపటానికి పూలమాల లు వేసి ఘనంగా నివా ళులు అర్పించారు. నియో జకవర్గ అభివృద్ధికి పగడాల రామయ్య చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో రాచర్ల జడ్పీటీసీ సభ్యుడు పగడాల దేవి, నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థాన మాజీ ఛైర్మన్ కె.ఓబులేసు, చోళ్లవీడు సర్పంచ్ నారాయణ, మాజీ సర్పంచ్ ముత్యాల మధు, పగడాల రామయ్య కుమారుడు శ్రీరంగం, పలువురు కాపు సంఘం నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

- గ్రామస్థాయి అధికారులు, పారిశుధ్య సిబ్బందితో ఎంపీడీవో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

మార్కాపురం రూరల్, జూన్ 24: మండలంలోని గ్రామాలలో డయేరియాతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో చందన సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండలంలోని గ్రామస్థాయి అధికారులతో పారిశుధ్యం, డయేరియా ఇతర వ్యాధుల వ్యాప్తి నిరోదంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చందన మాట్లాడుతూ.. గ్రామాలలో పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మురుగు కాలువలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. తొట్టిలలో నీరు నిల్వ చేయకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రామ్మోహన్ రెడ్డి, అర్‌డబ్ల్యుఎస్ ఏఈ సృజన, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

- ఆర్‌సీఎం చర్చి కాలనీ వాసుల ఆందోళన



నీటి కోసం ఆందోళన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

పెద్ద దోర్నాల, జూన్ 24: నీటి సమస్య పరిష్కరించాలంటూ స్థానిక ఆర్‌సీఎం చర్చి కాలనీ వాసులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీవాసులు కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలు కొద్దిసేపు నిలిచాయి. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ రోజూ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసేవారని, ఈ రోజు ట్యాంకరు రాకపోవడంతో నీటికి ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వెలిబుచ్చారు. పంచాయతీ అధికారులు, ప్రభుత్వం స్పందించాలని నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కాలనీ వాసులతో చర్చించారు. విషయం తెలుసుకున్న పోలీసులు పంచాయతీ అధికారుల తో మాట్లాడటంతో ట్యాంకరును వెంటనే పంపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించుకున్నారు. దీంతో వాహనాల రాకపోకలు యధాతథంగా కొనసాగాయి.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసమే 'మీకోసం'

సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం రూరల్, జూన్ 24: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం మీకోసం కార్యక్రమం నిర్వహిస్తోందని, సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ ప్రత్యేక మీకోసం కార్యక్రమానికి మార్కాపురం డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి 47 అర్జీలు అందాయి. డివిజన్‌లోని మండలాల తహశీల్దార్ కార్యాలయాల వారీగా అర్ధవీడు 2, బేస్తవారిపేట 2, కంభం 1, గిద్దలూరు 3, కొమరోలు 7, మార్కాపురం 12, పుల్లలచెరువు 2, రాచర్ల 2, తర్లుపాడు 1, త్రిపురాంతకం 2, ఎర్రగొండపాలెం 3 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో అత్యధికంగా భూసమస్యలకు సంబంధించిన అర్జీలు వచ్చినట్లు తెలిపారు. మార్కాపురం తహసీల్దార్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమానికి 5 అర్జీలు భూసమస్యలపై ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం పరిధిలో సమస్యలు పరిష్కరించాల్సిన అర్జీలు 8 వచ్చినట్లు తెలిపారు. మీ కోసం ప్రత్యేక కార్యక్రమంలో డీఎల్‌డీవో సాయికుమార్, డివిజన్ సర్వేయర్ సుబ్బారావు, డివిజన్ పంచాయతీరాజ్ శాఖ అధి కారి నాగేశ్వరరావు, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

వెలిగొండ ప్రాజెక్ట్ వేగంగా పూర్తి చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 24: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు వెంటనే పూర్తి చేయాలని, ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.హనుమారెడ్డి, కె.వీరారెడ్డిలు మాట్లాడుతూ.. అనేక దశాబ్దాలుగా పశ్చిమ ప్రకాశం పాలకుల నిర్లక్ష్యానికి గురై పూర్తిగా వెనుకబడిందన్నారు. వర్షాధారం మినహా మరో నీటి ప్రత్యామ్నాయం లేని పశ్చిమ ప్రకాశానికి వెలిగొండ ప్రాజెక్టే శరణ్యమన్నారు. కొల్లంవాగు సమీపంలో హెడ్ రెగ్యులేటరీ నిర్మాణ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయని తక్షణమే పూర్తి చేయాలని కోరారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన ముంపు గ్రామాల బాధితులకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో న్యాయం జరగలేదన్నారు. ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద నిధులు మంజూరు చేయకపోగా ప్రాజెక్ట్ పూర్తి అయిందని జాతికి అంకితం చేయడం జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. నూతన ప్రభుత్వం ముంపు గ్రామాల బాధితుల ఆవేదనను అర్థం చేసుకొని ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద నిధులను మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య, కార్యవర్గ సభ్యులు దేవెండ్ల శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కాశీం, రైతుసంఘం నాయకులు కొండయ్య, వెంకటేశ్వర్లు, సాంబశివరావు, రామయ్య సీపీఐ నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తు అంధకారం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 24: మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్ అంధకారం అవుతుందని సెబ్ డీఎస్పీ ఎస్.దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో సెబ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై యువతకు దిశానిర్దేశం అనే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. భవిష్యత్ ఉన్నత లక్ష్యం దిశగా నడిపించాలన్నారు. సమాజానికి ఆదర్శవంతమైన వ్యక్తులుగా నిలిచి చూపాలన్నారు. మాదక ద్రవ్యాలపై ఎవరైనా సమాచారం ఇవ్వాలి అనుకుంటే 14500 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. సెబ్ సీఐ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మాదకద్రవ్యాలకు బానిస అవుతున్న వారిలో యువతే అధిక శాతం ఉన్నారన్నారు. ఒక్కసారి డ్రగ్స్‌కు బానిస అయితే జీవితం పూర్తి అంధకారం అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.మధుసూదన్, ఎస్ఐ గోపాలకృష్ణ, కళాశాల కార్యదర్శి రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్‌లు వీఆర్‌కే ప్రసాద్, కృష్ణారెడ్డి, డా.వీ.కృష్ణారెడ్డి, జీఎల్ రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈబీ డీఎస్పీ దుర్గా ప్రసాద్

బాలరాముని అవతారంలో తిరుమలనాథుడు

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు ప్రారంభం

పెద్దారవీడు(మార్కాపురం), జూన్ 24: మండలంలోని రాజంపల్లిలో వెలసిన శ్రీగొట్రాలి కొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారి మూలవిరాట్‌ను శ్రీబాలరాముని అవతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు భారీ సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రెడ్ల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పశుప్రదర్శన పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. న్యూ క్యాటగిరీ సైజు విభాగంలో వరసగా ఐదు బహుమతులు రూ.35 వేలు, రూ.20 వేలు, రూ.15వేలు, రూ.10, రూ.5 వేలను మార్తాల వెంకటసుబ్బయ్య ఎడ్లజత, రామినేని తాతయ్య చౌదరి ఎడ్ల జత, మేడిగం హర్షవర్ధన్‌రెడ్డి, చాగంటి నాగమల్లికార్జునరెడ్డి, బీజం వెంకట సుబ్బారెడ్డిల ఎడ్లజతలు గెలుచుకున్నాయి. కమిటీ సభ్యులు డి.వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బోడిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణరెడ్డిలు విజేతలకు బహుమతులు అందజేశారు.

వేడుకగా ధ్వజారోహణం

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక శివాజీ నగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి శేషవాహనంపై స్వామికి నగరోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు.



బండలాగుతున్న ఎడ్లజత, బాలరాముడిగా స్వామివారు,వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణం

యథేచ్ఛగా రోడ్డు అంచుల ఆక్రమణ

పుల్లలచెరువు, జూన్ 24 : ప్రయాణీకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆర్‌అండ్‌బీ రోడ్డులు అక్రమణలకు గురవుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా విశాలంగా ఉన్న రోడ్ల అధికారులు పర్యవేక్షణ కరువై యధేచ్ఛగా అక్రమణలకు గురై కుచించుకుపోతున్నాయి. పుల్లలచెరువు మండలం రాచకొండ రెవిన్యూ పరిధిలోని వెంకటరెడ్డి పల్లి సమీపంలో పుల్లలచెరువు మండలానికి చెందిన వైసీపీ నాయకుడు ఆర్‌అండ్‌బీ రోడ్డు స్థలాన్ని అక్రమించి అక్రమంగా కట్టను ఏర్పాటు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా తారు రోడ్డు పక్కన మార్జిన్లు విశాలంగా వుండాలి. దీంతో ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు ఇరువైపులా వెళ్లేందుకు వీలుగా మార్జిన్ ఉండాలి. వర్షం పడినప్పుడు అక్కడ నీరు రోడ్డు నుంచి పక్కకు వచ్చి చిన్న కాలువల ద్వారా బయటకు వెళ్లాలి.కాని వైసీపీ నాయకుడు తన పొలానికి వేసిన అడ్డుకట్టతో అక్కడ ఒక వైపు మార్జిన్ కనిపించడం లేదు. దీంతో ఆ రోడ్డులో ప్రయాణించే ప్రయాణీకులతో పాటు ప్రజలు కట్ట నిర్మాణంపై అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే వెంకటరెడ్డిపల్లె నుంచి ఆర్‌అండ్ బీ అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేసినా, ఆర్‌అండ్‌బీ ఏవో సాకులు చెబుతూ చర్యలకు వెనుకాడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రోడ్డును సర్వే చేయించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారి వివరణ: ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈ రమణ, జేఈ సందీప్‌లను వివరణ కోరగా ఇప్పటికే వెంకటరెడ్డిపల్లె రోడ్డు పక్కన కట్ట విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. తమ భూమి తారు నుంచి ఎంత ఉందనేది సర్వేలో వస్తుందన్నారు. కట్ట నిర్మించిన రోడ్డు సమీపంలో సర్వే చేయించి ఆక్రమణలు తొలగిస్తామని అన్నారు.

రోడ్డును ఆక్రమంచి అక్రమంగా కట్ట నిర్మించారు

ఎర్రగొండపాలెం ప్రధాన రోడ్డులో వెంకటరెడ్డి పల్లె గ్రామం వద్ద వెంకటరెడ్డి పల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు అక్రమంగా కట్టవేశారు. దీంతో ప్రయాణీకులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు.దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా, ఇప్పటికి ఏటువంటి చర్యలు తీసుకోలేదు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి



రోడ్డు వెంబడి ఉన్న కట్ట

అవీ..ఇవీ..

వసతిగృహంలో చేరేందుకు అవకాశం

- సహాయ సంక్షేమాధికారి రాజేశ్వరమ్మ

బేస్తవారపేట, జూన్24 : బేస్తవారపేట పరిధిలోని 11 సాంఘీక సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు నూతన ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సహాయ సంక్షేమాధికారి ఈ.రాజేశ్వరమ్మ తెలిపారు. 3వతరగతి నుండి 10వ తరగతి వరకు, పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలలో ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు ఈ ఏడాది విద్యా సంవత్సరానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకొని అడ్మిషన్ పొందాలన్నారు. 3 నుండి 10వతరగతి వరకు బేస్తవారపేట, కంభం, తర్లుపాడు, కొనకనమిట్ల, పెద్దారికట్ల, ఇంటర్మీడియట్ నుండి పీ.జీ వరకు బేస్తవారపేట, కంభం మండలాల్లోని వసతి గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఆమె మాట్లాడుతూ వార్డెన్లు తప్పనిసరిగా మెనూ పాటించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలు అమలు చేయాలని, 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి స్టడీ మెటీరీయల్, ట్యూటర్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

విద్యార్థులకు కిట్లులు పంపిణీ



మాట్లాడుతున్న శ్రీనివాసులు

కంభం, జూన్ 24 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అన్ని విధాలు గా సహరిస్తామని టీడీపీ మండల నాయకులు కేతం శ్రీనివాసులు పేర్కొ న్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠ శాల ఎస్ఎస్ నందు విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం ఈ పాఠశాలకు ప్రహరీ లేదని, గోడ నిర్మించేందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టీడీపీ నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, 6వ వార్డుసభ్యుడు ముజీబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న హెల్పింగ్ హర్ట్స్ ప్రతినిధులు

గిద్దలూరు, జూన్ 24 : పట్టణంలోని పీఆర్ కాల నీలోని సంజీవిని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, అనాథ పిల్లలకు బేస్తవా రపేటలోని హెల్పింగ్ హర్ట్స్ ప్రతినిధులు నిత్యవసర వస్తువులు, పండ్లు, స్వీట్లు అందజే శారు. కార్యక్రమంలో ఆశ్రమం ఇన్‌చార్జ్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రోత్సాహం



విద్యార్థినికి బహుమతులు అందజేస్తున్న దాతలు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 24: స్థానిక పూలసుబ్బయ్య కాలనీలోని మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి ఫలితాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందించారు. 529 మార్కులు సాధించిన డి.ఖలీనా, 503 మార్కులు సాధించిన రూపశ్రీలావణ్య, 495 మార్కులు సాధించిన షేక్ సాదియాలకు సీపీఐ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పూల సుబ్బయ్య కుమార్తె పూల సునందిని ఆమె భర్త ఇమ్మడి శ్రీనివాసులు నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని, ఏటా పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ఎల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 24: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్, జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నరేంద్రనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఏడు కంపెనీలకు చెందిన వారు పాల్గొని విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. ఐటీఐ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పూర్తి చేసి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ మేళాలో పాల్గొనాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 9553306631నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

మట్టినమూనా పరీక్షలు ఉపయోగకరం



మట్టి నమూనాలను సేకరిస్తున్న ఏవో బుజ్జిబాయ్

పెద్దారవీడు(మార్కాపురం), జూన్ 24: మట్టి నమూనా పరీక్షలు రైతులను ఉపయోగకరమని ఏవో బుజ్జిబాయ్ అన్నారు. మండలంలోని మద్దలకట్ట రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో మట్టిసేకరణ విధానాన్ని రైతులకు వివరించారు. ఏవో మాట్లాడుతూ మట్టినమూనా పరీక్షల ద్వారా నేలలోని లోపాలు తెలుస్తాయన్నారు. దీంతో ఏ పంటకు ఏ ఎరువులు ఉపయోగించాలో తెలుసుకోవచ్చన్నారు. ఈ ఏడాది మండలంలో 548 మట్టి నమూనా పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మండలంలోని 12 రైతుభరోసా కేంద్రాలలో ఒక్కొక్క దానిలో 48 మట్టినమూనా పరీక్షలు చేసినట్లు తెలిపారు. అనంతరం చాట్లమడ అగ్రహారంలో పత్తి పొలాలను సదర్శించి సూచనలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

మట్టిపరీక్షలతో రైతులకు ఎంతో మేలు

పొదిలి, జూన్ 24 : మట్టిపరీక్షలు నిర్వహించి తాగు మోతాదులో ఎరువులు సూక్షదాతువులు అందించడం ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని, ఏవో జైన్‌లుబ్దీన్ అన్నారు. సోమవారం మండలంలోని కంభాలపాడు గ్రామంలో రైతులకు, రైతుభరోసా కేంద్రం సిబ్బందికి మట్టిపరీక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ మట్టినమూన తీసే విధానం దానియొక్క ప్రాముఖ్యతను గురించి వివరించారు. భూసార పరీక్షల ధారంగా ఎరువులు, పురుగుమందులు వాడితే రైతులకు పెట్టుబడులు తగ్గి దిగుబడి, నాణ్యమైన పంటలు చేతికి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కనుక గ్రామాల్లో రైతులు అందరు రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది ద్వారా మట్టిపరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో ఫెన్సింగ్ రాళ్ల తొలగింపు

పామూరు, జూన్ 24: మండలంలోని పడమర కట్టకిందపల్లి గ్రామంలో సుమారు 18 ఎకరాల ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు ఆక్రమించారు. ఫెన్సింగ్ వేసిన సదరు భూమిని తహసీల్దార్ షాకీర్‌పాష ఆదేశాల మేరకు సోమవారం తొలగించారు. వీఆర్వో రఫి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని సర్వే నెంబర్ 446, 447లో గల 18 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది.. ఆ భూమిని నలుగురు వైసీపీ నాయకులు ఆక్రమించి ఫెన్సింగ్ రాళ్లతో హద్దులు ఏర్పాటుచేశారు. కూటమి ప్రభుత్వం రావడంతో గ్రామానికి చెందిన కొందరు ఆక్రమణలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రభుత్వ భూమిలో యంత్రాలతో ఆక్రమణలు తొలగించినట్లు వీఆర్వో రఫి తెలిపారు.

నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్‌లు రాజీనామా

పీసీపల్లి, జూన్ 24: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్‌లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను సోమవారం అధికారులకు అందజేశారు. వైసీపీ ప్రభుత్వం మారి టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఇబ్బందులు ఏర్పడుతాయని స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నట్లు తెలిసింది. లక్ష్మక్కపల్లి, తలకొండపాడు, చినవరిమడుగు, మురుగమ్మి గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లు రాజీనామాలు చేశారు. రెండు మూడు రోజుల్లో మరికొంతమంది రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి

వెలిగండ్ల, జూన్ 24: ప్రజాసమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని టీడీపీ నియోజకవర్గ నాయకుడు శ్యామల కాశిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో కక్షపూరితంగా టీడీపీ కార్యకర్తలకు పనిచేయకుండా ప్రభుత్వ కార్యలయాల చుట్టూ తిప్పుకుంటూ ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. అయితే, టీడీపీ ప్రభుత్వం పేదల పక్షపాతి అని, పార్టీలతో సంబంధం లేకుండా అందరికి పనిచేయాలన్నారు. మండలంలో వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శివనామ స్మరణతో మారుమోగిన శివాలయం

ముండ్లమూరు, జూన్ 24: మండలంలోని మారెళ్లలో వేంచేసి ఉన్న శ్రీచెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానం 18వ వార్షికోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. ఆలయం నిర్మించి రెండు దశాబ్దాలు కావస్తుండటంతో స్వామి వారికి భక్తులు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శివనామ స్మరణతో ఆలయం మారుమోగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. వార్షికోత్సవం సందర్భంగా శివ పార్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. కల్యాణ మహోత్సవంలో మారెళ్లతో పాటు జమ్మలమడక, సుంకరవారిపాలెం, పూరిమెట్ల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.21 లక్షలు



నారాయణస్వామి హుండీలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

సీఎస్‌పురం(పామూరు), జూన్ 24: సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థాన ప్రధాన హుండీ ఆదాయం గత 3 నెలల 13 రోజులకు రూ.21,07,791లు వచ్చినట్లు దేవస్థాన ఈవో గిరిరాజు నర సింహబాబు, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ తెలిపారు. సోమవారం దేవస్థాన ప్రాంగణంలో మార్కాపురం శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాసరెడ్డి, స్థానిక ఆలయ ఈవో గిరిరాజు నరసిం హబాబు, చైర్మన్ ఆదినారాయణ పర్యవేక్షణలో ప్రధాన హుండీల ఆదాయ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2024 మార్చి 11వ తేది నుండి జూన్ 24 వరకు హుండీని లెక్కించినట్లు తెలిపారు. ప్రధాన హుండీ ద్వారా రూ.20,79,142, అన్నదానం హుండీ ద్వారా రూ.28,649 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌శర్మ, స్టేట్‌బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసి యేషన్ సభ్యులు, పోలీసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు మలుపులు.. మృత్యువుకు పిలుపులు

- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- హెచ్చరిక బోర్డుల ఏర్పాటులో నిర్లక్ష్యం



రామకృష్ణాపురం నుంచి మారెళ్ళ వెళ్ళే ప్రధాన మూల మలుపు

ముండ్లమూరు, జూన్ 24: మండలంలోని పలు గ్రామాలకు వెళ్ళే రహదారుల మలుపులు మృత్యువుకు పిలుపులుగా మారాయి. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయటంలో ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వహించటం వల్ల వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో కుటుంబ యజమాని మృత్యువాత పడుతుండటంతో ఆ కుటుంబాలు వీధిన పడ్డ పరిస్థితులు కోకొల్లలు. కనీసం మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లయితే కొంత మేరప్రమాదాలు అరికట్టవచ్చునని వాహన చోదకులు పేర్కొంటున్నారు.

మండలంలోని వేంపాడు-ఈదర ప్రధాన రహదారిలో పెదరావిపాడు, తమ్మలూరు, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల వద్ద ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతు న్నాయి. మండలంలోని రామకృష్ణాపురం వయా మారెళ్ళ, జమ్మలమడక వెళ్ళే ప్రధాన రహదారిలోనూ అనేక మలుపులు ఉన్నాయి. ఈ రహదా రులపై తరచూ ప్రమాదాలు జరుగుతూ పలువురు క్షతగాత్రులవు తున్నారు.

అలాగే, పెదఉల్లగల్లు నుంచి వినుకొండ వెళ్ళే రహదారిలో పలుచోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. నూజెండ్లపల్లి నుంచి వయా భట్లపల్లి, మారెళ్ళ వెళ్ళే రహదారి, శంకరాపురం నుంచి తూర్పుకంభంపాడు వెళ్ళే రోడ్డులోనూ మలుపులు ఉన్నాయి. ఈ మలుపులు వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఏడాది శంకరాపురం నుంచి నూజెండ్లపల్లి వెళ్తున్న ఆటో ప్రమాదానికి గురై పలువురు మృత్యువాతపడ్డారు. రెండు నెలల క్రితం శంకరాపురం సమీపంలో ద్విచక్ర వాహనం మలుపుల వద్ద ప్రమాదానికి గురై ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మలుపులకు తోడు చిల్లచెట్లు సైతం రహదారులను కమ్మేయడంతో ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు స్పందించి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని వేగవంతంగా పూర్తి చేస్తాం!

- వైసీపీ పాలకులు జాతీయస్థాయి పథకాన్ని నిర్వీర్యం చేశారు
- టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



నిలిచిపోయిన డ్రైవింగ్ స్కూల్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

దర్శి, జూన్ 24: జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం నిర్మాణాన్ని వేగవంతంగా చేపట్టి వీలైనంత త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. దర్శి-కురిచేడు రోడ్డులో అర్ధంతరంగా నిలిచిపోయిన డ్రైవింగ్ శిక్షణ, పరిశోధనా కేంద్రాన్ని సోమవారం సాయంత్రం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. గత టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన విషయాన్ని, పనులు ఆరంభమైన తర్వాత వైసీపీ ప్రభుత్వం హయాంలో నిలిపివేసిన వివరాలను ఆర్‌అండ్‌బి డీఈ కృష్ణ తెలిపారు. ఈసందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ దక్షణ భారతదేశంలో జాతీయస్థాయిలో కలిగిన ఈ పథకాన్ని సీఎం చంద్రబాబు దర్శికి కేటాయిస్తే వైసీపీ పాలకులు ఉద్దేశపూర్వకంగా పనులు ఆపేశారన్నారు. వైసీపీ ప్రభుత్వానికి అభివృద్ధి పట్టలేదన్నారు. దీంతో దర్శి నియోజకవర్గం ఎంతో వెనుకబడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టు నిర్మాణంకు రూ.18.51 కోట్లు నిధులు విడుదల చేస్తూ తొలి సంతకం చేయటం ఆనందదాయకమన్నారు. దర్శి అభివృద్ధికి తొలిమెట్టుగా నిధులు విడుదల చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, విద్యుత్, సాంఘిక సంక్షేమ శాఖల మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిలకు కృతజ్ఞతలు తెలిపారు. వీలైనంత త్వరలో టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వందలాది మందికి ఉద్యోగాలు, వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

కార్యక్రమంలో రవాణాశాఖ అధికారి రవికుమార్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, డాక్టర్ లలిత్‌సాగర్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్, దారం సుబ్బారావు, గోపు యర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేశారు.. కాలువలు మరిచారు

- అసంపూర్తిగా పనులు
- రోడ్డుపైకి చేరుతున్న మురుగునీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మురుగు కాల్వలు లేని తాళ్లూరు - ముండ్లమూరు మార్గం

తాళ్లూరు, జూన్ 24: సీసీ రోడ్డు వేసి మురుగు కాల్వల నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైకి మురుగు నీరు చేరుతుండటంలో తీవ్ర అసౌకర్యంగా ఉంది. తాళ్లూరులోని రాముల వారివారిమేడ నుండి కోట హనుమారెడ్డి ఇంటి వరకు ఆర్‌అండ్‌బీ అధికారులు సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. అయితే, మురుగు కాల్వలు లేక అసౌకర్యంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రోడ్డు పనులను పూర్తిచేశారు. నిధులు చాలక మురుగు కాలువ పనులు నిలివేయటంతో ఆవీధి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ అధికారంలోకి రావటంతో నిధులు సమకూర్చి అసంపూర్తిగా వున్న కాలువ నిర్మాణ పనులు పూర్తి చేస్తారని ఆవీధి ప్రజలు ఎదురు చూశారు. గత వైసీపీ పాలకులు కాలువ నిర్మాణ పనులు చేపట్టిన దాఖలాలు లేవని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈమార్గంలో రాముల వారి గుడి వద్ద నుంచి ముండ్లమూరు వెళ్లే మార్గంలో కోట హనుమారెడ్డి ఇంటి వరకు రోడ్డు నిర్మాణం, కాలువ పనులకు రోడ్డును విస్తరించారు. సీసీరోడ్డు నిర్మాణం పనులను పూర్తి చేసి, రోడ్డుకు ఇరువైపులా సైడు కాలువ నిర్మాణం చేపట్టలేదు. రోడ్డు పనులను పూర్తి చేసిన అధికారులు కాలువ నిర్మాణ పనులను చేపట్టక ఇళ్ల ముందు గుంతలు తీసి వదిలేశారు.

వైసీపీ ప్రభుత్వంలో అధికారులు అసంపూర్తిగా ఉన్న మార్గంలో కాలువలు నిర్మాణం చేసిన పాపాన పోలేదు. దీంతో నిత్యం ఆగుంతల్లో దిగి ఇళ్లలోకి వెళ్లలేక కొందరు వాటిని పూడ్చి వేశారు. కొందరు ఇళ్లలోకి వెళ్లేందుకు సీసీ రోడ్డుపైనుంచే మెట్లు నిర్మించుకొని రాక పోకలు సాగిస్తున్నారు. వర్షాకాలంలో వచ్చే వర్షపునీటికి తోడు పైనుండి సైడుకాలువల ద్వారా వచ్చే మురుగు నీరురోడ్డు మార్గం గుండా ప్రవహిస్తూ రాముల వారి గుడి వెనుక వున్న ఇళ్లలోకి వచ్చి చేరుతుంది. గుండి ముందు భాగంలో నీరు నిల్వ ఉంటూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో అధికారులు అసంపూర్తిగా మిగిలిన మురుగు కాలువ పనులు చేయకపోవటంతో ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. అనేక మార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకున్న నాథుడేలేడని గృహయజమానులు వాపోతున్నారు.

ఇప్పటికైనా స్థానిక దర్శి టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి త్వరితగతిన అసంపూర్తిగా వున్న సైడు కాలువల నిర్మాణ పనులు పూర్తిచేయించి తమ ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి



ర్యాలీ చేస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

పామూరు, జూన్ 24: బడిఈడు పిల్లలు పనులకు వెళ్లకుండా పాఠశాలలో చేరాలని హెచ్‌ఎం ఎం.రామస్వామి అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. చదువుకోవాల్సిన బడిఈడు పిల్లలు పనులకు వెళ్లరాదన్నారు. ప్రతిఒక్కరూ చదువుకోవాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహిస్తుందని ప్రధానోపాధ్యాయుడు రామస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాగుంటకు టీడీపీ నేతల అభినందనలు



పార్లమెంట్‌సెంట్రల్ హల్‌లో ఎంపీపీ మాగుంటకు శుభాకాంక్షలు తెలుపుతున్న తాళ్లూరు తెలుగు తమ్ముళ్లు

తాళ్లూరు, జూన్ 24: ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమానికి మండలంలోని పలుగ్రామాలకు చెందిన తెలుగు తమ్ముళ్లు ఆదివారం ఢీల్లీకి తరలివెళ్లారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఎంపీ మాగుంట ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించారు. అనంతరం మాగుంటను తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, శ్రీసరస్వతీ విద్యాసంస్థల చైర్మన్ ఏపీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో టీడీపీ నేతలు వీసీరెడి, పుట్టా నరసింహారావు, నారిపెద్ది కల్యాణ్ చక్రవర్తి, కొర్రపాటి శ్రీనివాసరావు, కైపు రామకోటిరెడ్డి, డాక్టర్ చిన్న, యత్తపు కాశిరెడ్డి, పిచ్చిరెడ్డి, మేడగం సుబ్బారెడ్డిలు దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు.

దర్శి: పార్లమెంట్ సభ్యుడిగా సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన మాగుంట శ్రీనివాసరెడ్డిని దర్శి టీడీపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. పార్లమెంట్ హాలులో దర్శి నగర పంచాయతీ కౌన్సిలర్ వీసీ రెడ్డి, నాయకులు బొగ్గవరపు సుబ్బారావు, అచ్చుత ప్రకాష్, గుర్రం బాలకృష్ణ, పణిదపు వెంకటరావు తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

ముండ్లమూరు: ఎంపీగా మాగుంట ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండలంలోని మారెళ్ళ, పోలవరం గ్రామాలకు చెందిన ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు పాశం వెంకటేశ్వరరావు, కొర్రపాటి శ్రీనివాసరావు తదితరులు ఢిల్లీ వెళ్లారు. పార్లమెంట్ హాల్‌లో శ్రీనివాసరెడ్డిని భారీ గజమాలతో, దుశ్శాలువాలతో సన్మానించారు. తనపై అభిమానంతో ఢిల్లీ వచ్చిన నాయకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పామూరు, జూన్ 24: పామూరు కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కటకం సజన తెలిపారు. ప్రస్తుతం విద్యాలయంలో 200 సీట్లకు గాను 150 సీట్లు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన సీట్లకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు చేసుకోవచ్చునని సూచించారు. సీబీఎస్‌ఈ సిలబస్ తో గత ఏడాది పదో తరగతిలో 31 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 30 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అలాగే, ఇంటర్ ఎంపీసీలో చేరేందుకు దరఖాస్తులు చేసుకో వాలన్నారు.



శ్రీగంగాభ్రమరాంబా సమేత చెన్నమల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు

వైభవంగా చెన్నమల్లేశ్వరస్వామి కల్యాణం

తాళ్లూరు, జూన్ 24: లక్కవరంలోని అతిపురాతన శ్రీగంగా భ్రమరాంబ సమేత శ్రీచెన్నమల్లేశ్వరస్వామి దేవస్థాన 601 వార్షికోత్సవ కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. మండలంలోని లక్కవరం గ్రామంలో 601 ఏళ్ల కిత్రం నిర్మించిన పురాతన శ్రీగంగా భ్రమరాంబా సమేత శ్రీచెన్నమల్లేశ్వరస్వామి వార్షికోత్సవ, కల్యాణాన్ని దేవదాయశాఖ అధికారులు, గ్రామ స్థులు ఘనంగా నిర్వహించారు. గుంటూరుకు చెందిన వేదపండితులు వంగర శ్రీకాంత్‌శర్మ, నడింపల్లి వాసుదేవశర్మ ఆధ్వర్యంలో ప్రకాష్‌పంతులు, కామేశ్వరశర్మ, అర్చకస్వాముల మంత్రోచ్చరణల మధ్య వైభవంగా కల్యాణం జరిపారు. గణపతి పూజ అనంతరం కల్యాణ ఘట్టం నిర్వహించారు. టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు కల్యాణ మహోత్సవానికి మాజరై పూజలు చేశారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ముందుగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులకు ఆలయ ముఖ ద్వారం నుంచి వేదపండితులు పూర్ణాకుంభంతో స్వాగతం పలుకుతూ ఆలయంలోకి తీసుక వెళ్లారు. ఆలయంలోని శ్రీగంగా భ్రమరాంబా సమేత శ్రీచెన్నమల్లేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ నేతలు ఓబుల్‌రెడ్డి, శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, వి.సుబ్బయ్య, మేడగం వెంకటేశ్వరరెడ్డి, పేరిరెడ్డి, హనుమారెడ్డి, పేరిరెడ్డి, లక్ష్మీరెడ్డి, ఆదినారాయణ, మన్నేపల్లి సమర, పిన్నిక రమేష్, ఆర్.వెంకట్రావు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీధి వ్యాపారులు

కనిగిరి, జూన్ 24: వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పీసీ కేశవరావు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టిన వీధి వ్యాపారులు ఆర్డీఓ జాన్‌ఇర్విన్‌కు వినతి పత్రం అందచేశారు. ఈసందర్భంగా కేశవరావు మాట్లాడుతూ కనిగిరి పట్టణంలోని ప్రధాన వీధులలో తోపుడు బండ్లపై, బంకులలో చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. గత పదిరోజులుగా మున్సిపల్ కమిషనర్ ఫుట్‌పాత్‌లపై ఉన్న బంకులను తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆర్డీఓకు విన్నవించారు. దర్శి తరహాలో ప్రభుత్వ, ప్రయివేటు స్థలాల్లో మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా బంకులను తొలగిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యామ్నాయంగా లబ్ధి పొందేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ కాంప్లెక్స్ ఏర్పాటుచేయడంవల్ల చిరు వ్యాపారులకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ తెలిపారు. ఈ చర్యల వెనుక ఏ ఒక్కరి ప్రమేయము లేదన్నారు. కార్యక్రమంలో వీధివ్యాపారుల సంఘం నాయకులు షేక్ చాంద్‌బాషా, బాజీ, షేక్ పేర్ల గౌసుద్దీన్, రామయ్య, సుబ్రమణ్యం, బాలాజీ, పి.వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు ప్రసన్న, రమణమ్మ, నరేంద్ర, కేశవులు, ఏడుకొండలు పాల్గొన్నారు.

దాతల సహకారంతో నోటు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేస్తుతన్న ఎంఈవో ప్రసాదరావు

సీఎస్‌పురం (పామూరు), జూన్ 24: విద్యార్థులు క్రమ క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మండల విద్యాశాఖాధికారి జె.ప్రసాదరావు అన్నారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో దాత చెరుకుపల్లి వెంకటరెడ్డి ఆర్థిక సహకారంతో సమకూర్చిన నోటు పుస్తకాలను సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత వెంకటరెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సయ్యద్ ఖాజారహంతుల్లా, సర్పంచ్ వైప్రవీణ్‌కుమార్, పాఠశాల కమిటీ చైర్మన్ గిద్దా ధనలక్ష్మి, గ్రామ పెద్దలు ఇసుకపల్లి తిరుపతయ్య, చెరుకుపల్లి రాధరెడ్డి, రహీమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





సహకారం.. ప్రక్షాళన

- ఐదేళ్లలో పూర్తిగా నిర్వీర్యమయిన సహకార సంఘాల సొసైటీలు
- వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే రుణాలు
- త్రీమెన్ కమిటీలను రాజకీయ పునరావాసాలుగా మార్చిన వైనం
- వాటి రద్దుకు కొత్త ప్రభుత్వం ఆదేశాలు
- పర్సన్ ఇన్‌చార్జిల నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఐదేళ్ల పాటు పీఏసీఎస్‌లన్నీ వైసీపీ నేతల కబంధ హస్తాల్లో ఉండిపోయాయి. ఎన్నికల ఊసే లేకుండా త్రీమెన్ కమిటీల పేరిట నామినేటెడ్ పోస్టుల్లో వైసీపీ నేతాగణాన్ని కూర్చోబెట్టి సహకార సంఘాల ఉద్దేశాన్నే దెబ్బతీసే విధంగా వ్యవహరించారు. రైతులకు రుణాలు ఇవ్వకుండా వారికి నచ్చిన వారికే సొసైటీ రుణాలు అందే విధంగా చూశారు. అభ్యంతరం తెలిపిన ఉద్యోగులను కూడా ఇష్టారీతిన బదిలీ చేసి తమ పబ్బాన్ని గడుపుకున్నారు. ఏటా జరిపే ఆడిట్‌లో అక్రమాలు వెలుగు చూస్తున్నప్పటికీ ఆ నివేదికలను సైతం బయటకు రాకుండా తొక్కిపెట్టారు. కోట్ల రూపాయలు పక్కదారి పట్టినా రికవరీ ఊసే లేకుండా పోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే సహకార సంఘాల రుణాల పేరిట వైసీపీ నేతలు పెద్ద ఎత్తున లబ్ధి పొంది అర్హులైన రైతుల నోట్లో మట్టి కొట్టారు.

బాపట్ల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం కొలువు దీరగానే ఈ సహకార సంఘాల ప్రక్షాళనపై దృష్టి పెట్టింది. పీఏసీఎస్(ప్రైమరీ అగ్రికల్చరల్‌క్రెడిట్ సొసైటీ)లో కొనసాగు తున్న త్రీమెన్ కమిటీలను వెంటనే రద్దు చేస్తున్నట్లు ఆదేశాలిచ్చింది. రాజీనామాకు కొంతమంది వైసీపీ నేతలు ససేమిరా అన్నప్పటికీ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం సాంకేతి కంగా వారు పదవుల్లో లేనట్లే. ఆయా సొసైటీల్లో పర్సన్ ఇన్ చార్జిల నియామకానికి సహకార శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే వారి నియామకం జరగనుంది.

2018లోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా..

సహకార సంఘాలకు చివరిసారి ఎన్నికలు 2013లో జరిగాయి. షెడ్యూల్ ప్రకారం 2018లో నిర్వహించాల్సి ఉంది. అప్పట్లో సొసైటీల పాలకవర్గాన్ని ఏడాది కాలం పాటు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు. 2019లో వైసీపీ ప్రభుత్వం గద్దెనెక్కగానే ఎన్నికల సంప్రదాయానికి తిలోదకాలిస్తూ సెవన్‌మెన్ కమిటీ, త్రీమెన్ కమిటీలపేరిట వైసీపీ నేతలను సొసైటీల్లోని పదవుల్లో నామినేటెడ్ ప్రాతిపదికన నియమిస్తూ వచ్చింది. ఆరునెలల కొకసారి వారి పదవీకాలం పొడిగించుకుంటూ వచ్చింది తప్పితే సొసైటీలకు ఎన్నికలు జరిపి పాలకవర్గాలను నియమించే ప్రయత్నం చేయలేదు. మధ్యలో ఒకట్రెండు సార్లు సహకార సంఘాలకు ఎన్నికలంటూ హడావిడి చేసి ఓటరు జాబితాలను కూడా సిద్ధం చేశారు. తర్వాత వాటిని పట్టించుకున్న పాపాన వైసీపీ పోలేదు.

ఐదేళ్లలో అనేక అక్రమాలు..

వైసీపీ నేతాగణమే సొసైటీ పదవుల్లో ఉండడంతో రుణాల విషయంలో అనేక అక్రమాలకు వారు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పంగలూరు మండలం నూజెళ్లపల్లి సొసైటీలో లాకర్‌లో బంగారం లేకుండానే రైతుల పేరిట వైసీపీ నేతలే రూ.2.20 కోట్ల రుణాలు పొందిన బాగోతం గతంలో వెలుగు చూసింది. అది బయటపడడంతో అధికారుల హడావిడి తప్పితే రికవరీ మాటేలేదు. డీసీసీబీల పరిధిలో కొందరు బ్యాంకు అధికారులు, వైసీపీ నేతలు కుమ్మక్కై కోట్ల రూపాయల రుణాలను నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలతో రుణాలు పొందారన్న ఆరోపణలు గతంలో వచ్చాయి. ఉమ్మడి గుంటూరు డీసీసీబీ పరిధిలోనే దాదాపు రూ.80 కోట్లకు పైగానే సొమ్ము దుర్వినియోగమైందని రైతులు అంటున్నారు. ఉమ్మడి ప్రకాశం డీసీసీబీ కిందకు వచ్చే చీరాల, అద్దంకి, పర్చూరు సొసైటీల్లో కూడా పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని వాటన్నింటిపై సమగ్ర విచారణ జరగాలనే డిమాండ్లు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి.



పంగలూరు మండలంలోని నూజెళ్లపల్లి పీఏసీఎస్ భవనం

ఉద్యోగులపైనా వేధింపులు..

అవినీతి ఆరోపణలే కాకుండా ఉద్యోగులను వేధించడంలో త్రీమెన్ కమిటీలు ఇష్టారీతిన వ్యవహరించాయి. రాజకీయ కారణాలతో ఎప్పటి నుంచో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో వైసీపీ విధేయులకు పోస్టింగ్ ఇచ్చుకున్నారు. 2019 కన్నా ముందు సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేసేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పాత తేదీలు వేసి మరీ వారికి కొమ్ముకాసే ఉద్యోగులను రెగ్యులర్ చేశారన్న విమర్శలు అప్పట్లో వ్యక్తమయ్యాయి. రుణాల పేరిట స్వాహా చేసిన మొత్తాలతో పాటు ఉద్యోగుల రెగ్యులరైజ్ విషయంలో జరిగిన అవకతవకల విషయంలో సమగ్ర విచారణ దిశగా కొత్త ప్రభుత్వం ప్రక్షాళన మొదలెట్టింది.

ఆడిట్ నివేదికలపై దృష్టి...

ప్రతి ఏడాది సొసైటీల్లో చేపట్టే ఆడిట్ నివేదిక వివరాలను గత ప్రభుత్వం గోప్యంగా ఉంచింది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం రావడంతో రాష్ట్రస్థాయిలోనే ఆ నివేదికలపై కదలిక ప్రారంభమైంది. ఆయా సొసైటీల్లో వాటికి సంబంధించిన నివేదికలపై తీవ్ర కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వైసీపీ నేతల సేవలో తరించిన వీరవిధేయ ఉద్యోగులు ఇప్పటికే సెలవుపై వెళ్లినట్లు సమాచారం. ఆడిట్ నివేదికలతో పాటు ఐదేళ్ల వ్యవధిలో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు ఇవన్నీ బేరీజు వేసుకుని ఎక్క డెక్కడ అక్రమాలు జరిగాయన్న విషయం గుర్తించి వారిపై చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది.



పర్సన్ ఇన్‌చార్జిల నియామకం..

సొసైటీల్లోని కమిటీలన్నీ కూడా రద్దు కావడంతో సహకార సంఘాల్లో పర్సన్ ఇన్‌చార్జిల నియామకానికి ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. అక్కడ నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే ఉద్యోగులు ఆయా పోస్టుల్లో కొలువు దీరనున్నారు. ఇక కొత్త ప్రభుత్వం ప్రాధమ్యాల ప్రకారం సహకార సంఘాలకు ఎన్నికలు జరపడ మా లేదా అనేది త్వరలోనే నిర్ణయం కానుంది. అప్పటివరకు పర్సన్ ఇన్ చార్జిల ద్వారా పాలన నడిపించనున్నారు. ఆయా సొసైటీల్లో ఐదేళ్ల వ్యవధిలో పొందిన రుణాలు, సదరు పేర్ల వివరాలపై ఇప్పటికే నూతన ప్రభుత్వం వివరాలు సేకరిస్తోంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 సహకార సంఘాలు..

బాపట్ల జిల్లాలో మొత్తం 112 పీఏసీఎస్‌లు ఉండగా వీటిలో 68 సొసైటీలు ఉమ్మడి గుంటూరు పరిధిలోని డీసీసీబీ కింద ఉండగా, 44 పీఏసీఎస్‌లు ఉమ్మడి ప్రకాశం పరిధిలోని డీసీసీబీ కింద ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా చూస్తే మొత్తం 167 సహకార సంఘాలు ఉన్నాయి. డీసీసీబీకి సెవన్‌మెన్ కమిటీలు, పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీలను నామినేటెడ్ పద్ధతిన వైసీపీ ప్రభుత్వం నియమిస్తూ వచ్చింది. ఈ కమిటీల్లో ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నేతాగణానికి చోటు కల్పించి ఇష్టారీతిన వ్యవహరించారు. నూతన ప్రభుత్వం కొలువుదీరగానే కొంతమంది వెంటనే రాజీనామాలు సమర్పించగా, ప్రభుత్వం జారీచేసిన జీవో ప్రకారం ఆ పదవులన్నీ రద్దయినట్లయింది. అన్ని కమిటీలకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తప్పుకోవాలనే నోటీసులు కూడా సహకార శాఖ పంపించింది.

నెరవేరిన కల

- మూడు జిల్లాల్లో 318మంది గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవో అధికారాలు
- జీవో ఇచ్చి నాలుగు నెలలు తొక్కిపెట్టిన గత ప్రభుత్వం
- ఎన్నికల ముందు ఫిబ్రవరిలో హడావుడిగా జీవో జారీ
- కొత్త ప్రభుత్వం రాకతో ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

గుంటూరు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల కల ఎట్టకేలకు నెరవేరింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వేళ వారికి డీడీవో అధికారాలు సొంతమయ్యాయి. 2019లో సచివాలయ పరీక్షల ద్వారా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 568 మందిని పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-5గా గత ప్రభుత్వం ఎంపిక చేసింది. కానీ వారందరినీ సచివాలయాలకే పరిమితం చేసి గ్రామ పంచాయతీ వ్యవస్థను నీరుగార్చింది. వందల సంఖ్యలో పంచాయతీలు ఖాళీగా వున్నా.. అంతకు మించిన సంఖ్యలో పంచాయతీ కార్యదర్శులు కళ్లెదుటే వున్నా వారికి అధికారాలు మాత్రం ఇవ్వలేదు. వారిని సచివాలయాల్లోనే ఉంచి జాబ్‌చార్టు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంది. ఫలితంగా కార్యదర్శులు లేక పంచాయతీల పనితీరు పూర్తిగా దెబ్బతింది. ఉద్యోగుల నుంచి ఒత్తిడి వస్తుండడంతో కార్యదర్శులకు అధికారాలు ఇస్తామని 2022లోనే వైసీపీ ప్రభుత్వం జీవో నెం.149 విడుదల చేసి హడావుడి చేసింది. ఆ తరువాత జీవోను బుట్టదాఖలు చేసింది. మరలా ఈ ఏడాది ఎన్నికలకు ముందు హడావుడిగా ఫిబ్రవరి 15న మరోమారు జీవో ఎంఎస్. నెం.11 పేరుతో మరో జీవో విడుదల చేసింది. అది కూడా అమలుకు నోచుకోలేదు.

నాలుగు నెలల క్రితమే జీవో..

నాలుగు నెలల క్రితమే ప్రభుత్వం జీవో ఇచ్చినా జిల్లా స్థాయిలో అధికారులు జీవోలను తొక్కిపెట్టారు. గత ప్రభుత్వానికి ఎన్నికల్లో లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశంతోనే తమకు విధులు కేటాయించకుండా తాత్సారం చేశారని గ్రేడ్-5 కార్యదర్శులు గతం నుంచి ఆరోపిస్తూనే ఉన్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్ వారి ఆరోపణలకు బలం చేకూర్చేలా వుంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 1230 గ్రామ పంచాయతీలు వుండగా, దాదాపు 700 మంది గ్రేడ్- 1, గ్రేడ్-2, గ్రేడ్-3, గ్రేడ్- 4 పంచాయతీ కార్యదర్శులు వున్నారు. 2019లో సచివాలయ పరీక్షల ద్వారా మరో 568 మందిని గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులు ఎంపికైనా వారికి విధులు కేటాయించలేదు. దీంతో వారంతా సచివాలయాల్లో, గ్రేడ్- 1- 4 కార్యదర్శుల సహాయకులుగా మాత్రమే మిగిలిపోయారు. డీడీవో పవర్ ఇవ్వలేదు. పంచాయతీ కార్యదర్శులకు ఉండే డీడీవో పవర్ మాటేమోగానీ, కనీసం జనన, మరణ, వివాహ నమోదు, ధ్రువీకరణ పత్రాల జారీ, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల వంటి ప్రాథమిక విధులు కూడా వారికి దక్కలేదు. దీంతో చాలా పంచాయతీల్లో సాధారణ పరిపాలన దెబ్బతింది. 'ఒక పంచాయతీ ఒక కార్యదర్శి' దస్త్రాలపై 2023 సెప్టెంబరులోనే అప్పటి ముఖ్యమంత్రి సంతకం చేసినప్పటికీ అది జిల్లాలో అమలుకు నోచుకోలేదు. పంచాయతీ కార్యదర్శులను వారి శాఖకు సంబంధించిన విధులకు పరిమితం చేయకుండా సంబంధం లేని అనేక విధులకు కేటాయిస్తున్నారు. అందులో భాగంగా దాదాపు 91 మందికి బీఎల్‌వో విధులు కేటాయించారు. ఆ విధులకు ఆటంకం ఏర్పడుతుందన్న కారణంగా అపాయింటింగ్ అథారిటీగా వున్న గుంటూరు జిల్లా కలెక్టర్ జీవోను అమలు చేయకుండా ఆపారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

318 మందికి పంచాయతీల కేటాయింపు

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో మొత్తం 318 మందికి ప్రత్యేకంగా గ్రామ పంచాయతీలు కేటాయించారు. ఇప్పటి వరకూ అమలులో ఉన్న క్లస్టర్ విధానాన్ని రద్దు చేసి, క్లస్టర్ పరిధిలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేకంగా ఒక పంచాయతీ కార్యదర్శిని కేటాయించారు. పల్నాడు జిల్లాలో అత్యధికంగా 159 పంచాయతీలకు, బాపట్ల జిల్లాలో 89 పంచాయతీలకు, గుంటూరు జిల్లాలో 70 పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులను కేటాయించారు. కాగా ఇప్పటికే పంచాయతీల పరిధిలో పనిచేస్తున్నవారికి ఆయా పంచాయతీలనే ఖరారు చేశారు. కాగా రెండు, మూడు సచివాలయాలు ఉన్న మేజర్ పంచాయతీల్లో సీనియర్ కార్యదర్శిని యథాతథంగా కొనసాగిస్తున్నారు. కాగా సచివాలయాల్లో వున్న గ్రేడ్-5 కార్యదర్శులకు మాత్రం పంచాయతీలను కేటాయించలేదు. ఇలాంటి వారు 50 మంది వరకూ వున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు పోటీ పరీక్షలు, ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా సెలవుపై మరో 40 మంది వరకూ ఉండొచ్చని తెలుస్తోంది. వారందరికీ పోస్టింగు పెండింగులో వుంది. ఖాళీగా ఉన్న పంచాయతీలను గుర్తించి వారిని ఆ పంచాయతీలకు కేటాయిస్తామని అధికారులు చెబుతున్నారు.

నాలుగున్నరేళ్ల పోరాట ఫలితం..

మాకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రుణపడి వుంటాం. గత ప్రభుత్వం మమ్మల్ని నియమించినా, సేవలను వినియోగించుకోలేదు. మానవ వనరులన్నీ వృథా అయిపోయాయి. ఈ ప్రభుత్వం దాన్ని గమనించి సరిచేసింది. మా సేవలు పూర్తి స్థాయిలో అందిస్తాం.

- బెజ్జం రోజా ప్రకాశ్, గ్రామ వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

చీరాల ఘటనలపై.. లోకేశ్ ఆరా

- ఎవరినీ ఉపేక్షించవద్దని ఎమ్మెల్యే కొండయ్యకు ఆదేశం
- బాధితులకు అండగా ఉంటామని భరోసా



చీరాల, జూన్ 24: వారం రోజుల్లో చీరాల నియోజకవర్గంలో జరిగిన వరుస ఘటనలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆయా ఘటనలకు సంబంధించి పూర్వాపరాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఆ క్రమంలోనే ఎమ్మెల్యే కొండయ్యకు ప్రత్యేక సమాచారం పంపినట్లు తెలిసింది. అందుకు అనుగుణంగా తదుపరి చర్యలకు కొండయ్య కార్యాచరణ రూపొందించుకుంటున్నట్లు తెలిసింది. ఎస్బీ, పోలీస్, ఇంటెలిజెన్స్, రెవెన్యూ, మండల పరిషత్ పనితీరుపై ఎమ్మెల్యే కొండయ్య సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. అధికార యంత్రాంగం వైఫల్యమా, యాధృశ్చిక ఘటనా అనే కోణంలో కూడా ఆరా తీస్తున్నారు. గంజాయి, మత్తు పదార్థాలు సేవించి విశృంఖలంగా వ్యవహరించే వ్యక్తులు ఎంతటి వారైనా సరే ఉపేక్షించవద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం.

పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా

జరుగుతున్న ఘటనకు సంబంధించి పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై కూడా పోలీస్ ప్రత్యేక దృష్టి సారించింది. తీరప్రాంతంలో గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం ఆందోళన కలిగించే స్థాయికి చేరింది. తీరప్రాంత గ్రామాల్లో సిగరెట్, కిళ్లీ దొరికినంత సులువుగా గంజాయి దొరుకుతుండడం అందుకు నిదర్శనమంటున్నారు. పలు కాలేజీల విద్యార్థులకు కూడా బృందాలుగా గంజాయిని సరదా పేరుతో సేవిస్తున్నారు.

తీరంలో క్యాంప్ ఫైర్లు.. మద్యం పార్టీలు

రామాపురం, కఠారివారిపాలెంల మధ్య రిసార్టుల నిర్వాహకులు క్యాంప్ ఫైర్ పేరుతో రాత్రిళ్ల విందు, వినోదాలకు తెరతీశారు. వాస్తవానికి వాటికి ఎలాంటి అనుమతులు ఉండవు. ఇది అన్ని శాఖల ప్రభుత్వ అధికారులకు తెలిసిన బహిరంగ రహస్యం. కానీ వాటిపై కన్నెత్తి చూడరు. అలా నిర్వహించే కొన్ని పార్టీలలో కూడా గంజాయి వినియోగం జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

గంజాయి బ్యాచ్‌లపై నిఘా.. తల్లిదండ్రులకు శిక్ష

ప్రాథమికంగా గంజాయి బ్యాచ్‌లపై ప్రత్యేక నిఘా పెట్టారు. అందులో భాగంగా గంజాయి తాగే వారు, విక్రయించే వారితో పాటు వారి తల్లిదండ్రులపై కూడా కేసుల నమో దు చేసి జైలుకు పంపే దిశగా తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పోలీస్ అధికారులకు చెప్పారు. గంజాయితో పాటు ఇతర మత్తుపదార్థాలైన నిషేధిత పొగాకు ఉత్పత్తుల రహస్య విక్రయాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.



సముద్ర స్నానాలపై తాత్కాలిక నిషేధం

వరుస ఘటనల నేపథ్యంలో వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం మధ్య సముద్ర స్నానాలపై తాత్కాలిక నిషేధం విధించారు. అది శాశ్వత పరిష్కారం కాదు. రిసార్టుల నిర్వాహకుల ఒత్తిడికి లోనుకాకుండా ప్రభుత్వ యంత్రాంగం, పాలకులు కొన్ని కఠిన నిర్ణయా లు తీసుకుంటేనే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రజలు భావిస్తున్నారు.

షూటింగ్‌ల పేరిట మినీ రేవ్ పార్టీలు

రామాపురం, పొట్టి సుబ్బయ్యపాలెం మధ్య తీరంలో షార్ట్ ఫిల్మ్‌ల షూటింగ్‌ల పేరుతో కొందరు మినీ రేవ్ పార్టీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. విషయం తెలిసినవారు నిజమేనని చెప్తున్నారు. ఎన్‌డీపీ (నాన్ డ్యూటీ పెయిడ్) లిక్కర్ వినియోగం, గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలు కూడా కొంతమేర వినియోగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

మాతో అందరికీ మొహమాటం

జరుగుతున్న వరుస ఘటనల నేపథ్యంలో చిన్న చిన్నగా రిసార్ట్‌ల నిర్వాహకులు ఏకతాటిపైకి వస్తున్నారు. ఐక్యతా స్వరం వినిపించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అందులో భాగంగా పలు శాఖల అధికారులు, రాజకీయ నాయకులకు తమతో మొహమాటం ఉంటుందని, సందర్భానుసారంగా వారి సిఫార్సులను తాము అంగీకరిస్తుంటామని రిసార్టు నిర్వాహకులలో పలువురు తమ సన్నిహితులకు చెప్పటం విశేషం. అదే నిజమైతే జరుగుతున్న నష్టాలు, మూల్యంగా చెల్లిస్తున్న ప్రాణాలకు ఖరీదు కట్టినట్లే.

అనుమతులతో నిర్వహిస్తే పర్యాటకులకు భద్రత.. ప్రభుత్వానికి ఆదాయం

వాడరేవు, రామాపురం, కఠారివారిపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెంలో ఉన్న రిసార్టుల నిర్వాహకులు తాము నిర్వహించే రిసార్టులకు లెక్కా, పత్రాలు పక్కాగా చూపాలి. క్యాంప్ ఫైర్ లాంటివి నిర్వహిస్తే అనుమతి పొందాలి. తీరంలో ఆయా రిసార్టుల నిర్వాహకులు ప్రభుత్వంతో కలసి గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలి. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. స్థానిక స్థితిగతులను తెలిపే గైడ్‌లను ఏర్పాటు చేయాలి. దీంతో పలువురికి ఉపాధి వస్తుంది. ప్రభుత్వానికి ఆదాయం ఉంటుంది. పర్యాటకులకు భద్రత ఉంటుంది.

ఆగని.. ఇసుక దందా

- సర్కార్ మారినా ఇసుక అక్రమ తవ్వకాల ఆపని వైసీపీ నాయకులు



బాపట్లరూరల్, జూన్ 24: బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ మహాత్మాజీపురం గ్రామశివారులో రైల్వేట్రాక్ పక్కన అక్రమ ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సర్కార్ మారినప్పటికీ వైసీపీ నాయకులు ఎంతో ధీమాగా ఇసుక తవ్వకాలను జరుపుతున్నారు. అడిగేవారు అడ్డుకునేవారు లేరనే రాత్రుల సమయంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పంట పొలాల మధ్య ఇసుకను జేసీబీల ద్వారా అధికలోతు తవ్వటంతో భూసారం తగ్గిపోవటంతో రైతులు తమ పంట దిగుబడి తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వారీలలో ఇసుకను తవ్వి పెద్దపెద్ద గుట్టలుగా వేసి రాత్రుల సమయాల్లో ఇసుక రవాణా జరుపుతున్నారు. గత కొన్నిరోజులు నుంచి ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నప్పటికి సెబ్ అధికారులు నిర్లక్ష్యం వహించి ఇసుకాసురులపై చర్యలు తీసుకోకపోవటం మీద పలు విమర్శలకు దారితీస్తున్నది. ఇప్పటికైనా మహాత్మాజీపురం గ్రామశివారులో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జిల్లా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుంటారో లేదో వేచిచూడాలి.



వెస్ట్ బాపట్ల మహాత్మాజీపురం పంట పొలాల్లో వైసీపీ నేతలు జరుపుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు

తీరంలో యాత్రికులకు అనుమతి లేదు : ఎస్పీ



సూర్యలంక తీరంలో పోలీసు బందోబస్తును పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీ కృష్ణ



నిర్మానుష్యంగా సూర్యలంక సముద్ర తీరం

బాపట్ల రూరల్, జూన్ 24: జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలకు యాత్రీకుల అను మతిని తాత్కాలికంగా నిషేదిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం తెలిపారు. ఈ విషయమె ఆయన మాట్లాడుతూ సముద్రంలో సుడులు ఏర్పడటం వల్ల వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. యాత్రీకుల శ్రేయస్సు దృష్ట్యా రక్షణ పరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి సంవత్సరం ఈ కాలంలో జిల్లాలోని సముద్రతీరప్రాంతాలలో సుడిగుండాలు ఏర్పడి గుంటలు ఉండటంతో యాత్రీకులు తరుచు ప్రమాదాలకు గురై మృ త్యువాత పడుతున్నారన్నారు. ఇటీవల సూర్యలంక, ఓడరేవు, రామాపురం బీచ్‌లలో వరుసప్రమాదాలు చోటు చేసుకోవటంతో యాత్రీకు లు మృతి చెందారన్నారు. ఈ వరుస ఘటన లు దృష్ట్యా కొంతకాలం పాటు తాత్కాలికంగా జిల్లాలోని సముద్రతీర ప్రాంతాలకు యాత్రీకులకు అనుమతి నిషేదించడం జరిగిందన్నారు. సుడుల ఉధృతి తగ్గిన తర్వాత తదుపరి ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందన్నారు.

తీరం వద్ద పటిష్ఠ బందోబస్తు

తీరానికి వాహనాలు, పర్యాటకులు వెళ్ళకుండా సూర్యలంక రహదారిపై పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలలు ఉధృతి ఎక్కువగా ఉండటంతో 2, 3 రోజుల్లోనే 15 మంది యువకులు గల్లంతు కాగా మెరైన్ రూరల్ పోలీసులు, గజ ఈతగాళ్ళు ఆ యువకులను కాపాడి ప్రాణాలను రక్షించారు. సూర్యలంక తీరంలో పోలీసు బందోబస్తును డీఎస్పీ మురళీకృష్ణ పరిశీలించారు.

గుప్పుగుప్పు..!

» జిల్లాలో ఎక్కడచూసినా గంజాయే!
» విచ్చలవిడిగా అమ్మకాలు, వినియోగం
» ఆ మత్తులో చిత్తవుతున్న యువత
» గత ఐదేళ్లలో 4,539 కిలోలు పట్టివేత
» విద్యార్థులకు సరఫరా చేస్తున్న ముఠాలు
» ఆ నిషాలోనే దాడులు, అరాచకాలు
» పశ్చిమప్రాంతంలోనూ సాగు

జిల్లాలో ఎక్కడచూసినా గంజాయి గుప్పుగుప్పుమంటోంది. యువత ఆ మత్తులో మునిగితేలుతోంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యపు తీరు, వైసీపీ నేతల కక్కుర్తి గంజాయి ముఠాలకు లైసెన్స్ ఇచ్చినట్లైంది. డబ్బు సంపాదనే ధ్యేయం గా అక్రమార్కులు రెచ్చిపోయారు. దొంగ మార్గాలలో భారీగా సరుకును జిల్లాకు రవాణా చేసి ఏజెంట్లను పెట్టుకుని మరీ విక్రయిస్తున్నారు. కాలేజీ విద్యార్థులు, ఖాళీగా తిరిగే యువకులే లక్ష్యంగా వారిని మత్తుకు బానిసలను చేశారు. కొందరు స్వార్థపరులు కూడా తమ రాజకీయ అవసరాలకు గంజాయి ముఠాలను తయారుచేశారు. ఆ మత్తులో యువకులు దాడులు, అరాచకాలకు పాల్పడుతున్నారు. వీరి కారణంగా నిత్యం ఏదో ఒకచోట గొడవలు, వివాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. జనం ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కాగా ఆ మహమ్మారిని అరికట్టేందుకు ప్రస్తుత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఒంగోలు(క్రైం), జూన్ 24 : గంజాయి మత్తుకు యువత చిత్తవుతున్నారు. కొందరు అక్రమార్కులు సంపాదనే ధ్యేయంగా ఆ విషసంస్కృతిని గ్రామీణ ప్రాంతాలకు పాకించి అనేక కుటుంబాలలో విషాదం మిగిల్చి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. పోలీసులు, ఎస్‌ఈబీ అధికారులు జిల్లాలో గత ఐదేళ్ల కాలంలో వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ కోట్లలో ఉంటుంది. సరుకు విచ్చలవిడిగా దొరుకుతుండటంతో యువత, విద్యార్థులు, నిరుద్యోగులు మత్తుకు బానిసలుగా మారారు. గంజాయి సిగిరెట్లు, చాక్‌లెట్లు జిల్లాలోని అనేక ప్రాంతాలలో పట్టుబడ్డాయి. కొందరు ముఠాలుగా ఏర్పడి యువకులను మత్తుకు బానిసలుగా చేస్తున్నారు. అలాగే చదువుకుంటున్న వారిని కుటుంబాలకు దూరం చేస్తున్నారు. బిడ్డల బంగారు భవిష్యత్‌ను ఆశించిన తల్లిదండ్రులకు చివరకు నిరాశే మిగులుతోంది. మెడికోలు సైతం గంజాయికి అలవాటు పడి కళాశాలలో విధ్వంసం సృష్టించిన ఘటనలు ఉన్నాయి. మొన్నటికి మొన్న ఒంగోలు శర్మాకాలేజీ వద్ద గంజాయి బ్యాచ్ ఓ వ్యక్తిపై దాడిచేసిన ఘటన నగరవాసులను భయకంపితులను చేసింది. గంజాయికి బానిసలుగా మారిన యువకులు అనారోగ్యం పాలై ఆసుపత్రులు పాలవుతున్నారు. ఒంగోలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీఅడిక్షన్ సెంటర్‌లో నెలకు పదులసంఖ్యలో యువకులు చికిత్స పొందటం ఆందోళన కలిగించే అంశం. ఇలా భారీగా జిల్లాకు కిలోల కొద్దీ గంజాయి నిత్యం వస్తుండగా, పనిలో పనిగా ఇక్కడ కూడా సాగు చేయడం ఆందోళన కలిగించే అంశం. పశ్చిమప్రాతంలో పెద్దఎత్తున గంజాయి సాగు చేయగా ఎస్‌ఈబీ అధికారుల ధ్వంసం చేసిన ఘటనలు ఉన్నాయి. కాగా తాజా టీడీపీ ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపుతుందని అందరూ ఎదురుచూస్తున్నారు.

భారీగా సరఫరా ముఠాలు

యర్రగొండపాలెంలో ఓ రైతు కంది పంట సాగు మధ్యలో 282 గంజాయి మొక్కలను పెంచాడు. ఈ మొక్కలను ఎస్‌ఈబీ అధికారులు ధ్వంసం చేశారు. మార్కాపురంలోని బాపూజీ కాలనీలో తన ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచాడు. దోర్నాలలో ఓ రైతు మిర్చి పంటలో గంజాయి మొక్కలు సాగుచేశారు. అంతేకాకుండా ఇతర ప్రాంతాల నుంచి భారీగా గంజాయి తరలించి పొట్లాల రూపంలో విక్రయాలు చేశారు. మరికొంతమంది మొబైల్ విక్రయాలు చేశారు. ఆటోలలో గంజాయి పొట్లాలు పెట్టుకొని ఫోన్ కాల్స్‌తో అవసరమైన వారికి సరఫరా చేశారు. ఇలాంటి గంజాయి సరఫరా చేసే ముఠాలు అనేకం ఉన్నాయి.

జిల్లాలో 4.539 కిలోల గంజాయి పట్టివేత

జిల్లాలో గత ఐదేళ్లలో పోలీసులు, ఎస్‌ఈబీ అధికారులు 4,539 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న సరుకు విలువ సుమారుగా రూ.4.50 కోట్లు ఉండవచ్చని అంచనా. బహిరంగ మార్కెట్లో ఇంకా ఎక్కువే ఉండవచ్చు. కిలో గంజాయి నాణ్యతను బట్టి రూ.10వేలు ఉంటుంది. 2019లో 1,200 కిలోలు, 2020లో 1,050 కిలోలు, 2021లో 813 కిలోలు, 2022లో 950 కిలోలు, 2023లో 526 కిలోలు గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా పోలీసులకు, ఎస్‌ఈబీ అధికారులకు దొరకకుండా ఎక్కువ



మొత్తంలో విక్రయాలు జరిగాయి. 2021లో అప్పటివరకు పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి సుమారు రూ.49లక్షల విలువ చేస్తుందని అంచనా. దానిని ఎస్పీ ఆధ్వర్యంలో దహనం చేశారు. అయినప్పటికీ గంజాయి విక్రేతలు పోలీసులు కఠినచర్యలు తీసుకున్నప్పటికీ ఈ ముఠాలు కార్యకలాపాలు కొనసాగుతూనే ఉన్నాయి.

గంజాయి ఘటనలు మరికొన్ని...

ఒంగోలులో ఇటీవల శర్మా కాలేజీ వద్ద ఓ ఆటోడ్రైవర్‌పై గంజాయి ముఠా దాడిచేసి కర్రలతో విచక్షణ రహితంగా కొట్టింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో రాష్ట్రవ్యాప్తంగా వైరలైంది.

గతంలో రిమ్స్‌లోని మెడికోలు గంజాయి మత్తుకు అలవాటు పడి తరగతి గదులలోనే విధ్వంసం సృష్టించారు. అలవాటు ఉన్న విద్యార్థులు ఇదేమిటని ప్రశ్నించిన తోటి విద్యార్థులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

ఒంగోలు రామ్‌నగర్‌కు చెందిన ఓ విద్యార్థి తన స్నేహితుల ద్వారా మత్తుకు అలవాటు పడి తల్లిపైనే దాడి చేశాడు.

ఒంగోలు కమ్మపాలెం సమీప అప్పాయికుంటలో తెప్పోత్సవం అనంతరం నుంచి సీతారామ ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను తిరిగి కొప్పోలు తీసుకెళుతుండగా గంజాయి మత్తులో ఉన్న యువకులు పూజారులపైన దాడిచేసి విగ్రహాలపై మద్యం పోశారు.

ఒంగోలు కొత్త బైపాస్ రోడ్డులో గంజాయి మత్తులో యువకులు ద్విచక్రవాహనలపై చక్కర్లు కొడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

ఉక్కుపాదానికి రంగం సిద్ధం

నూతనంగా ఏర్పడిన టీడీపీ కూటమి ప్రభుత్వం గంజాయి రవాణా, వినియోగాన్ని సమూలంగా అరికట్టి, యువతను సన్మార్గంలో పెడతామని ప్రకటన చేసింది. సాక్షాత్తు హోంమంత్రి గంజాయి అక్రమ రవాణా మీద దృష్టిసారించాలని పోలీసు శాఖకు ఆదేశాలు జారీచేశారు. అలాగే సోమవారం జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా గంజాయి దందాపై ఉక్కుపాదం మోపాలని సీఎం నిర్ణయించారు. అందుకోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారు. అదేక్రమంలో జిల్లా పోలీసు గంజాయిని అరికట్టేందుకు పోస్టర్‌ను విడుదల చేశారు.

ఇరువర్గీయుల మధ్య విభేదాలు

» పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ

అద్దంకి, జూన్ 24 : అద్దంకి పట్టణంలోని మొండితోకపాలెంలో చర్చి నిర్వహణ విషయమై ఇరు వర్గీయుల మధ్య విభేదాలు తలెత్తడంతో 2 నెలలుగా తాళం వేసి ఉంది. చర్చి స్థల దాతలు, నిర్మాణం సహకరించిన దాతల కుటుంబాల మధ్య విభేదాలు తలెత్తడంతో తాళం వేసినట్లు తెలుస్తుంది. దీంతో రెండు నెలలుగా చర్చిలో ప్రార్థనలు కూడా నిలిచి పోయాయి. చర్చి నిర్వహణ విషయమై ఇరు వర్గీయులు ఆధిపత్య పోరుతో వ్యవహరించడమే కారణంగా తెలుస్తుంది. ఇరువర్గీయులతో చర్చి సంఘాల ప్రతినిధులు చర్చలు జరిపినప్పటికీ ఎప్పటికప్పుడు సమస్య పరిష్కరమైనట్లే కనిపించి మరలా షరా మాములుగా ఉంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో విషయం పోలీస్ స్టేషన్ వరకు చేరడంతో ఆదివారం ఎస్‌ఐ రత్నకుమారి చర్చి వద్దకు వెళ్లి ఇరువర్గీయులతో చర్చించారు. సోమవారం ఉదయానికి గతంలో ఉన్న తాళంకు అదనంగా రెండవ వర్గం ప్రత్యేక తాళం కూడా వేశారు. దీంతో సమస్య మరింత కఠినంగా మారినట్లు తెలుస్తుంది. చర్చికి తాళాలు వేసి ఉండడంతో ప్రార్థనలకు అవకాశం లేకుండా పోయిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంఘ పెద్దలు, పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యను సామరస్యంగా పరిష్కరించి చర్చి తలుపులు తెరిపించాలని, యథావిధిగా ప్రార్థలను చేసుకునే అవకాశం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

దుకాణదారులు జాగ్రత్తలు పాటించాలి

చీరాలటౌన్, జూన్ 24 : పట్టణంలో వాహనాల రద్దీతో పాటు ట్రాఫిక్ సమస్యలు పెరుగుతన్నాయని వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు అన్నారు. ఈక్రమంలో సోమవారం సాయంత్రం పట్టణంలో సిబ్బందితో విస్తృతంగా పర్యటించారు. దుకాణదారులకు పలు హెచ్చరికలను జారీ చేశారు. ఇష్టారీతిగా వ్యాపారాలను రోడ్లపైకి తెస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణదారులు ఆక్రమణలకు పాల్పడకుండా వ్యాపారాలు నిర్వహించాలన్నారు. అలాగే విక్రయిదారులు పార్కింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. సీఐ వెంట ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై సుబ్బారావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మృగాళ్లను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

ఈపూరుపాలెం (చీరాలటౌన్), జూన్ 24 : యువతిపై హత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని పలువురు ఈపూరుపాలెం గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన ఘటన నేపథ్యంలో సోమవారం ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాల నుంచి స్ట్రయిట్ కట్ కాలువ వరకు పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా అతి కిరాతకంగా ఘటనకు పాల్పడినట్లు విలపించారు. వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా శిక్ష పడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని వారంతా పట్టుబట్టారు. కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శ్రీశైలానికి చేరిన టీడీపీ నేతల పాదయాత్ర

సంతమాగులూరు, జూన్ 24: టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతోపాటు, ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్ విజయం సాధించడంతో టీడీపీ శ్రేణులు శ్రీశైలంకు పాదయాత్రగా వెళ్లారు. సంతమాగులూరు మండలం పత్తేపురం గ్రామ టీడీపీ నాయకులు చేపట్టిన పాదయాత్ర సోమవారం శ్రీశైలాంకు చేరుకుంది. భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కనుమూరి ప్రసాద్, అయినాల గోపి, మేకల ఆంజనేయులు, ఏలూరి శ్రీనివాసరావు, ఏలూరి మందారావు, అయినాల మారుతి, ఏలూరి నాగమల్లేశ్వరరావు, నెలకుదిటి వీరాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణలో కార్మికుల పాత్ర కీలకం

చీరాల, జూన్ 24 : ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. క్యాంప్ కార్యాలయంలో సోమవారం రాత్రి ఆయన పారిశుధ్య కార్మికులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఎలాంటి సమస్యలున్నా వాటిని ప్రభుత్వ పరంగా తాము పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు సంబంధించి ఏ ప్రాంతంలో కూడా అపారిశుధ్యం అనేది లేకుండా పూర్తి స్థాయిలో పనిచేస్తూ సత్ఫలితాలను సాధించాలని పిలుపునిచ్చారు. వచ్చేది వర్షాకాలం కావడంతో దోమకాటు పెరిగే అవకాశం ఉందన్నారు. అందుకు సంబంధించి దోమకాటు నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఫాగింగ్, ఆయిల్‌బాల్స్ వినియోగం తదితరాలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, పారిశుధ్య కారికులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు.. ఒకరు మృతి

అద్దంకి, జూన్ 24: ముందు వెళ్తు న్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి కారు ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రాత్రి మండలంలోని తిమ్మాయపాలెం ఇటుక బట్టీల వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు దర్శి మండలం శామంతపూడికి చెందిన బోగిరెడ్డి పవన్‌కుమార్‌రెడ్డి (36) ప్లైవుడ్ హోల్‌సేల్ షాప్ నిర్వహిస్తూ విజయవాడలో నివాసముంటున్నాడు. ప్రకాశం జిల్లాలోని పలు షాపులకు ప్లైవుడ్ సరఫరా చేస్తున్నాడు. అందుకు సంబంధించి నగదు వసూలుకు వచ్చి చీమకుర్తి, పొదిలి, దర్శిలలో కలెక్షన్ చూసుకుని కారులో విజయవాడ వెళ్తున్నారు. ముండ్లమూరు మండలం శంకరాపురం దాటి అద్దంకి మండలం తిమ్మాయపాలెం ఇటుక బట్టీల వద్దకు వచ్చేసరికి పోలవరం నుంచి వెల్లంపల్లికి పొగాకు బేళ్లతో వెళ్తున్న ట్రాక్టర్‌ను కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పవన్‌కుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా, షాపులో పని చేసే కురిచేడుకు చెందిన డ్రైవర్ నరేంద్రరెడ్డికి గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ నాగరాజు పరిశీలించారు. పవన్‌కుమార్‌రెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వైద్యకళాశాల ఏర్పాటు పనుల పరిశీలన

మార్కాపురం, జూన్ 24: మార్కాపురంలో ప్రారంభించనున్న వైద్యకళాశాల నిర్మాణ పనులను, దానికి అనుబంధంగా ఏర్పాటు చేసిన వైద్యశాలలో రోగులకు, సిబ్బందికి చేసిన ఏర్పాట్లను నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు సోమవారం పరిశీలించారు. కమిటీ చైర్మన్ డాక్టర్ బీవ బొరుహ, సభ్యులు డాక్టర్ సంజయ్‌కుమార్ భట్, డాక్టర్ సతీష్ చావన్‌లు తొలుత కొనకనమిట్లలో ఏర్పాటు చేసిన రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌ను, మార్కాపురంలో నూతనంగా ప్రారంభించిన అర్బన్‌హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం మార్కాపురంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ వైద్య కళాశాల కోసం నిర్మించిన అదనపు బెడ్ల నిర్మాణాలను, వైద్యుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదులను పరిశీలించారు. మార్కాపురం మండలం రాయవరం వద్ద నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల భవనం 2024 జూన్ 31 నాటికి ఎన్‌ఎంసీకి అందజేయాలి. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలిస్తే భవన నిర్మాణ పనులు పూర్తియ్యేటట్లు కనిపించడం లేదని నిర్ధారించుకున్నట్లు సమాచారం. అంతేకాక మార్కాపురంలో నిర్మించిన అదనపు బెడ్ల సౌకర్యాల కోసం చేపట్టిన నిర్మాణాలలో సైతం స్వల్ప విభేదాలున్నట్లు సమాచారం. కమిటీ సభ్యులు తమ నివేదికను ఎన్‌ఎంసీకి అందజేసేందుకు సిద్ధం చేశారు. నివేదిక ఆధారంగా జాతీయ స్థాయిలో వైద్యకళాశాల ఏర్పాట్లపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. కార్యక్రమంలో వైద్యకళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డీఎంఏ డాక్టర్ ఎస్.వి.వి.నాగ రాజమన్నార్, సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రి, ప్రొఫెసర్ డాక్టర్ పి.రవికుమార్ పాల్గొన్నారు.

27న జిల్లాకు కొత్త కలెక్టర్

ఒంగోలు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లాకు తాజాగా నియమితులైన కలెక్టర్ తమీమ్ అన్సారియా ఈనెల 27న రానున్నారు. ఆరోజు ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆ మేరకు కలెక్టర్ కార్యాలయ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాగా ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసి అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అయిన ఏఎస్ దినేష్‌కుమార్ 26వతేదీన రిలీవ్ కానున్నారు. ఆ మేరకు సంబంధిత ఉద్యోగులకు ఆయన స్పష్టత ఇచ్చారు. దాదాపు రెండేళ్లకుపైగా దినేష్‌కుమార్ కలెక్టర్‌గా పనిచేశారు. పెద్దగా వివాదాలు, ఆరోపణలు లేకుండానే పనిచేశారు. వైసీపీ ప్రజాప్రతినిధులకు అనుకూలంగా పనిచేశారన్న అభిప్రాయం ఆయావర్గాల్లో ఉన్నప్పటికి అధికారవర్గాలతో మాత్రం సమన్వయంతో స్నేహపూర్వక వాతావరణంలో పనిచేశారన్న గుర్తింపు ఉంది.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

మీకోసంలో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 24: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(మీకోసం) కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. అన్నిశాఖల ఉన్నతాధికారులు తమ లాగిన్‌కు వచ్చిన అర్జీలను రెగ్యులర్‌గా పరిశీలిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. చాలావరకు సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలన్నారు. ఆర్థికపరమైన, న్యాయపరమైన అంశాలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే రాష్ట్రప్రభుత్వానికి లేఖ రాస్తామని కలెక్టర్ తెలిపారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో 214 మంది తమ సమస్యలను విన్నవించుకున్నారు. అనంతరం ఎన్నికల విధుల నిర్వహణలో ఉత్తమ పనితీరు చూపిన అధికారులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో ఆర్.శ్రీలత, ఎస్డీసీ లోకేశ్వరరావు, మాధురి తదితరులు పాల్గొన్నారు

» జిల్లాలో గత నాలుగు నెలలుగా తనిఖీల పేరుతో కొందరు అనేక ఇబ్బందులు పెడుతున్నారని అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, కోశాధికారి కేవీ సుబ్బమ్మ, సహాయ కార్యదర్శి ఎస్. ధనలక్ష్మీలు



ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఫిర్యాదుచేశారు. సురేష్‌బాబు బృందం జిల్లాలో ఆర్టీఐ కింద పిడి ఆర్డర్ ఇచ్చారని చెబుతూ అగన్‌వాడీ కేంద్రాలకు తనిఖీలకు వస్తున్నారని ఫిర్యాదుచేశారు. జిల్లాలోని అనేక మండలాల్లో అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురిచేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు ఇటువంటి తనిఖీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

» ఇంటి స్థలాలను ఇప్పించాలని కొండపి మండలం పెట్లూరుకు చెందిన దళితులు కోరారు. 1983లో అప్పటి ప్రభుత్వం 450 సర్వేనెంబరులో 2.20 ఎకరాల భూమిలో ఇంటిపట్టాలు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి ఇక ఇంటి స్థలాలు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం కుటుంబ జనాభా పెరిగినందున ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మార్టూరు, జూన్ 24: కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన జాతీయరహదారిపై చోటుచేసుకుంది. ఇసుకదర్శి ఫ్లైవోవర్‌పై ముందు వెళ్తున్న కారును వెనుక పొదిలి నుంచి విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో కారులో ఉన్న భార్యాభర్తలకు ఎలాంటి గాయాలు కాలేదు. ఒంగోలు వైపు నుంచి విజయవాడ వైపు కారు వెళుతున్నట్లు తెలిసింది. కారు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన అనంతరం కారులోని వ్యక్తులు కారును అక్కడే విడిచి, మరో వాహనంలో విజయవాడ వెళ్లినట్లు తెలిసింది.

వాగు పోరంబోకులోని కట్టడాలను కూల్చివేయండి

మూడు రోజుల్లో ఈ ప్రక్రియన పూర్తిచేయాలి
ఉత్తర్వులు జారీచేసిన కలెక్టర్ దినేష్‌కుమార్
అక్రమాలను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 24 : మండలకేంద్రమైన సంతనూతలపాడులో వాగు పోరంబోకు స్థలంలో అక్రమంగా నిర్మాణంలో ఉన్న పార్కును కూల్చివేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. అధికారం తమ చేతిలో ఉందన్న కారణంతో కోర్టు స్టే ఉన్నా స్థానిక మండల నాయకుడు ఇష్టారీతిన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతిలో ఏప్రిల్ 1న 'నీ దుంపా తెగ' శీర్షికన కథనం ప్రచురితమైంది. మరోవైపు ఆ స్థలం వాగుపొరంబోకు అని అందులో ఎలాంటి కట్టడాలు చేపట్టవద్దని గతంలోనే స్థానికులు కోర్టును కూడా ఆశ్రయించారు. దీంతో అక్కడ నిర్మిస్తున్న రైతుభరోసా కేంద్రం మధ్యలోనే నిలిచిపోయింది. సార్వత్రిక ఎన్నికల ముందు వైసీపీ మండల కీలకనేత ఎలాంటి అనుమతులు లేకుండానే పార్కు నిర్మాణ పనులు చేపట్టారు. ఆ పనులు చేపట్టేందుకు పంచాయతీ తీర్మానంతోపాటు పంచాయతీరాజ్ నుంచి కూడా నిధుల మంజూరుకు ఎలాంటి ప్రతిపాదనలు రూపొందించలేదు. ఇటీవల సదరు వైసీపీ నాయకుడు ఆ నిర్మాణాలను కొనసాగించాలని కోరుతూ కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసేందుకు ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ఆ అక్రమ నిర్మాణాలపై హైకోర్టులో కేసు ఉండటంతో దీనిపై పెద్దగా పట్టించుకున్న పరిస్థితి లేదు. వచ్చేనెల 7వతేదీన అక్రమ కట్టడాలపై హైకోర్టులో విచారణ కూడా జరగనున్న నేపథ్యంలో కలెక్టర్ దినేష్‌కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అక్కడి జగనన్న లేఅవుట్ సమీపంలో 220/1 సర్వే నెంబరులో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేయాలని తహసీల్దార్‌తోపాటు పంచాయతీ అధికారులను కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ అక్రమ కట్టడాలను మూడు రోజుల్లో కూల్చివేయాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో నిర్మాణాలను చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్డున పడ్డారు. పార్కు నిర్మాణంతోపాటు కల్వర్టులు, లెవలింగ్ కోసం సుమారు రూ.30లక్షలకు పైగా ఖర్చు చేసినట్లు సమాచారం. ఆ మండలంలో కీలకంగా వ్యవహరించే నాయకుడి మాటలు కాదనలేక పనులు చేసిన కాంట్రాక్టర్ ఇప్పుడు లబోదిబోమంటున్నారు. తిరిగి వైసీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, అన్ని తాను చూసుకుంటానని భరోసా ఇవ్వడంతో ఆ పనులు చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఆ పనులు వాగుపోరంబోకు స్థలంలో నిర్మించడం, హైకోర్టులో కేసు ఉండటం తదితర కారణాలు ఆ కాంట్రాక్టర్ తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఏదైనా నిర్మాణాలు చేపట్టాలంటే అందుకు సంబంధించి ప్రతిపాదనలను సంబంధిత అధికారుల ద్వారా చేయాల్సి ఉంది. కానీ అవేమి పట్టించుకోకుండా అధికారం తన చేతిలో ఉందన్న కారణంతో ఇష్టారీతిన నిర్మాణాలు చేపట్టడం విశేషం. కనీసం ఆ పార్కు నిర్మాణాన్ని పీఆర్ ద్వారా చేపట్టడంతోపాటు పంచాయతీలో కూడా తీర్మానం చేయాల్సి ఉంది. కానీ అవేమీ పట్టించుకోకపోవడంతో ఇప్పుడు ఆ నిర్మాణాలను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అదనపు పొగాకు కొనుగోళ్లకు అపరాధ రుసుము రద్దు ?

» కేంద్ర మంత్రి సానుకూల స్పందన
» పియూష్ గోయల్‌ను కలిసిన బోర్డు చైర్మన్, వైస్ చైర్మన్

కందుకూరు, జూన్ 24: పరిమితికి మించి పండించిన పొగాకు అమ్మకాలకు అపరాధ రుసుము లేకుండా బోర్డులో కొనుగోలు చేసేలా అనుమతించాలని కేంద్ర వాణిజ్యశాఖా మంత్రి పియూష్ గోయల్‌కు బోర్డు ప్రతినిధులు విన్నవించారు. రాజమండ్రి ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్, వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు, ఇతర పొగాకుబోర్డు ప్రతినిధులు సోమవారం ఢిల్లీలో గోయల్‌కు కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని దక్షిణాది తేలికనేలల పరిధిలోని వేలం కేంద్రాల్లో ఇప్పటికే అనుమతించిన పొగాకు విక్రయాలు చివరిదశకు చేరుకున్నాయి. కందుకూరు 2 వేలం కేంద్రంలో అధికారిక అమ్మకాలు మూడురోజులక్రితమే పూర్తవటంతో వేలం నిలిచిపోయింది. అలాగే మిగిలిన వేలం కేంద్రాలలో కూడా వారం పదిరోజుల్లో అధికారిక పొగాకు విక్రయాలు పూర్తికానుండగా దక్షిణాది నల్లనేలల పరిధిలోని వేలంకేంద్రాలలో కూడా జూలై మొదటివారంలో అధికారిక పొగాకు వేలం ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని బోర్డు వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు తెలిపారు. ఈ ఏడాది అధికారిక పొగాకుకు దాదాపు సమానంగా పరిమితికి మించి పండించిన పొగాకు రైతుల వద్ద నిల్వ ఉందని ఈ పొగాకుకు అపరాధ రుసుము చెల్లించి అమ్ముకోవాలంటే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉన్నందున ఆ పొగాకును కూడా అపరాధ రుసుము లేకుండా బోర్డులో అమ్ముకునేందుకు అనుమతించాలని విన్నవించామని ఆయన వివరించారు. గత సంవత్సరం ఇలాగే అపరాధ రుసుము లేకుండా అమ్మకాలకు అనుమతించిన విషయాన్ని ఈ సీజన్‌లో కూడా కర్నాటకలో ఇలాగే అనుమతులు ఇచ్చిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే ఉత్తర్వులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని వాసుబాబు తెలిపారు. వారం రోజుల్లో ఈ ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని, ఆ వెంటనే అధికారిక పొగాకు వేలం పూర్తయిన వేలం కేంద్రాలలో అనధికారిక పొగాకు కొనుగోళ్లను ప్రారంభిస్తామని తెలిపారు.



మరుగుదొడ్లు లేని ఇళ్లే అంతఃపురాలు..!

- పాలకులు మారినా.. ప్రభుత్వాలు మారినా మారని షెడ్డు కార్మికుల దీనస్థితి
- ప్రకృతి అవసరం ఎరికైనా ఒక్కటే..

చీరాల, జూన్ 24 : చీరాల మండలం ఈపురుపాలెంలో యువతి రేప్, హత్య రాష్ట్రంలోనే సంచలనం అయింది. బహిర్భూమికి వెళ్లిన యువతిపై మృగాళ్లు సామూహిక దాడి చేసి చంపారు. అయితే ఆ ప్రాంతంలో నివశించే అనేక మంది ఇళ్ల (అద్దెఇల్లు)లో స్నానపు గదులు మాత్రమే ఉన్నాయి. మరుగుదొడ్లు లేవు. స్థితివంతులైన వారు ఇల్లు బాడుగకు తీసుకునేందుకు వారి ఆర్థిక స్థితి సహకరించదు. ఇలా బహిర్భూమికి వెళ్లిన మహిళలు, యువతులు, పిల్లలు తమకు ఎదరయ్యే చేదు అనుభవాలను కనీసం కుటుంబంలో కూడా చర్చించుకోలేక కుమిలిపోతున్నారు.

చీరాల మండలం ఈపురుపాలెం మేజర్ పంచాయతీ. చేనేతకు పుట్టిల్లు. సుమారు 25వేల పైచిలుకు జనాభా ఉంటారు. అందులో సింహభాగం చేనేత, దాని అనుబంధ వృత్తులపై ఆధారపడి జీవిస్తుంటారు. వీరిలో షెడ్ కార్మికులు, నిరుపేదలు అనేక మంది ఉన్నారు. వారికి కనీసం సొంతిల్లు కూడా ఉండదు. అద్దె ఇళ్లే వారి అంతఃపురాలు. ఆ ఇళ్లకు మరుగుదొడ్లు ఉండవు. కేవలం స్నానపు గదులు మాత్రమే ఉంటాయి. ఆ ఇళ్లకు సంబంధించి మగ, ఆడ లేకుండా ప్రకృతి అవసరాలు తీర్చుకునేందుకు బహిర్భూమికి వెళ్లాల్సిందే. అలాంటి సందర్భాల్లో చేదు అనుభవాలు ఎదుర్కొన్న వారూ ఉన్నారు.



మగ్గం పని, వంట, భోజనం, పడక అన్నీ ఒకే గదిలో.. ఈపురుపాలెంలో చేనేత కార్మికులు అద్దెకు ఉంటున్న గది.. షెడ్ కార్మికుల స్నానాల గది

మారని పేదల స్థితిగతులు

పాలకులు మారినా ... ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారడం లేదని సొంతిల్లు కూడాలేని నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న ఇరుకు గది వారి అంతఃపురం. అందులోనే మగ్గంను ఏర్పాటు చేసుకుంటారు. అక్కడే వంట చేసుకోవాలి. అక్కడే భోజనం చేయాలి. అక్కడే నిద్రపోవాలి. ఇది ఎంత కష్టమో పాలకులు, అధికారులు అర్థం చేసుకుని కనీస వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

గంజాయి మూకలను చూస్తే భయం

గంజాయి మూకలను చూస్తే అక్కడి వారికి భయం. రెక్కడితేగానీ డొక్కాడని బడుగు జీవులు కావడం అందుకు కారణం. హత్యాచారాలకు గురైన యువతి కుటుంబం కూడా గూడూరు సమీపంలోని ఇందూరు నుంచి 8 సంవత్సరాల కిందట ఇక్కడకు వలస వచ్చారు. ఆ ప్రాంతంలో ఇలాంటి కుటుంబాలు అనేకం ఉన్నాయి. వారందరూ అద్దె ఇళ్లలోనే ఉంటున్నారు. ఆ ఇళ్లల్లో మరుగుదొడ్లు ఉండవు. బాలికల పాఠశాల ప్రహరీ గోడపై గంజాయి గ్యాంగ్ అప్పుడప్పుడూ కనిపిస్తుంటారని వారంటే తమకు భయమని ఆ ప్రాంతంలో చెప్పుకుంటున్నారు. దీనికి సంబంధించి పోలీస్ ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఆరుబయటకు పోవడం ఎవరికి మాత్రం ఇష్టం



ఇక్కడ అద్దె ఇళ్లకు మరుగుదొడ్లు ఉండవు. కేవలం స్నానపు గది మాత్రమే ఉంటుంది. మహిళలకు ఎవరికైనా కనీస అవసరాలు తీర్చుకునేందుకు ఆరుబయటలకు వెళ్లడం ఇష్టం ఉండదు. తప్పని పరిస్థితి. ఇక్కడ వారి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి కనీస వసతులు కల్పించాలని కోరుతున్నాం.

- సరస్వతి, చేనేత కార్మికురాలు, ఈపురుపాలెం

వసతులు కల్పించాలి



మాకు నలుగురు బిడ్డలు. నలుగురు ఆడపిల్లలే. ఇద్దరు ఎదిగిన బిడ్డలు. ఇద్దరు చిన్నవాళ్లు. వారిని కడుపులో పెట్టుకుని కాపాడుకోవాల్సిన పరిస్థితి. మేం ఉండే ఇళ్లకు మరుగుదొడ్లు ఉండవు. అనివార్యంగా వెలుపలకు వెళ్లాలి. ఎప్పుడు ఏ పరిస్థిత ఉంటుందో చెప్పలేం. ఇప్పుడు జరిగిన సంఘటన చూశారుగా. ఇప్పటికైనా పాలకులు, అధికారులు మాకు కనీస వసతులు కల్పించాలని కోరుతున్నాం.

- పుణ్యవతి, చేనేత కార్మికురాలు, ఈపురుపాలెం



సమావేశంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి

మంత్రి మండలి సమావేశంలో గొట్టిపాటి

అద్దంకి, జూన్ 24 : టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన తొలిమంత్రి మండలి సమావేశానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన గొట్టిపాటి రవికుమార్ చంద్రబాబు మంత్రి మండలి స్థానం పొందారు. ఇటీవల విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్ సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో

పంగులూరు, జూన్ 24 : గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో మ్యాత్యూబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం డయేరియా, పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో క్లోరినేషన్, ఓహెచ్ఎస్ఆర్‌లు శుభ్రపరచడం, క్లోరోస్కోప్‌ల సేకరణ, డ్రైడే, స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాలన్నీ పంచాయతీల పరిధిలో విధిగా చేపట్టాలన్నారు. ప్రజలు వినియోగించే తాగునీటిని టెస్ట్ చేసి రిపోర్ట్ అందచేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఈవోఆర్డీ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న సభ్యులు

చినగంజాం, జూన్ 24 : మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఉప్పుగుండూరు వివేకానంద సేవా సమితి వారు సోమవారం రాత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివేకానంద సేవా సమితి కార్యదర్శి పావులూరి శివాజీ మాట్లాడుతూ బాలబాలికలు విద్యాభివృద్ధి చెంది ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. గత పది సంవత్సరాలుగా ఈ పాఠశాలలోని విద్యార్థులకు సహకారం అందిస్తున్నామని అన్నారు. పాఠశాలలోని 1వ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు పలకలు, రాతపుస్తకాలు, స్టేషనరీలను సమితి సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంటీవీఎస్ శైలజకుమారి, ఉపాధ్యాయిని బి.సుకన్య, అంగన్‌వాడీ కార్యకర్త ఐ.శివకుమారి, ఉప్పుగుండూరు వివేకానంద సేవా సమితి సభ్యులు మాచవరపు చిరంజీవి, ఏఎన్ఎం కే.రమాదేవి పాల్గొన్నారు.

ఉపాధి పనులను కల్పించాలి

అద్దంకిటౌన్, మే 24: మండల పరిధిలోని అనేక గ్రామాల్లో పది రోజుల నుంచి ఉపాధి హామీ పనులు నిలిపివేశారని, వ్యవసాయ కార్మికులకు వెంటనే పనులు అప్పగించి ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు ఎంపీడీవో జీవీ సత్యనారాయణను కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏటా వంద రోజుల పని దినాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న కూలీల బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో సందర్భించి ఉపాధి హామీ పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, బకాయిల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పొనకా రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొమరగిరి హనుమంతరావు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలపై దృష్టి సారించాలి

చినగంజాం, జూన్ 24 : బడిఈడు పిల్లలు బయట లేకుండా పాఠశాలలో చేర్పించేలా దృష్టిసారించి, చర్యలు చేపట్టాలని జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరల్ ఆఫీసర్స్ సీఎంవో శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో నేను బడికి పోతా కార్యక్రమం పర్యవేక్షణలో భాగంగా మండల విద్యాశాఖాధికారి బీ అజయ్‌బాబు అధ్యక్షతన సీఆర్ఎంటీలు, కార్యాలయ సిబ్బందితో న్యూ ఎన్‌రోల్‌మెంట్, బడి బయట పిల్లల వివరాలు, స్టూడెంట్ కిట్ల పంపిణీపై సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బడి బయట పిల్లలు లేకుండా పాఠశాలల్లో వంద శాతం నమోదు లక్ష్యంగా పని చేయాలని సీఎంవో ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండల పరిధిలో స్టూడెంట్ కిట్ల పంపిణీ వివరాలను ఎంఈవోని అడిగి తెలుసుకున్నారు. నేను బడికి పోతా కార్యక్రమంపై సిబ్బందికి ఆయన పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ సత్యసాగర్, సీఆర్ఎంటీలు సురేంద్రకుమార్, సునీల్, రామకృష్ణారెడ్డి, ఆశీష్‌కుమార్, ఎంఐఎస్ మాజేటి మురళి, కంప్యూటర్ ఆపరేటర్ రాజు మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

డయేరియా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

అద్దంకిటౌన్, మే 24 : రానున్న రెండు నెలల్లో గ్రామాల్లో డయేరియా, పారిశుధ్యం, తాగునీటి వల్ల వచ్చే వ్యాధులు రాకుండా ప్రత్యేక దృష్టి పెట్టి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఈవోఆర్‌డీ హెల్త్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో 15 రోజులకోసారి వాటర్ ట్యాంక్‌లు శుభ్రం చేయించాలని, పైపులైన్లు లీక్‌లు లేకుండా చూడాలన్నారు. ట్యాంక్‌కు నీటిని నింపిన ప్రతి సారి క్లోరినేషన్ చేయాలన్నారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, దోమలు వ్యాప్తి చేందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని ఆరోగ్య కార్యకర్తల సమన్వయంతో ఎక్కడ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ బీ హనుమంతరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ పీ అనూష పాల్గొన్నారు.

కిరాతకులను కఠినంగా శిక్షించాలి

ఆర్యవైశ్యుల డిమాండ్

చీరాలటౌన్, జూన్ 24 : కంచర్ల సంతోష్‌ను హత్య చేసిన కిరాతకులను కఠినంగా శిక్షించాలని పలువురు ఆర్య వైశ్య ప్రముఖులు డిమాండ్ చేశారు. ఆదివారం సతీష్‌ను హత మార్చిన ఘటనను నిరసిస్తు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అంతేకాకుండా సాయంత్రం నుంచి మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్‌ను స్వచ్ఛందంగా మూసివేశారు. వన్‌టౌన్ సీఐకి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ చిన్నపాటి వివాదాన్ని సర్దుకోకుండా కసిగా దాడి చేసి హత్య చేసినట్లు చెప్పారు. ఇటువంటి ఘటనలకు పాల్పడే వారిని బయటకు రానియ్యకుండా శిక్షించాలని డిమాండ్ చేశారు. తులాబంధు సురేష్, చిన్ని లీలాధరరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖరరావు, వేణు, సుబ్బయ్య, చీమకుర్తి బాలకృష్ణ, గుంటూరు ప్రభాకరరావు, వెంకటేశ్వర్లు, గజవల్లి శ్రీను, రఘు, మధు, అనీల్, రమణ, బ్రహ్మం, వేణుగోపాల్, బాలు, అమరా శివ పాల్గొన్నారు.



పోలేరమ్మతల్లి



విద్యుత్ ప్రభ

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

బల్లికురవ, జూన్ 24 : మండలంలోని గుంటుపల్లిలో సోమవారం పోలేరమ్మ తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మా దాల వీరమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రికి విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్య క్రమాలను నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

లోకేష్‌కు గరటయ్య శుభాకాంక్షలు



లోకేష్‌కు బొకే ఇచ్చి అభినందిస్తున్న గరటయ్య

అద్దంకి, జూన్ 24 : రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, విద్య, ఆర్‌టీజీ, హ్యూమన్ రిసోర్స్ డెవలెప్‌మెంట్ శాఖ మంత్రిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన లోకేష్‌ను మాజీ ఎమ్మెల్యే, బాపట్ల పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్ బాచిన చెంచుగరటయ్య కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే కొండయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 24 : ప్రాధాన్యతాక్రమంలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు ఎల్‌బీఎస్‌నగర్‌లోని జెండా చెట్టు వద్ద ఆయన అభిమానులు మొక్కుతీర్చుకునే కార్యక్రమంలో కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కొండయ్య మాట్లాడుతూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ఎమ్మెల్యే కొండయ్యకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపేందుకు పోటీ పడ్డారు. అనంతరం డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని, మసీదుకు ప్రహరీ నిర్మించాలని, దోమల బెడదను నివారించాలని కోరారు. దీనిపై కొండయ్య సానుకూలంగా స్పందించారు. అందరినీ పేరు, పేరు పలకరిస్తూ ఎన్నికల ప్రచారంలో పని చేసినవారిని ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు షేక్ అబ్దుల్ రహమాన్, షేక్ ఇలియాజ్, సయ్యద్‌బాబు, షేక్ జమీర్, షేక్ ఖలీమ్, సయ్యద్‌రియాజ్, షేక్ మస్తానమ్మ, సజ్జా వెంకటేశ్వరరావు, డేటా నాగేశ్వరరావు, ఉసురుపాటి సురేష్, స్థానికులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంలో పలువురు విభిన్న ప్రతిభావంతులు తమ సమస్యలు పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇచ్చారు. వడ్డెర సంఘం రాష్ట్ర ప్రతినిధులు, జిల్లా బాధ్యులు ఎమ్మెల్యే కొండయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. అభినందనలు తెలిపారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

27న ప్రవేశ పరీక్ష

అద్దంకిటౌన్, మే 24: అద్దంకిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 9 తరగతులల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హత కలిగిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గాయత్రిదేవి సోమవారం ప్రకటన తెలిపారు. 6వ తరగతిలో ఎస్సీ 4, ఎస్టీ 2, బీసీ 1 ఖాళీలు ఉన్నాయన్నారు. అలాగే 7వ తరగతిలో ఎస్సీ 2, బీసీ 2, ఓసీ 1, 9వ తరగతిలో ఎస్టీ 2 సీట్లు ఉన్నాయని, ఆసక్తి కలిగిన విద్యార్థినులు ఈ నెల 26వ తేదీ లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని 27వ తేదీన గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుందని ఆమె తెలిపారు.

నక్కలపాలెంలో నేత్రదానం

ఇంకొల్లు, జూన్ 24 : మండలంలోని పెదనక్కలపాలెంలో నేత్రాలను దానం చేశారు. గ్రామానికి చెందిన కామేపల్లి రత్తమ్మ(65) మృతి చెందగా, సోమవారం నేత్రాలను దానం చేశారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ సహకారంతో గుంటూరు శంకర కంటి వైద్యులు రత్తమ్మ నేత్రాలను సేకరించారు. నేత్ర దానానికి సహకరించిన కుటుంబసభ్యులు వెంకటేశ్వర్లు, మారుతీరావు,లక్ష్మిని రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరికమలేశ్వరరావు, జెట్టి స్వామి అభినందించారు.

సీసీ కెమెరాలను బాగుచేయాలి

ఇంకొల్లు, జూన్ 24 : ఇంకొల్లులో గతంలో దాతల సహకారంతో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సరిగ్గా పనిచేయడం లేదు. వీటిని వెంటనే పని చేసేలా చర్యలు తీసుకొని నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాత్రి వేళల్లో నిఘా పెంచాలని ప్రజలు కోరుకుంటున్నారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో వాహనదారులు సైతం ట్రాఫిక్ రూల్స్ పాటించడం లేదు. కెమెరాలను బాగు చేయించాలని కోరారు.

బండ్లమాంబ తిరునాళ్ల ప్రారంభం

నాగండ్ల(ఇంకొల్లు), జూన్ 24 : ఇంకొల్లు మండలంలోని నాగండ్ల గ్రామంలోని బండ్లమాంబ 27వ వార్షికోత్సవ తిరునాళ్ల సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పొంగళ్లు నైవేద్యాలు చెల్లించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ తిరునాళ్ల బుధవారం అత్యంత వైభవంగా జరపనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

7న మాదిగ జనజాతర సభ

అద్దంకిటౌన్, మే 24 : ఈదుమూడి గ్రామంలో జూలై 7వ తేదీన జరిగే మాదిగ జన జాతర కార్యక్రమానికి మాదిగలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆలూరి చిరంజీవి మాదిగ కోరారు. సోమవారం అంబేడ్కర్ సామాజిక భవనం వద్ద జనజాతరకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ గంగాధర్, ఎంఆర్‌పీఎస్ నాయకులలు ఎలీషా పాల్గొన్నారు.



రాజా మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

రాజా మృతి టీడీపీకి తీరనిలోటు

చినగంజాం, జూన్ 24 : చినగంజాం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ తాటి రాజశేఖర్ (63) వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. రాజశేఖర్ మృతదేహానికి టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజా మృతి పార్టీకి తీరని లోటుని టీడీపీ మండలాధ్యక్షుడు పొద వీరయ్య అన్నారు. పార్టీ అప్పగించిన ఏ బాధ్యతనైనా జాగ్రత్తగా నిర్వహించేవారని గుర్తు చేశారు. టీడీపీ నాయకులు పొదవీరయ్య, యార్లగడ్డ లక్ష్మి, టీ.జయరావు, సందు శ్రీనివాసరావు, ధర్మవరపు ఏసునారాయణ, షేక్ జిలాని, నరహరి శ్రీనివాసరావు, దేవతోటి నాగరాజు, గంటా వెంకటనారాయణ, టి.వెంకటేశ్వరరావు, జి.నరసింహారావు తదితరులు నివాళులర్పించినవారిలో ఉన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతిని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావు, సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాజశేఖర్‌కు భార్య శాంతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె నేహా అమెరికాలో ఉన్నందున అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



మొక్కు తీర్చుకుంటున్న దగ్గుబాడు టీడీపీ శ్రేణులు

అజ్మీర్ దర్గాలో టీడీపీ శ్రేణులు

దగ్గుబాడు(పర్చూరు), జూన్ 24: రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్ దర్గాలో కారంచేడు మండలం దగ్గుబాడు గ్రామానికి చెందిన టీడీపీ ముస్లింలు సోమవారం మొక్కులు తీర్చుకున్నారు. పర్చూరు ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయం సాధించడం, టీడీపీ అధికారంలోకి రావడంతో కోఆప్షన్ మాజీ సభ్యుడు షేక్ ఖాశీం ఆధర్వంలో ముస్లింలు అజ్మీర్ దర్గాకు వెళ్లి మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



శేషవాహనంపై ఊరేగుతున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి

మేదరమెట్ల, జూన్ 24 : మేదరమెట్లలో వేయించేసి ఉన్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఆదివారం రాత్రి అంకురార్పణతో మొదలయ్యాయి. సోమవారం వేకువ జామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అష్టదళపద్మారాధన నిర్వహించారు. అనంతరం హోమం, శ్రీచక్రపూజ, పండితులు నారాయణం బాలసుబ్రహ్మణ్యం, హైగ్రీవచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం శేషవాహనంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వహకులు పాదర్తి కాజారావు, మద్దాళి సంజీవరావు, ఆదూరి ప్రసాద్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

550 మందికి ఉచిత పరీక్షలు

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

మార్టూరు, జూన్ 24 : మార్టూరులో రాయల్ జూనియర్ కాలేజీ ఆవరణలో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు, పంగులూరు, ఇంకొల్లు వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని ఐఆర్ఎస్ లక్ష్మి సుజిత ప్రారంభించారు. దాదాపుగా 550 మందికి పైగా ప్రజానీకం మెగా వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. అదేవిధంగా ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న 55 మందిని గుర్తించి వారికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. అంతేగాకుండా గుండె పరీక్షలు, ఈసీజీ, పళ్లు, చర్మ వ్యాధులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశామన్నారు. అనంతరం శిబిరానికి వచ్చిన ప్రజానీకానికి భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు చిగురుపాటి రామారావు ముద్దన సతీష్, బొల్లినేని శిరీష డాక్టరు సుప్రజ మల్లారెడ్డి కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ వారికి రోటరీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సహకరించిన వీరగంధం శ్రీనివాసరావు భవానీ దంపతులకు రోటరీ అధ్యక్షులు తాళ్లూరి సాంబ శివరావు, ఇంకొల్లు అధ్యక్షుడు కమలేశ్వరరావు, పంగులూరు రోటరీ సెక్రటరీ కాలేషావలి ఇంకా చెన్నుపాటి బసవరాములు, జాష్టి వెంకట మోహనరావు, కొర్రపాటి కాజారావు, ఇంటూరి ఆంజనేయులు, షేక్ కాజాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ గ్రామంలో గడ్డివాములు దగ్ధం

రూ.6లక్షలకుపైగా ఆస్తి నష్టం



దగ్ధమవుతున్న వాములు

స్వర్ణ (పర్చూరు), జూన్ 24 : కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో అగ్ని ప్రమాదంలో గడ్డి వాములు దగ్ధమైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామంలోని జి.సురేంద్రబాబు అనే రైతుకు చెందిన 60 ఎకరాల్లోని రూ.6లక్షల విలువ చేసే గడ్డివాములు మంటలకు దగ్ధమయ్యాయి. అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగి వాములు దగ్ధం కావడంతో గ్రామస్థులు చీరాల అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి కారణాలు తెలియలేదు.





ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభం

- తొలిరోజే కలెక్టరేట్‌కు పోటెత్తిన జనం
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), జూన్ 24 : కొత్తగా రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరుతో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని కలెక్టరేట్ తిక్కన భవన్‌లో నిర్వహించారు. తొలిరోజే జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జనం పోటెత్తారు. కలెక్టర్ హరినారాయణన్ స్వయంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులను పిలిచి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇరిగేషన్, హౌసింగ్, భూ సమస్యలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు చెందిన అర్జీలు అధిక సంఖ్యలో వచ్చాయి. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ సేదుమాధవన్, డీఆర్వో లవన్న, జడ్పీ సీఈఓ కన్నమ నాయుడు, డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మూడు నెలల నుంచి గ్రీవెన్స్ కార్యక్రమం ఆగిపోయింది. ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరటంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పునఃప్రారంభమైంది.

- జగనన్న కాలనీల్లో నాసిరకం గృహాల అవినీతిపై విచారణ జరిపించాలని కోరుతూ బీజేపీ నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. నగరంలోని వెంకటేశ్వరపురంలో నిర్మించిన పక్కా గృహాలకు పగుళ్లు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ నిర్మాణాల్లో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ సత్వరమే విచారణ జరిపించాలని కోరారు.
- నెల్లూరులో మైసూర్ రాజ్యపాలకుడైన టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు చేయాలని ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మద్ జియా ఉల్‌హక్ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.

వచ్చే నెలలో రొట్టెల పండుగ

- నిర్వహణకు 17 నుంచి సన్నాహాలు
- కార్పొరేషన్ రూ.3.1 కోట్ల కేటాయింపు • 41 పనులకు టెండర్లు

నెల్లూరు (సిటీ), జూన్ 24 : రాష్ట్ర పండుగగా జరుపుకునే నెల్లూరులోని బారాషహీద్ రొట్టెల పండుగకు ఈసారి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. జూలై 17వ తేదీ నుంచి ఐదు రోజులపాటు స్వర్ణాల చెరువు చెంతన జరిగే ఈ వేడుకకు ముస్లింలతోపాటు హిందువులు భారీగా తరలివస్తారు. ఇందుకోసం నగర పాలక సంస్థ వివిధ ప్రజా అవసరాల పనులకు రూ.3.1 కోట్లు కేటాయించింది. పారిశుధ్యం, మంచినీరు, ప్రైవేట్ కూలీలు, చెత్తతరలింపునకు ప్రైవేట్ వాహనాలు, భోజనాలు తదితర



అంశాలతో కూడిన 41 పనులకు ఈ నిధులు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు టెండర్ల ప్రక్రియను ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేశారు. పండుగ నిర్వహణ ఏర్పాట్లలో కార్పొరేషన్ యంత్రాంగం నిమగ్నమైంది. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కొలువు తీరిన తరువాత తొలిసారిగా దర్గా వద్ద రొట్టెల పండుగ జరుగుతుండటంతో ప్రజాప్రతినిధులు కూడా అట్టహాసంగా నిర్వహించాలని సిద్ధమయ్యారు. దర్గా వ్యవహారాలన్నీ వక్ఫ్‌బోర్డు పరిధిలో ఉన్నా నిర్వహణ ఏర్పాట్లు కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్నాయి. అధికారులు, సిబ్బందికి విధులకు కేటాయించేందుకు దస్త్రాలు సిద్ధం చేస్తున్నారు. పారిశుధ్యం, మంచినీరు, మరుగు దొడ్ల నిర్వహణను తొలి ప్రాధాన్యంగా తీసుకుని పనులు మొదలుపెడుతున్న కార్పొరేషన్ అధికారులు గత అనుభవాలను నెమరువేసుకుంటూ ఏర్పాట్లు చేస్తున్నారు.

రైతుల సేవలో తరిస్తూ ప్రభుత్వ సంస్థలకు సేవలందిస్తూ ఆదాయాన్ని సమకూర్చుకుంటున్న జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీలో (డీసీఎంఎస్) 'లెక్క'లేని తనం నెలకొంది. ఇక్కడ జరుగుతున్న ఆర్థిక లావాదేవీలపై గడిచిన మూడేళ్లుగా ఆడిట్ జరగడం లేదు. ఈ విషయమై సహకార శాఖ ఆడిటర్లు పలుమార్లు నోటీసులు జారీ చేసినా బేఖాతరు చేస్తున్నారు. చట్ట విరుద్ధంగా ప్రైవేటు ఆడిటర్లతో ఆడిటింగ్ చేయించుకోవడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, ఇప్పటికైనా సహకార శాఖ ఆడిటర్ల చేత ఆడిటింగ్ చేయించాలని పలువురు తాజాగా జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)





పడిపోయిన వ్యాపార వృద్ధి

గడిచిన ఐదేళ్లలో భారీగా నిధులు పక్కదారి పట్టినట్లు ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో డీసీఎంఎస్ వ్యాపార వృద్ధి కూడా పడిపోయినట్లు చెప్పుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా డీసీఎంఎస్‌లో సిబ్బందిని నియమించుకోవడం, వారికి భారీగా జీతాలు చెల్లించడమే కాకుండా చాలా మందిని పర్మినెంట్ కూడా చేసినట్లు తెలుస్తోంది. ఎరువుల విక్రయాల్లో కూడా లెక్కలు తేలడం లేదని సమాచారం. ధాన్యం కొనుగోళ్లు జరిపినందుకు గానూ హమాలీ చార్జీలను ప్రభుత్వం డీసీఎంఎస్‌కు చెల్లించినా వాటిని హమాలీలకు చెల్లించలేదని గతంలో కొందరు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. ఆ తర్వాత కొంత మందికి కొద్ది మొత్తం మాత్రమే చెల్లించి మిగిలిన మొత్తాన్ని పక్కదారి పట్టించినట్లు హమాలీలు ఆరోపిస్తున్నారు. వైసీపీ నేతల చేతుల్లో డీసీఎంఎస్ కునారిల్లిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చట్ట ప్రకారం తాము ఆడిట్ చేయాలని సహకార శాఖ అధికారులు అనేక మార్లు డీసీఎంఎస్‌కు నోటీసులు పంపినా వారు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇతర సహకార సంస్థలకు ప్రభుత్వ అధికారులు ఆడిటింగ్ చేస్తుండగా ఒక్క డీసీఎంఎస్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఇకనైనా సహకార శాఖ ఆడిటర్ల చేత ఆడిటింగ్ చేయించాలంటూ పలువురు ఉన్నతాధికారులకు లేఖలు రాస్తున్నారు. మరి ఇప్పటికైనా ఉన్నతాధికారులు డీసీఎంఎస్‌పై దృష్టి పెడతారో.. లేదో.. చూడాలి.

డీసీఎంఎస్‌లో లెక్కలేని తనం

- మూడేళ్లుగా జరగని ప్రభుత్వ ఆడిట్ • ప్రైవేట్ ఆడిటర్లతో చేయిస్తున్న వైనం • పలుమార్లు నోటీసులు ఇచ్చిన సహకారశాఖ
- అయినా పట్టించుకోని డీసీఎంఎస్ అధికారులు • భారీగా నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు

రైతులకు సేవలందించడంలో డీసీసీబీ, డీసీఎంఎస్ సంస్థలది కీలక పాత్ర. డీసీసీబీ ద్వారా రైతులకు రుణాలు అందిస్తుండగా, డీసీఎంఎస్ ద్వారా ఎరువులు అందిస్తున్నారు. అదే సమయంలో డీసీఎంఎస్ సంస్థ ఇతర ప్రభుత్వ సంస్థలకు సేవలందిస్తూ ఆదాయాన్ని సమకూర్చుకుంటోంది. ధాన్యం కొనుగోళ్లు, పాఠశాలలకు అవసరమైన వస్తువుల సరఫరా, టీటీడీకి పప్పు దినుసుల సరఫరా వంటి అనేక వ్యాపారాలను గతంలో డీసీఎంఎస్ నిర్వహించింది. అటువంటి సహకార సంస్థ తీరు గడిచిన కొన్నేళ్లుగా వివాదాస్పదంగా మారింది.

• నిధుల వినియోగంపై ఆరోపణలు

ముఖ్యంగా డీసీఎంఎస్‌లో నిధుల దుర్వినియోగంపై అనేక ఫిర్యాదులు ఉన్నాయి. ఎంత ఆదాయం వస్తోంది? ఎంత ఖర్చు చేస్తున్నారు? వంటి లెక్క తేలడం లేదు. సహకార శాఖకు చెందిన ప్రభుత్వ ఆడిటర్లు చేత గడిచిన మూడేళ్లుగా ఆడిటింగ్ చేయించకపోవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో సహకార శాఖ ఆడిటింగ్ చేయగా, ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వంలో ఎందుకు ప్రైవేటు వ్యక్తుల చేత ఆడిటింగ్ చేయిస్తున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ అధికారులు ఆడిటింగ్ చేస్తే అవకతవకలు బయటపడే అవకాశముందని, అందుచేతనే ప్రైవేటు వ్యక్తుల చేత ఆడిటింగ్ చేయిస్తున్నారని సహకార శాఖలోని ఉద్యోగులే చెప్పుకుంటుండటం గమనార్హం.

నోటీసులు కూడా ఇచ్చాం

డీసీఎంఎస్‌లో మూడేళ్ల నుంచి మేము ఆడిటింగ్ చేయడం లేదు. ఆడిటింగ్ చేస్తామని సమాచారమిచ్చినా డీసీఎంఎస్ అధికారులు పట్టించుకోలేదు. ప్రైవేటు చార్టెడ్ అకౌంటెంట్స్‌తో ఆడిటింగ్ చేయిస్తున్నారు. ఇది చట్ట విరుద్ధం. ఇందుకు సంబంధించి షోకాజు నోటీసులు కూడా జారీ చేశాం.

- తిరుపతయ్య, జిల్లా సహకార ఆడిట్ అధికారి

పాలకవర్గం తీర్మానించి పంపింది

డీసీఎంఎస్‌లో ఉన్న ప్రభుత్వ షేర్ కేపిటల్‌ను చెల్లించారు. ప్రభుత్వ షేర్ కేపిటల్ లేనప్పుడు ప్రైవేటు ఆడిటర్లతో ఆడిటింగ్ చేయించుకోవచ్చు. ఈ కారణంగానే చార్టెడ్ అకౌంటెంట్ చేత ఆడిటింగ్ చేయించుకునేందుకు పాలకవర్గం తీర్మానించి ప్రభుత్వానికి పంపింది. సహకార శాఖ ఆడిటర్ల చేత ఆడిటింగ్ చేయించడంలో ఇబ్బందేమీ లేదు.

- వెంకటస్వామి, డీసీఎంఎస్ సీఎం

జిల్లా ప్రగతికి బాధ్యతగా కృషి చేస్తా

- నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి



నెల్లూరు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం జిల్లా ప్రగతికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి తెలిపారు. పాతిక సంవత్సరాల తరువాత పార్లమెంట్‌లో నెల్లూరు జిల్లా నుంచి తెలుగుదేశం ప్రాతినిధ్య స్వరం ప్రతిధ్వనించింది. 'ప్రభాకరరెడ్డి వేమిరెడ్డి అను నేను.. లోక్‌సభ సభ్యుడిగా...' అంటూ వీపీఆర్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ వేడుకను తిలకించడానికి వీపీఆర్ సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కుమారుడు అర్జున్‌రెడ్డి, కుటుంబ సభ్యులు అనిష్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకరరెడ్డి తదితరులు తరలివెళ్లారు. ప్రమాణస్వీకారం అనంతరం వీపీఆర్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబు నామీద నమ్మకంతో ఈ అవకాశం కల్పించారు. నెల్లూరు ప్రజలు నన్ను పెద్ద మెజారిటీతో ఆశీర్వదించారు. వీరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. ఇచ్చిన మాట ప్రకారం పార్లమెంట్ సెగ్మెంట్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా. జిల్లా ను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడం నా ప్రథమ లక్ష్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాకు కొత్త పరిశ్రమలు తీసుకొస్తా. పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి కృషి చేస్తా. కేంద్రం నుంచి జిల్లాకు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టుకొనేందుకు కృషి చేస్తా.' అని అన్నారు.

పోలీసు శాఖలో

తొలి వికెట్ పడింది!

- నెల్లూరు రూరల్ డీఎస్పీ బదిలీ
- హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు



వీరాంజనేయరెడ్డి

నెల్లూరు (క్రైం), జూన్ 24 : నెల్లూరు రూరల్ డీఎస్పీ పీ వీరాంజనేయ రెడ్డి ని తక్షణమే పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరాంజనేయరెడ్డిని వెంటనే విధుల నుంచి రిలీవ్ చేయాలని ఎస్పీ ఆరీఫ్ హఫీజ్‌ను ఆదేశించారు. ఈ ఆదేశాలతో వీరాంజనేయరెడ్డి రిలీవ్ కావడంతో రూరల్ ఇన్‌చార్జ్ డీఎస్పీగా నగర డీఎస్పీ డి శ్రీనివాసరెడ్డిని నియమించారు.

• గత ప్రభుత్వంలో ఎన్నో ఫిర్యాదులు

నెల్లూరు రూరల్ డీఎస్పీగా పి వీరాంజనేయ రెడ్డి 2022 నవంబరులో బాధ్యతలు స్వీకరించారు. ఈయన వ్యవహార శైలిపై ఆనాటి నుంచి అప్పటి ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర, జిల్లాస్థాయిలో పోలీసు అధికారులకు అనేక సార్లు ఫిర్యాదులు చేశారు. అప్పటి అధికార పార్టీ నాయకులు ఏది చెబితే అదే అన్నట్లుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ అధికార దుర్వినియోగం చేశారన్న అభియోగాలు ఆయనపై ఉన్నాయి. ప్రధానంగా సర్వేపల్లి, కోవూరు నియోజవర్గాల్లో అప్పటి ప్రతిపక్ష నాయకులను పోలీసులు పెట్టిన బాధలు అన్నీ ఇన్నీ కాదని, ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నిస్తే తిరిగి తమపైనే కేసులు బనాయించారని వందల సార్లు నాయకులు మీడియా ముందు మాట్లాడారు. ఇక ఇసుక, మట్టి, మద్యం, గ్రావెల్, రౌడీయిజం ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని అక్రమాలకు గతంలోని డీఎస్పీ కనుసైగల్లో పోలీసులు పనిచేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎన్నికల కోడ్ వచ్చాక కూడా అధికార పార్టీ నాయకులకు అండగా నెల్లూరు రూరల్ సబ్ డివిజన్‌లో పోలీసుల తీరు అనేక విమర్శలకు దారి తీసిన విషయం తెలిసిందే. టీడీపీ నేత, ప్రస్తుత ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వంటి ఎంతో మంది నాయకులు బదిలీ రూరల్ డీఎస్పీపై అనేక ఫిర్యాదులు చేశారు. చివరకు బదిలీతో జిల్లాను వీడాల్సి వచ్చింది.

వేడుకగా వెంగమాంబ గ్రామోత్సవం

- బ్రహ్మోత్సవాలకు తరలివస్తున్న భక్తులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూన్ 24 : దుత్తలూరు మండలం నర్రవాడలో శ్రీ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాతసేవ, గణపతి పూజ, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. వెంగమాంబ దంపతులను ప్రత్యేక పూలతో అలంకరించారు. అమ్మవారి గుండంలో వేలాది మంది భక్తులు కొబ్బరి వేసి తమ భక్తిని చాటుకొన్నారు. ఆలయ ఆవరణలో వివిధ దేవతామూర్తుల ప్రభలను తీర్చిదిద్దారు. రాత్రి వడ్డిపాళెంలోని వెంగమాంబ పేరంటాలు పుట్టినింటి నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం నర్రవాడ, గుదేవారిపాళెం, ఉలవారిపాళెం మీదుగా దేవస్థానం వరకు సాగింది. ఉదయగిరి సీఐ గిరిబాబు, దుత్తలూరు ఎస్ఐ ఉమాశంకర్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు.

• బ్రహ్మోత్సవాల్లో నేడు

వెంగమాంబ పుట్టినిల్లయిన వడ్డిపాళెం నుంచి నర్రవాడ పుర వీధుల్లో మంగళవారం గ్రామోత్సవం జరుగుతుంది.



భవిత కేంద్రాలకు భత్యం అందేనా!?

పదేళ్లు నిండినా పసిపాపల మనస్తత్వం వారిది... ఆకలేస్తే అన్నం పెట్టమని కూడా అడగలేరు.. ఎక్కడున్నారో ఏం చేస్తున్నారో కూడా అర్థం కాని అమాయకులు. అలాంటి దివ్యాంగ చిన్నారుల, మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణలో నిర్లక్ష్యం చూపడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. రవాణాభత్యం, సహాయకులకు ఇవ్వాల్సిన నగదు మూడేళ్లుగా ఇవ్వకపోవడంతోపాటు కేంద్రాలను కూడా సమీపంలోని పాఠశాలల్లోకి విలీనం చేశారు. దీంతో సరైన సౌకర్యాలు, వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- నెల్లూరు (వైద్యం)

- అందని పారితోషికాలు, పరికరాలు
- అంతంతమాత్రంగానే వసతులు
- ప్రత్యేకావసరాల పిల్లలకు తప్పని ఇక్కట్లు
- కొత్త ప్రభుత్వంపై తల్లిదండ్రుల గంపెడాశలు



భవిత కేంద్రంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు (ఫైల్)

మానసిక, శారీరక దివ్యాంగుల పిల్లలకు అవసరమై శిక్షణ అందించి, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సమగ్ర శిక్షాభియాన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం మండలానికి ఒక భవిత కేంద్రం ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా 38 భవిత కేంద్రాలు ఉండగా, వీటిలో 16 సొంత భవనాల్లో, మిగిలినవి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల్లో 3,500 మంది పిల్లలు ఉండగా, వీరికి సేవలందించేందుకు 66 మంది రీసోర్స్ పర్సన్‌లు, 14 మంది ఫిజియోథెరపిస్ట్‌లు, 46 మంది ఆయాలు ఉన్నారు. మానసిక నిపుణుల అంచనా మేరకు ప్రజ్ఞలబ్ధి 70శాతం కంటే తక్కువగా ఉంటే బుద్ధి మాంద్యం పర్యవేక్షణలో భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తామని అధికారులు చెబుతున్నారు. సిబ్బంది పర్యవేక్షణలో భవితకేంద్రాల్లో విద్య, వృత్తి నైపుణ్యం, దినచర్యలు, శారీరక దృఢత్వం శిక్షణలతో పాటు ఫిజియోథెరపీ అందిస్తారు. ప్రస్తుతం ఈ కేంద్రాలు సరిగా పనిచేయకపోవడంతో విద్యార్థులంతా ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో జిల్లాలో సహిత విద్య ప్రశ్నార్థకంగా మారింది. వీరికి సరైన సేవలందకపోవడంతో తల్లిదండ్రులే ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్లి థెరపీ అందిస్తున్నట్లు పలువురు తల్లిదండ్రులు తెలిపారు. భవిత కేంద్రాల్లో కూడా పిల్లల నిష్పత్తికి అనుగుణంగా సిబ్బంది కొరత ఉండడంతో వీరి సేవలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయంటున్నారు.

అందని భత్యం

భవితకేంద్రాల్లో చిన్నారులకు చెల్లించాల్సిన భత్యం నిలిచిపోయింది. ఒక్కో చిన్నారికి రవాణా భత్యం ప్రతినెలా రూ.300, ఎస్కార్ట్ అలవెన్స్ కింద రూ.250 అందచేస్తారు. కొంతమంది పిల్లలు మంచానికే పరిమితమై ఎటూ కదలలేని స్థితిలో ఉంటారు. అలాంటి వారికి ఐఈఆర్టీలు ఇంటి వద్దకే వెళ్లి సేవలందిస్తారు. వీరికి అవసరమైన వసతుల కల్పన నిమిత్తం హోంబేస్డ్ అలవెన్స్ కింద నెలకు రూ.200లు, అంధులకు రూ.200 రీడర్ అలవెన్స్ అందచేస్తారు. వీటితో పాటు 6 నుంచి 8వ తరగతి చదివే ప్రత్యేక అవసరాల బాలికలకు ఉపకార వేతనం కింద రూ.200 అందిస్తారు. ఇలా ఏటా పదినెలల కాలానికి నగదు అందచేస్తారు. కానీ గత మూడేళ్ల కాలంలో నిధులు విడుదల కాకపోవడంతో, కేంద్రాల్లో నిపుణులు లేక వ్యాయామం సైతం నిలిచిపోయింది. ప్రస్తుతం కేంద్రాలు నిర్వహిస్తున్నా చిన్నారుల భత్యానికి నిధుల కొరత వెంటాడుతోంది. దీనికితోడు పూర్తిస్థాయి సేవలు అందకపోవడంతో చిన్నారుల భవితపై నీలినీడలు కమ్ముకున్నాయి.

త్వరలో పంపిణీ చేస్తాం

భవిత కేంద్రాలకు సంబంధించి ఈ విద్యాసంవత్సరానికి రవాణా భత్యం, ఎస్కార్ట్ అలవెన్స్‌లు, హోమ్‌బేస్డ్ అలవెన్స్‌ల నిధులు త్వరలోనే జమచేస్తామని అధికారులు తెలిపారు. ఉన్నతాధికారులు పరిశీలించిన అనంతరం లబ్ధిదారులకు అందచేస్తామని ఎస్ఎస్ఏ అధికారులు చెబుతున్నారు. మున్ముందు మరిన్ని వసతులు కల్పిస్తామని, దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత కూడా తీసుకుని సర్వే చేపడుతున్నామని వారు తెలిపారు.

సదరంపై చిన్నచూపు

మానసిక, అంగ వైకల్యంతో బాధపడే పిల్లలకు ప్రభుత్వం రూ.3వేలు పింఛను అందచేస్తున్నది. దీనికి వైద్యులు నిర్ధారించే సదరం సర్టిఫికెట్ ఉండాలి. ముందుగా పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే వైద్యులు చుట్టపక్కల కొన్ని మండలాలకు కలిపి ఓ తేదీని నిర్ధారిస్తారు. ఇందుకు కనీసం మూడు నుంచి ఆరునెలల సమయం పడుతోంది. ఈ పత్రం వచ్చేసరికి మరో రెండు నెలలు గడిచిపోతోంది. ఈ సర్టిఫికెట్ ఇచ్చే సమయానికి పిల్లలు ఆయా కేంద్రాలకు వెళ్లలేక పోతున్నారు. దీనివల్ల సదరం సర్టిఫికెట్ రాక పిల్లలు రాయితీలకు దూరమైపోతున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా

ఆత్మకూరు, జూన్ 24: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో డయేరియాతో పాటు ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, ఆశావర్కర్లు, ఐసీడీఎస్, మున్సిపల్ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. అన్నిప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. ప్రతి మంగళవారం పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడంతో పాటు, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అందుకు ప్రతి సచివాలయం పరిధిలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశామన్నారు. మురుగుగుంటల్లో ఆయిల్‌బాల్స్ మేయడం, మలాథిన్ స్ప్రే చేయడంతో పాటు బ్లీచింగ్ చల్లించాలని తెలిపారు. ఇళ్ల మధ్యలో మురుగునీరు నిల్వ లేకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆత్మకూరు అర్బన్ ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి అస్మా, ఐసీపీఎస్ సీడీ పీవో సునీలత, ఏఈలు జూపల్లి ప్రసాద్, వరలక్ష్మి పాల్గొన్నారు.



ఉదయగిరి రూరల్: అవగాహన కల్పిస్తున్న బృంద సభ్యులు

ఉదయగిరి రూరల్: గండిపాళెంలో సచివాలయ, వైద్యఆరోగ్య సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులు, డయేరియాపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. తొట్లు, టైర్లలో ఉన్న నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. ప్రతిశుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఏ చిన్నపాటి రుగ్మతకు గురైనా అలసత్వం చేయక వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్పన, కార్యదర్శి జీ.అమర్‌నాథ్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రవి, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వరికుంటపాడులో మాట్లాడుతున్న ఎమ్పీడీవో వెంకటకృష్ణకుమారి

వరికుంటపాడు: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల దృష్ట్యా వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టి వ్యాధుల వ్యాప్తికి ఎలాంటి అవకాశం లేకుండా చూడాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు నెలల పాటు నిరంతరాయంగా కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజశేఖరరాజు, కార్యదర్శులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయండి



తరగతి గదిలో ఐఎఫ్‌ఈ బోర్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో గోపాల్

సంగం, జూన్ 24: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను పూర్తి చేయాలని డిప్యూటీ డీఈవో గోపాల్ ఆదేశించారు. సోమవారం ఆయన అన్నారెడ్డిపాళెం జిల్లా ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. నత్తనడకన జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలిక వసతులపై హెచ్‌ఎం లక్ష్మీదేవితో మాట్లాడారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి ప్రభుత్వం సరఫరా చేసిన ఐఎఫ్‌ఈ బోర్డులను వినియోగిస్తున్నారో లేదా అని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో జానికీరామ్, మల్లయ్య పాల్గొన్నారు.

ఉచితంగా భూసార పరీక్షలు



మర్రిపాడు: మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

మర్రిపాడు, జూన్ 24: ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ తెలిపారు. సోమవారం ఆయన మర్రిపాడు రైతుల పొలాలల్లో మట్టి నమూనాలు సేకరించి మాట్లాడారు. ఇప్పటికే మండలంలో 329మట్టి నమూనాలను నెల్లూరు భూసార పరీక్ష కేంద్రానికి పంపామన్నారు. ఈ పరీక్షలతో పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకొని, అందుకు అనువుగా మందులు ఉపయోగించుకో వచ్చన్నారు. నిస్సార మైన పంటల సాగుకు ఈ పరీక్షలు చాలా అవసరమని, ప్రతిరైతు ఈ అవకాశాన్ని ఉపయోగిం చుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యసాయ విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, లహరి, పవన్, రైతులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

ఆత్మకూరు, జూన్ 24: స్థానిక ఆది ఆంధ్ర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ ప్రణీత్ రూ.20 వేల విలువ చేసే విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు లక్కు కృష్ణప్రసాద్, ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర, డాక్టర్ కుమార్, తోడేడి అశోక్, పాఠశాల అభివృద్ధి కమిటీ, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఎం.నాగేంద్ర, పరిమళ, గాయత్రి, పూర్వ విద్యార్థులు వేము శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

వరికుంటపాడు, జూన్ 24: నార్త్‌కొండాయపాళెం పంచాయతీ కార్యదర్శిగా శివకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న వెంకటేశ్వర్లు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఏడాదికిపైగా విరువూరు కార్యదర్శి విష్ణు ఇన్‌చార్జీగా పనిచేశారు. విడవలూరు నుంచి బదిలీపై వచ్చిన శివకుమార్ రెగ్యులర్ కార్యదర్శి గా నియమించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బైకు ర్యాలీని జయప్రదం చేయండి

వింజమూరు, జూన్ 24: శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి మంగళవారం నియోజకవర్గానికి వస్తున్న కాకర్ల సురేష్‌కు కూటమి నాయకులు ఘన స్వాగతం పల కనున్నట్లు అందులో భాగంగా బైక్, వాహన ర్యాలీ నిర్వ హించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని తె పార్టీ కార్యాలయంలో ఈ విషయంపై ఆయన మాట్లాడారు. జలదంకి మండలం జమ్మలపాలెం నుంచి వింజమూరు మండలంలోని బొమ్మరాజు దగ్గర పార్టీ కార్యాలయం వరకు నిర్వహించే ఈ ర్యాలీని జయప్రదం చేయాలని నాయకులను పిలపునిచ్చారు. మధ్యాహ్నం 3గంటల నుంచి ఈ ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ఆత్మకూరు, జూన్ 24: ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యల పరిష్కారానిక చర్యలు చేడతామని ఇన్‌చార్జ్ ఆర్డీవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు 9మంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు ఇచ్చారు. కార్యక్రమానికి పలు శాఖల అధికారుల గైర్హాజరయ్యారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీవో ప్రేమ్‌కుమార్

సంగం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రమాదేవి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సమస్యల పరిష్కా ర వేదిక (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెస్సల్ సిస్టం) పేరుతో నిర్వహించాలని టీడీపీ ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.




సంగం: అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దారు రమాదేవి


ఉదయగిరి: స్థానిక మండల రెవె న్యూ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్యక్రమాన్ని తహసీల్దారు నెహ్రూబాబు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తీసుకవస్తే సత్వరమే సమస్యలను పరిష్కరిం చేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

పురుషామృగ వాహనంపై కోటేశ్వరస్వామి

సంగం, జూన్ 24: దువ్వూరు గంగా పార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఆదివారం అర్ధరాత్రి పురుషామృగ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వేదపండితులు మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో పూజారి చదలవాడ శివకుమార్ చార్యులు గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



పురుషామృగ వాహనంపై స్వామివారు



శ్రీకృష్ణుడి వేషధారణలో ఆత్మారాముడు

కుంకుమార్చన పూజలు

ఉదయగిరి: గంగిరెడ్డిపల్లి అనంతపురి గంగాభవానికి మహిళలు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి కాయాకర్పూరం, కుంకుమ తీసుకొని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొన్నారు. ఆలయం వద్ద అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఎలక్ట్రికల్ ప్రభపై గ్రామోత్సవం చేపట్టగా సిరి ఈవెంట్స్ చెక్కభజన చేపట్టారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు చంద్ర మధుసూదన్‌రావు, మన్నేటి శ్రీనివాసులరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, గంగాధర్, పాపిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

శ్రీకృష్ణుడి వేషధారణలో..

సంగం: అన్నారెడ్డిపాళెం సీతా లక్ష్మణ సమేత ఆత్మారామస్వామి ఆదివారం అర్ధరాత్రి పొన్నమానుపై శ్రీకృష్ణుడి వేషధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం నిర్వ హించిన గ్రామోత్సవంలో భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి వేదగిరి సత్యనారాయణచార్యాలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అక్రమంగా ఏర్పాటు చేసిన కంచె తొలగింపు

మర్రిపాడు, జూన్ 24: మండలంలో అక్రమార్కులు ప్రభుత్వ భూముల ఆక్రమణలతో పెట్రేగిపోతుండటంతో తహసీల్దారు సీతారత్నం సోమవారం అక్రమణలపై ఉక్కుపాదం మోపారు. వైసీపీ మహిళా నాయకురాలు ఇటీవల ఏకంగా తహసీల్దారు కార్యాలయానికి సంబంధించిన సర్వే నెంబర్ 427లో ఎకరా భూమిని ఆక్రమించి, ఆ భూమి చుట్టూ ఇనుప కంచె వేశారు. దాన్ని సోమవారం పోలీసుల సమక్షంలో పరిశీలించి తొలగింప జేశారు. ఆ భూమి ఇప్పటినుంచి రెవె న్యూ అధికారుల స్వాధీనంలో ఉంటుందన్నారు.



విద్యార్థినికి ఆర్థికసాయం

ఉదయగిరి రూరల్, జూన్ 24: గండిపాళెం మెడబలిపి తిరుపతయ్య కుమార్తె భూమిక విద్యాభ్యాసానికి గ్రామానికి చెందిన జీఎంకే ట్రస్టు అధినేత, మండల ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.20వేలను సోమవారం ట్రస్టు ప్రతినిధులతో కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు బీ.వెంకటేశ్వర్లు, రాపల్లి తిరుపతి పాల్గొన్నారు.

చలో వరంగల్‌ను జయప్రదం చేయండి

ఉదయగిరి రూరల్, జూన్ 24: వచ్చేనెల 7వ తేదీన జరుగనున్న చలో వరంగల్ మాదిగల ఆత్మగౌరవ కవాతు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఎస్పీ, ఎమ్మార్పీ ఎస్ జాతీయ, రాష్ట్ర నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, బకీరు జామవా మాదిగలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఏబీఎం కాంపౌండ్‌లో ఎమ్మార్పీ ఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమైయ్యారు. ఇప్పటికే గ్రామ కమిటీలను పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు గొల్లపల్లి మోహన్, బెజవాడ బాలగురవయ్య, గంగపట్ల సింహాద్రి, కిరణ్, అర్జున్, విజయ్, రవి పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' పై అవగాహన

వరికుంటపాడు, జూన్ 24: గ్రామాల్లో డ్రాపౌట్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి తెలిపారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో 'నేను బడికి పోతా' అనే కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు అరుణాదేవి, ఎంఈవోలు షావుద్దీన్, రమ ణయ్య, కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పలు శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

మర్రిపాడు, జూన్ 24: యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మోహన్‌ప్రసాద్ సోమవారం ఆయన మండలంలోని పాఠశాలలను సందర్శిస్తూ ఉపాధ్యాయులతో సంఘం సభ్యత్వ నమోదును చేయించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

ఉదయగిరి: గంగిరెడ్డిపల్లి, వెంకట్రావుపల్లి పాఠశాలల్లో యూటీఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎడమ తిరుపతయ్య, గాజులపల్లి సుబ్బారెడ్డి, ఫణిరాజ్, మున్నా, సారధి, రామాంజనేయులు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కావలి,జూన్24: పట్టణంలో జ్వరాలు, మలేరియా, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సచివాలయ శానిటేషన్, ఇమ్యునిటీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడా చెత్త చెదారం నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. మురుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా పూడిక తీయాలని ఆదేశించారు. ఎక్కడా గుంటలు, మంచినీటి పైప్‌లైన్ల వాల్వ్‌ల గుంటల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు సమావేశంలో మున్సిపల్ డీఈ సాయిరామ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కావలి రూరల్ : నీటి ద్వారా సంక్రమించే డయేరియా వ్యాధి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఐ. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కావలి మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎమ్పీడీవో శ్రీధర్ అధ్యక్షతన సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఈ మాట్లాడుతూ గ్రామాల్లోని వాటర్ ట్యాంకులు 15 రోజులకు ఒక్కసారి శుభ్రపరచాలన్నారు. పైప్ లైన్లు ఎక్కడా లీక్‌లు కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ క్రిష్ణచైతన్య, తుమ్మలపెంట వైద్యాధికారి అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



కావలి : మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్



లింగసముద్రం : ప్రసంగిస్తున్న ఎంపీడీవో శేషుబాబు

లింగసముద్రం : మండలంలోని అన్ని గ్రామాల్లో డయేరియా నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో యు శేషుబాబు తెలిపారు. సోమవారం లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేయించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీ రమేష్, సీహెచ్‌వో జీ శ్రీనివాసులు, ఏఈ సాగర్, ఎంఈవో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారువేటలో వరదరాజస్వామి



అశ్వవాహనంపై వరదరాజస్వామి

అల్లూరు : మండలంలోని నార్తుమోపూరు వరదరాజస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పారువేట నిర్వహించారు. స్వామివారిని అశ్వవాహనంపై అలంకరించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి



లోకేష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఇంటూరి

కందుకూరు, జూన్ 24: రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్‌ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఉదయం లోకేష్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించగా సాయంత్రం నాగేశ్వరరావు అమరావతికి వెళ్లి లోకేష్ చాంబర్‌లో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందచేశారు.

10 మంది పాఠశాలలో చేరిక

కొండాపురం : నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎర్రబాలెం గ్రామ ఎస్టీకాలనీలో బడి ఈడు పిల్లలు 10 మందిని విద్యాశాఖ అధికారులు సోమవారం పాఠశాలలో చేర్పించారు. గ్రామంలో పాఠశాల మూతపడడంతో సమీప భీమవరప్పాడు ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో సాయిపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం ఐ.బాలక్రిష్ణయ్య, గ్రామస్థులు కొమ్మి ప్రభాకర్, ఉపాధ్యాయులు వెంకటరావు, భీమవరప్పాడు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వి.మాధవ, ఉపాధ్యాయుడు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులు 'నేను బడికి పోతా' అనేలా సహకరించాలి

అల్లూరు : నేను బడికి పోతా.. అంటూ ప్రతి చిన్నారి అనేలా తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈవో రవీంద్రనాథ్ అన్నారు. పట్టణ పరిధిలోని రామాపురం గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా సోమవారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో వై.శాంతకుమారి పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు



వలేటివారిపాలెం, జూన్ 24 : మండలంలోని బడేవారిపాలెం గ్రామ సమీపంలో సోమవారం మధ్యాహ్నం పేకాట శిబిరంపై ఎస్‌ఐ బాలమహేంద్రనాయక్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ 80,570 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా స్వర్ణలత, సలీంబేగ్

కావలిటౌన్ : రోటరీ క్లబ్ కావలిశాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా సోమశిల స్వర్ణలత, మొగల్ సలీంబేగ్‌లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. వెంగళరావునగర్‌లోని రోటరీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి రోటరీ క్లబ్ జిల్లా బాధ్యులు డాక్టర్ మాధవరెడ్డి అధ్యక్షత వహించారు. నూతన కమిటీ నియామక అధికారిగా పాల్గొన్న పీ కేశవ్‌రెడ్డి నేతృత్వంలో అధ్యక్ష, కార్యదర్శులు, డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథులుగా రోటరీ ప్రముఖులు భర త్‌కుమార్ రెడ్డి, బీ సురేంద్ర రెడ్డి,కే మునిగిరీష్, వీ నాగస తీష్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో సఫ్దార్ కిర్మాణీ, దినేష్, వెంకటసుబ్బయ్య, జయచంద్రానాయుడు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పేరు పెట్టడం హర్షనీయం

కందుకూరు : విదేశీ విద్యాపథకానికి అంబేడ్కర్ విదేశీ విద్యగా పేరుమారుస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవటం హర్షనీయమని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాజంలో దళితులు ఆత్మగౌరవంతో తలెత్తుకుని తిరిగేలా చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు.

జలదంకిలో పారిశుధ్య పనులు

జలదంకి : స్థానిక గ్రామ పంచాయతీలో ఉపసర్పంచి కూరపాటి మాలకొండారెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. మొదటిరోజు పెద్దచెరువు కట్టకింద ఉన్న చెత్తను తొలగించారు. సోమవారం డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించారు.

మందాటి చెరువులో ఆక్రమణలు తొలగించాలని ధర్నా

కావలి,జూన్24: మందాటి చెరువు ఆక్రమణలను తొలగించి, చెరువును కాపాడాలని మందాటి చెరువు పరిరక్షణ సమితి నాయకుడు, కనుమూరు భాస్కర్‌రెడ్డి, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి కోరారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద వారు ధర్నా చేసి ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ ముసునూరు, మందాటి చెరువుల లోతట్టు,చుట్టుపక్కల భూములను ఆక్రమించుకుని అక్రమంగా నిర్మాణాలు చేపట్టారన్నారు. ఆక్రమణలు తొలగించి చెరువును కాపాడాలన్నారు. అలాగే పాపిరెడ్డి చెరువును కూడా బడాబాబులు ఆక్రమించారని చెప్పారు. ఆక్రమణదారులకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సహకరిస్తున్నారని చెప్పారు. స్పందించిన ఆర్డీవో శీనానాయక్ ప్రభుత్వ భూములు ఆక్రమణలపై విచారణకు ఐదు కమిటీలు వేశామని వివరించారు. కార్యక్రమంలో రమణయ్య, దుగ్గిరాల జార్జిప్రసాద్‌రెడ్డి,రమణయ్య, హరినాథ్ పాల్గొన్నారు.

దళిత యువకుడి మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలి

కందుకూరు, జూన్ 23: పట్టణంలోని ఉప్పుచెరువు కాలనీకి చెందిన దళిత యువకుడు ఎనుబోరి కిషోర్ మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నందున, సమగ్ర దర్యాప్తు జరపాలని వామపక్ష, దళిత బహుజన ప్రజాసంఘాల నాయకులు కోరారు. సోమవారం వారు డీఎస్పీ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. కిషోర్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, అతనికి ఈత కూడా వచ్చని, అయితే ఆయన నీటిలో మునిగి చనిపోయి శవంగా కనిపించటం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో విచారణ జరపాలని డీఎస్పీ శ్రీనివాస్ సీఐ హఫీజ్‌ను ఆదేశించారు. డీఎస్పీని కలిసిన వారిలో దళితసంఘాల నేతలు బొక్క వెంకటేశ్వర్లు, పాలేటి కోటేశ్వరరావు, ముప్పవరపు కిషోర్, బూసి సురేష్‌బాబు, షేక్ హుస్సేన్, రేణమాల అయ్యన్న, హరిప్రసాద్, చనమాల కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న దళిత, ప్రజాసంఘాల నాయకులు

నేడు తెలుగుదేశం పార్టీ శ్రేణుల బైక్ ర్యాలీ



జలదంకిలో సమావేశమైన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

జలదంకి,, జూన్24: కాకర్ల సురేష్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసి మొదటిసారిగా నియోజకవర్గానికి మంగళవారం రానుండటంతో ఘనస్వాగతం పలికేందుకు మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు సోమవారం సమావేశమయ్యారు. టీడీపీ మండల అధ్యక్షుడు పీ మధుమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జనసేన మండల కన్వీనర్ తోట మురళీ, బీజేపీ మండల అధ్యక్షుడు కంచర్ల శరత్ పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం 3గంటలకు జమ్మలపాలెం వద్ద ఎమ్మెల్యేకు భారీ స్వాగతం పలికి, అక్కడి నుంచి మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. వేలాదిగా జమ్మలపాలెంకు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేతలు పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నేతలు వంటేరు జయచంద్రారెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, మునగాల తిరుమలరెడ్డి, జనసేన జిల్లా నేత నిమ్మలపల్లి రామ్‌చైతన్య, జమ్మలపాలెం మాజీ సర్పంచి నక్కా మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : ఉదయగిరి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కాకర్ల సురేష్ మంగళవారం నియోజకవర్గంలో అడుగిడుతున్న సందర్భంగా జలదంకి మండలం జమ్మలపాలెం నుంచి మంగళవారం బైక్‌ర్యాలీ ప్రారంభమవుతుందని టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి తెలిపారు. జలదంకి మండలం నుంచి కలిగిరి మండలంలోకి ప్రవేశించే సందర్భంగా భారీ స్వాగత ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని 12 అర్జీలు

కందుకూరు, జూన్ 24 : స్థానిక సబ్‌కలెక్టరు కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జి సబ్ కలెక్టరు టీ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సమస్యలపై 12 అర్జీలు అందజేశారు. ఈ సమస్య ల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకునేలా సంబంధిత విభాగాలకు ఆదేశాలు జారీచేశామని సబ్ కలెక్టరు తెలిపారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి సబ్ కలెక్టరు పద్మావతి

అర్జీలు అక్కడే పరిష్కరించకుంటే చర్యలు

కావలి : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఆర్డీవో శీనా నాయక్ తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజాసమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు

చిట్రగుంట : మండలంలో అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్లు, ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని తహసీల్దారు వెంక టరత్నం అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి చెరువు ఆక్రమణల తొలగింపును ఇరిగేషన్ అధికారి జితేంద్రర్‌రెడ్డి సోమవారం చేపట్టారు. ఇబ్రహీంపేట, కప్పరాళ్ళతిప్ప మధ్య ఏర్పాటు చేసిన లేఅవుట్లో చెరువుకు సంబంధించిన భూమి ఉందని అధికారులకు కొందరు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేయగా, 2.57 ఎకరాలు ఉందని, అందులో ప్రహరీ నిర్మాణం చేపట్టడంతో తొలగింపు చర్యలు చేపట్టారు.

దాడి చేశారని ఫిర్యాదు

కావలి రూరల్ : పట్టణంలోని జనతాపేటకు చెందిన బెల్లంకొండ హరిక్రిష్ణపై అదే ప్రాంతానికి చెందిన వెంకటమహేష్, మరికొందరు రాడ్‌తో దాడిచేసి గాయపరిచినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు, జనతాపేట నార్తుకు చెందిన హరిక్రిష్ణ భార్య పద్మ ఆదివారం రాత్రి ఇంటి ముందు మంచం వేసుకుని పిల్లలకు అన్నం పెడుతున్నది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న అదే ప్రాంతానికి చెందిన శిరీష 'మీరు ఇంటి ముందు మంచం వేస్తే.. మేము ఎలా వెళ్లాలి' అని గొడవకు దిగటంతో ఆమె భర్త మహేష్, మరిది వెంకటస్వామి కూడా అక్కడకు వచ్చారు. అప్పటికే అక్కడకి వచ్చిన పద్మ భర్త హరిక్రిష్ణ వారిని మందలించారు. దీంతో వారు రాడ్‌తో హరిక్రిష్ణ తలపై కొట్టారు. తీవ్రగాయాలతో ఆయన వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గోపిచంద్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డయేరియా నివారణపై సమావేశం

చిట్రగుంట : వాతావరణంలో వస్తున్న మార్పులు, తాగునీటి కాలుష్యంతో డయేరియా వచ్చే అవకాశం ఉందని, దాన్ని నివారించేందుకు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. బోగోలు ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో జమీఉల్లా అధ్యక్షత వహించారు. వ్యాధిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యాధికారులకు తెలియ చేయాలని కోవూరుపల్లి వైద్యులు నిత్యప్రశాంతి పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు.